10 నుంచి ఆరోగ్యశ్రీ

సేవలు బంద్!

ఏడాదిగా బకాయిలు చెల్లించలేదు

పరిష్కరించకుంటే సేవలు నిలిపివేస్తాం

సర్కారుకు ప్రైవేటు ఆస్పత్రుల అల్టిమేటం

ఏడాదిలో రూ.920 కోట్లు చెల్లించామంటున్న వైద్యశాఖ 3

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 8-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 281 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: నవమి మ. 2.26 తదుపరి దశమి; నక్షత్రం: అశ్విని సా. 4.29 తదుపరి భరణి వర్జ్యం: మ. 12.42-2.13, రా. 1.32-3.02; దుర్ముహూర్తం: ఉ. 11.59-12.43; అమృతఘడియలు: ఉ. 9.41-11.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.52 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిధుల దుర్వినియోగం కనిపిస్తోందన్న హైకోర్టు.. కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత

అరెస్టుకు వేళాయెనా?

ఫార్ములా-ఈ.. రేపు ఏసీబీ విచారణకు కేటీఆర్

ఆయన అరెస్టుకు మార్గం సుగమం!.. నేడు హాజరవనున్న అర్వింద్‌కుమార్

లాయర్ల సమక్షంలోనే విచారణ జరగాలి.. నేడు హైకోర్టులో కేటీఆర్ పిటిషన్

గ్రీన్ కో కార్యాలయాలకు ఏసీబీ.. హైదరాబాద్, మచిలీపట్నంలో తనిఖీలు

కీలక రికార్డుల స్వాధీనం! ఏసీబీ ఆఫీసుకు బంజారాహిల్స్ పోలీసులు..

16న విచారణకు రండి.. కేటీఆర్‌కు ఈడీ సమన్లు



హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కేటీఆర్‌పై ప్రాథమిక కేసు ఉంది!



ఈ దశలో దర్యాప్తును అడ్డుకోవడం సరికాదు

మంత్రిమండలి ఆమోదం, ఆర్థికశాఖ అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులను వాడారు

విదేశీ కంపెనీకి సొమ్ము చెల్లించాలని ఆదేశించారు

నిధుల దుర్వినియోగం జరిగినట్టుగా కనిపిస్తోంది

దర్యాప్తునకు ఈ ఆధారాలు చాలు: హైకోర్టు 13

కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన న్యాయస్థానం

అరెస్ట్ నుంచి పది రోజులు రక్షణ ఇవ్వాలన్న విజ్ఞప్తికీ నో

సుప్రీంను ఆశ్రయించిన కేటీఆర్.. కేవియట్ వేసిన సర్కారు

హైదరాబాద్/మచిలీపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసు విచారణలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) అధికారులు దూకుడు పెంచారు. కేటీఆర్ విచారణకు సంబంధించి అన్ని రకాల డాక్యుమెంట్లను సేకరిస్తున్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడంతో పాటు కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని హైకోర్టు స్పష్టం చేయడంతో ఆయన అరెస్టుకు మార్గం సుగమమైనట్లేనని భావిస్తున్నారు. గురువారం కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరు కావాల్సి ఉండడంతో బీఆర్ఎస్ నేతలు తమ లీగల్ టీంతో చర్చలు జరిపారు. తదుపరి కార్యాచరణపై చర్చించారు. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ కేటీఆర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. దానిపై రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసింది. దీంతో ఆయనకు అరెస్టు నుంచి రక్షణ లభించకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఫార్ములా-ఈ రేసు తొలి ఒప్పందంలో స్పాన్సరర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్‌జెన్, దాని మాతృ సంస్థ గ్రీన్ కో కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. ఏపీ, తెలంగాణలో మొత్తం ఆరు చోట్ల ఏసీబీ బృందాలు సోదాలు చేశాయి. హైదరాబాద్‌లోని మాదాపూర్, జూబ్లీహిల్స్‌లో; మచిలీపట్నంలోని కార్యాలయాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. మచిలీపట్నంలోని గ్రీన్‌కో సంస్థ ఎండీ చలమలశెట్టి సునీల్ ఇంట్లో గ్రీన్‌కో, ఏస్ నెక్స్ట్ జెన్ కార్యాలయాలను నడుపుతున్నారు. స్థానిక పోలీసులకు

మిగతా 13వ పేజీలో...

లొట్టపీసు కేసు పెట్టి

శునకానందం!

హైకోర్టు క్వాష్ పిటిషన్ మాత్రమే కొట్టేసింది 13

దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తాం..

అక్కడ న్యాయపోరాటం చేస్తా

రేవంత్.. నువ్వు మొగోనివైతే ఫార్ములా-ఈపై చర్చకు రా!

ముఖ్యమంత్రి ఒక బ్రోకర్.. ఒక మంత్రి కాంట్రాక్టర్: కేటీఆర్

రూ.25,700 కోట్లు

భారత్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు



కృత్రిమ మేధ, క్లౌడ్ ఇన్‌ఫ్రా విస్తరణకు ఖర్చు పెడతాం

2030 నాటికి కోటి మందికి ఏఐ నైపుణ్య శిక్షణ

'అడ్వాంటైజ్ ఇండియా' రెండో విడతలో భాగంగా..

ఏఐ ఆవిష్కరణల రంగంలో భారత్ లీడర్‌గా ఎదుగుతోంది: మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల

బెంగళూరు, జనవరి 7: భారతదేశంలో కృత్రిమ మేధ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ సామర్థ్యాల విస్తరణకు, కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు, యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి.. 3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.25,700 కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటించారు. అలాగే.. తాము చేపట్టిన 'అడ్వాంటైజ్ (ADVANTA(I)GE) ఇండియా' కార్యక్రమం రెండో విడతలో భాగంగా వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) కోటి మంది భారతీయులకు ఏఐ నైపుణ్యాలకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఏఐ ఆవిష్కరణల విషయంలో భారత్ వేగంగా లీడర్‌గా ఎదుగుతోందని ఆయన కొనియాడారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన.. మంగళవారం బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ పెట్టుబడుల ప్రకటన చేశారు. ఈ పెట్టుబడులు దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రజలకు, సంస్థలకు ఉపయోగపడతాయని సత్య నాదెళ్ల ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో ఏఐ ఇన్నోవేషన్‌ను వేగవంతం చేయడం ద్వారా.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) మార్చాలన్న ప్రధాని మోదీ స్వప్నం సాకారం కావడానికి ఈ పెట్టుబడి ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. మనదేశంలో ప్రస్తుతం ఉన్న మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్లకు అదనంగా మరొకటి 2026లో అందుబాటులోకి రానుంది. ఆయా డేటాసెంటర్ ప్రాంగణాల్లో క్లౌడ్, ఏఐ మౌలికసదుపాయాలను మైక్రోసాఫ్ట్ ఈ పెట్టుబడుల సాయంతో విస్తరించనుంది. దేశంలో నానాటికీ పెరుగుతున్న ఏఐ స్టార్టప్‌లు, పరిశోధకుల అవసరాలను తీర్చే 'ఏఐ కంప్యూటింగ్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయనుంది. మనదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఏఐ ఇన్‌ఫ్రా, డేటాసెంటర్ల అభివృద్ధికి మైక్రోసాఫ్ట్ సంస్థ వందల కోట్ల డాలర్లు గుమ్మరిస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే ఇలా 8000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.6.8 లక్షల కోట్లు) ఖర్చు పెట్టేందుకు ప్రణాళికలు రచించింది. ఆశాభావం వ్యక్తమవుతోంది. మైక్రోసాఫ్ట్ సంస్థ మనదేశంలో 2024లో ప్రారంభించిన 'ఎడ్వాంటైజ్ ఇండియా' పథకంలో



మిగతా 2వ పేజీలో...

హైకోర్టు చీఫ్ జస్టిస్

అలోక్ అరాధే బదిలీ!

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేను బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి మంగళవారం సిఫారసు చేసింది. అలాగే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్న దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ చేయాలని కూడా సిఫారసు చేసింది. సీజే అలోక్ అరాధే బాంబేకు బదిలీ అయితే తెలంగాణ హైకోర్టుకు కొత్త సీజే నియమితులు కానున్నారు. ఆ ఉత్తర్వులు వెలువడే వరకు అత్యంత సీనియర్ న్యాయమూర్తి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తారు. సీజే అలోక్ అరాధే 2023 జూలై 19న ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 18 నెలలుగా చీఫ్ జస్టిస్‌గా కొనసాగుతున్నారు.





మెట్రో, రేడియల్ రోడ్లు, కారిడార్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

మార్చి నెలాఖరుకు

మెట్రో డీపీఆర్‌లు సిద్ధం

శామీర్‌పేట్-మేడ్చల్ మెట్రోల ప్రారంభ స్టేషన్ వద్ద భారీ కూడలి

హెచ్‌జీసీఎల్ ఆధ్వర్యంలో రేడియల్ రోడ్ల నిర్మాణం: సీఎం రేవంత్‌రెడ్డి

మెట్రో, ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్లపై ఉన్నతాధికారులతో సమీక్ష

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ, శామీర్‌పేట్, మేడ్చల్‌లో మెట్రో మార్గాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) మార్చి నెలాఖరు లోపు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకేసారి ప్రారంభమయ్యేలా చూసుకోవాలని, అధునాతన వసతులతో భారీ కూడలి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు ప్రతి పనికి నగరంలోకి

మిగతా 14వ పేజీలో...

దాడి.. ప్రతిదాడి!

బీజేపీ కార్యాలయంపై దాడికి యూత్ కాంగ్రెస్ నేతల యత్నం





బీజేపీ కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్-బీజేపీ కార్యకర్తల బాహాబాహీ; గాంధీభవన్ ముందున్న ఫ్లెక్సీని చింపుతున్న బీజేపీ కార్యకర్త

అడ్డుకున్న బీజేపీ కార్యకర్తలు.. ఇరువర్గాల మధ్య తీవ్రఘర్షణ.. రాళ్లు, కోడిగుడ్లు విసురుకుని కొట్టుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తం

దాడికి ప్రతిగా కాంగ్రెస్ ఆఫీసు ముట్టడికి బీజేపీ నేతల యత్నం.. ఇరుపార్టీల నేతలపై కేసులు.. 8 మంది కాంగ్రెస్ కార్యకర్తల అరెస్ట్

దాడి.. పిరికిపంద చర్య: కిషన్ రెడ్డి

మా కార్యకర్తలు తల్చుకుంటే గాంధీ భవన్ పునాదులు కూడా మిగలవ్: బండి సంజయ్

ఎవరు ఎవరిపై దాడి చేసినా ఉపేక్షించం: భట్టి

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హాట్/మల్కాజిగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రియాంక గాంధీపై బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిధూరీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ.. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మెరుపుదాడికి యత్నించారు. వారిని బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో.. దాదాపు గంటన్నరపాటు ఇరు పార్టీల నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ దాడికి ప్రతిగా.. బీజేపీ శ్రేణులు కూడా

మిగతా 12వ పేజీలో...



సైబర్‌నేరాలు..

బ్యాంకులదే బాధ్యత

మూడ్రోజుల్లోపు ఫిర్యాదు చేస్తే బాధితులకు పరిహారం చెల్లించాలి

ఖాతాదారులూ జాగ్రత్తగా ఉండాలి

గువాహటికి చెందిన ఓ బాధితుడి కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు

94 వేలు చెల్లించాలని ఎస్‌బీఐకి ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 7: కస్టమర్ కేర్ మోసాలు.. మాల్‌వేర్‌తో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసే సైబర్ నేరాల విషయంలో బాధితులకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా తమ ప్రమేయం లేకుండానే ఖాతాలోని డబ్బు పోగొట్టుకున్న బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. బ్యాంకులు పరిహారం ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. అయితే.. భారతీయ రిజర్వ్ బ్యాంకు

మిగతా 2వ పేజీలో...

టిబెట్-నేపాల్ సరిహద్దులో భారీ భూకంపం

128 మంది మృతి

7.1 తీవ్రతతో ప్రకంపనలు

150 సార్లు కంపించిన భూమి.. వెయ్యికి పైగా ఇళ్లు నేలమట్టం

కంపించిన ఎవరెస్ట్ బేస్ క్యాంప్.. 188 మందికి గాయాలు

శిథిలాల కింద పలువురు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం

రంగంలోకి చైనా సైన్యం, వైమానిక దళం

మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతతో సహాయ చర్యలకు ఆటంకాలు

భారత్‌లో ఉత్తరాది రాష్ట్రాలపైనా భూకంపం ప్రభావం 2



టిబెట్‌లోని ఓ గ్రామంలో భూకంపం ధాటికి కుప్పకూలిన ఇళ్లు



శ్రీతేజను పరామర్శించడానికి కిమ్స్ ఆస్పత్రిలోకి వెళ్తున్న అల్లు అర్జున్

అండగా ఉంటా!

వైద్య ఖర్చులన్నీ భరిస్తా.. మీకు జరగరాని నష్టం జరిగింది

శ్రీతేజ తండ్రి భాస్కర్‌తో హీరో అల్లు అర్జున్

కిమ్స్‌కు వెళ్లి బాలుడిని పరామర్శించిన సినీ నటుడు

ఆరోగ్య పరిస్థితిపై వాకబు.. 20 నిమిషాలు ఆస్పత్రి వద్దే

పోలీసులకు ముందే సమాచారం.. ఆస్పత్రి వద్ద బందోబస్తు

హైదరాబాద్ సిటీ/రాంగోపాల్‌పేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'మీకు జరగరాని నష్టం జరిగింది..మీకు అండగా నేనుంటా. ఇలా జరుగుతుందని అనుకులేదు. బాబు పూర్తిగా కోలుకునే దాకా బాధ్యత నాదే. వైద్య చికిత్సకు అయ్యే ఖర్చులన్నీ భరిస్తాను' అని శ్రీతేజ తండ్రి భాస్కర్‌తో సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు అల్లు అర్జున్ కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. అక్కడ చికిత్స పొందుతున్న

మిగతా 10వ పేజీలో...

ఢిల్లీలో మోగిన నగారా



ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు.. 8న ఫలితాలు

1.55 కోట్ల ఓటర్లు.. కొత్త వారు 2 లక్షల మంది

85 ఏళ్లు పైబడ్డ వారికి ఇంటివద్దే ఓటు

సీఈసీ రాజీవ్‌కుమార్ వెల్లడి.. అమల్లోకి కోడ్ 2

సమాచార కమిషన్ పదవులను

తక్షణమే భర్తీ చేయండి

బ్యూరోక్రాట్లనే కాదు.. ఇతరులనూ నియమించండి

రాష్ట్రాల్లో వారం రోజుల్లో ప్రక్రియ ప్రారంభించాలి 2

కమిషనర్లు లేక తెలంగాణలో కమిషన్ క్రియారహితం: సుప్రీం

ఎల్ఆర్ఎస్‌పై స్పెషల్ డ్రైవ్

భూభారతి చట్టం అమల్లోకి రావడానికి 45 రోజులు పట్టొచ్చు 14

తహసీల్దార్లు మ్యుటేషన్ దుర్వినియోగం చేయకుండా కొత్త రూల్

వీఆర్‌వోలకు సంక్రాంతిలోపే రాత పరీక్ష.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన వారికి ఈ పరీక్ష ఉండదు: మంత్రి పొంగులేటి

వీసీల నియామకంలో ప్రక్షాళన

- సెర్చ్ కమిటీలపై అధికారం గవర్నర్లకే
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 'నెట్' తప్పనిసరి కాదు.. కానీ పీహెచ్‌డీ ఉండాల్సిందే
- యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జనవరి 7: విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంలో ప్రక్షాళన తీసుకొస్తూ యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేసింది. పారిశ్రామిక రంగం, ప్రజా పాలన, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన సీనియర్ నిపుణులను వైస్‌ఛాన్సలర్లుగా నియమించాలని ప్రతిపాదించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ప్రమాణాలను కూడా యూజీసీ సవరించింది. ఈ పోస్టులో నియామకానికి ఇకపై జాతీయ అర్హత పరీక్ష (ఎన్ఈటీ)లో ఉత్తీర్ణత తప్పనిసరి కాదని పేర్కొంది. ప్రస్తుతం అమలులో ఉన్న 2018 నాటి నిబంధనల ప్రకారం పీజీ అనంతరం అదే సబ్జెక్ట్‌లో నెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు అర్హులు. కొత్త ముసాయిదాలో ఈ నిబంధనను తొలగించారు. తాజా మార్గదర్శకాల ప్రకారం... నాలుగేళ్ల డిగ్రీ లేదా పీజీ పూర్తిచేసిన వారు తమ సబ్జెక్టుకు భిన్నమైన రంగంలో పీహెచ్‌డీ చేసినప్పటికీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి అర్హులే. అలాగే నాలుగేళ్ల డిగ్రీకి భిన్నమైన సబ్జెక్టులో నెట్‌లో గానీ రాష్ట్ర అర్హత పరీక్ష (ఎస్ఈటీ)లో గానీ అర్హత సాధించిన వారు కూడా ఆయా విభాగాల్లో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకానికి కనీసం 75శాతం మార్కులతో నాలుగేళ్ల యూజీ డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో పీజీ డిగ్రీతో పాటు పీహెచ్‌డీ పూర్తిచేసి ఉండాలి. వర్సిటీలు, కళాశాలల్లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాలంటే పీహెచ్‌డీ తప్పనిసరి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు కనీసం 8 సంవత్సరాల పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిలో బోధనానుభవం ఉండాలి. అదే ప్రొఫెసర్ పోస్టుకు పదేళ్ల అనుభవం అవసరం. అదేవిధంగా గతంలో ఫ్యాకల్టీ పదోన్నతులకు ఉపయోగించిన అకడమిక్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (ఏపీఐ) వ్యవస్థను తొలగించారు. కొత్త నిబంధనలపై ఫిబ్రవరి 5లోగా అభిప్రాయాలు చెప్పాలని యూజీసీ కోరింది. అయితే, వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీని నియమించే అధికారాన్ని గవర్నర్‌కు అప్పగించేలా యూజీసీ చేసిన ప్రతిపాదనను తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కొత్త నిబంధన వల్ల గవర్నర్ తన ఇష్టానుసారం విద్యావేత్తలు కానివారిని కూడా వీసీలుగా నియమించుకునే సంపూర్ణ అధికారాలను కట్టబెట్టినట్లయిందని స్టాలిన్ అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

అమెరికాలో 51వ రాష్ట్రంగా కెనడా..: ట్రంప్

వాషింగ్టన్, జనవరి 7: పొరుగున ఉన్న కెనడా దేశాన్ని కలుపుకొని అమెరికాకు 51వ రాష్ట్రంగా మార్చుతామని అధ్యక్షుడిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్ సోమవారం పునరుద్ఘాటించారు. ప్రజాదరణ కోల్పోయిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పదవికి రాజీనామా చేసిన అనంతరం ట్రంప్ సోమవారం సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. ట్రంప్, ట్రూడోల మధ్య ఎప్పుడూ సత్సంబంధాలు లేకపోవడం గమనార్హం. "అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండేందుకే కెనడాలోని చాలా మంది ముచ్చటపడుతున్నారు. అమెరికా ఇంకెంతకాలం కెనడాకు భారీగా రాయితీలు ఇవ్వలేదు. ఇది తెలిసే ట్రూడో రాజీనామా చేశారు. అమెరికాలో కెనడా విలీనమయితే ఎలాంటి పన్నులు ఉండవు. కెనడాకు రష్యా, చైనా నౌకల నుంచి ముప్పు ఉండదు. కలిసిపోయి పెద్ద దేశంగా మారొచ్చు!" అని అభిప్రాయపడ్డారు.

ఇరాన్‌లో గతేడాది 901 మందికి మరణ దండన

న్యూఢిల్లీ, జనవరి 7: ఇరాన్‌లో మరణ శిక్షల సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతుండడంపై ఐక్యరాజ్య సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2024లో 31 మంది మహిళలు సహా 901 మందికి ఇరాన్‌లో మరణ దండన అమలు చేశారని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం మంగళవారం ప్రకటించింది. 2015లో ఇరాన్‌లో 972 మందికి మరణ దండన విధించగా 2023లో 853 మందికి మరణ శిక్ష అమలు చేశారు. దీంతో 2015 తర్వాత 2024లోనే అత్యధికంగా 901 మందికి మరణ దండన అమలు చేశారు. చైనాను మినహాయిస్తే ఒక ఏడాదిలో మరణ శిక్షలను ఈ స్థాయిలో అమలు చేసిన దేశం ఇరాన్ మాత్రమేనని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా పలు మానవ హక్కుల సంఘాలు పేర్కొంటున్నాయి. చైనాలో మరణ శిక్షల గణాంకాలు అందుబాటులో లేవు.

38వేల మంది శత్రు సైనికుల అంతం: జెలెన్‌స్కీ

కీవ్(ఉక్రెయిన్), జనవరి 7: రష్యాలోని కర్స్క్ ప్రాంతంలో 38,000 మంది శత్రు సైనికులను అంతం చేశామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం ప్రకటించారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమయ్యాక ఐదు నెలల క్రితం కర్స్క్ ప్రాంతంపై దాడులు చేసి ఉక్రెయిన్ అధీనంలోకి తెచ్చుకోవడమేగాక అక్కడి రష్యా మిలటరీ ఆస్తులను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. దాన్ని బఫర్ జోన్‌గా మార్చామన్నారు. ఈమేరకు 'ఎక్స్'లో మంగళవారం పోస్ట్ చేశారు. కర్స్క్‌లో రష్యన్లు తమ బలమైన సైనిక దళాలను మోహరించారు. వాటిలో ఉత్తర కొరియా దళాలు కూడా ఉన్నాయి. అయితే ఆ దళాలను అక్కడి నుంచి కాలు కదపకుండా చేశామని జెలెన్ స్కీ పేర్కొన్నారు. రష్యన్లు వాటిని ఇతర యుద్ధ రంగాలకు పంపలేరని వివరించారు.

భగవద్గీతపై సుహాస్ సుబ్రహ్మణ్యం ప్రమాణం



వాషింగ్టన్, జనవరి 7: అమెరికా కాంగ్రెస్ సభ్యుడుగా సుహాస్ సుబ్రహ్మణ్యం భగవద్గీతపై ప్రమాణం చేశారు. తూర్పు తీర ప్రాంతం వర్జీనియా నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గానే కాకుండా ఇక్కడ నుంచి ఎన్నికై భగవద్గీతపై ప్రమాణం చేసిన తొలి సభ్యుడిగా సుహాస్ చరిత్ర సృష్టించారు. ఈ ఏడాది హిందువుల పవిత్ర గ్రంథంపై ప్రమాణం సభ్యుడిగా కూడా ఆయన గుర్తింపు పొందారు. సుహాస్ ప్రమాణ స్వీకారాన్ని నేరుగా తిలకించడానికి ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వాషింగ్టన్ రావడం విశేషం. గతంలో ప్రతినిధుల సభకు ఎన్నికైన హిందు-అమెరికన్ తులసి గబ్బార్డ్ 2013లో గీతపై ప్రమాణం చేశారు. చట్టసభలో భగవద్గీతపై ప్రమాణం చేసిన తొలి సభ్యురాలిగా ఆమె చరిత్రలో నిలిచిపోయారు.

ఫెంటనిల్ అక్రమ రవాణా..
భారతీయ సంస్థలపై అమెరికాలో కేసు

వాషింగ్టన్, జనవరి 7 : హెరాయిన్ కంటే 50 రెట్లు, మార్ఫిన్ కంటే 100 రెట్లు శక్తిమంతమైన ఫెంటనిల్ అనే రసాయన పదార్థాన్ని అక్రమంగా దిగుమతి చేసి అమెరికా, మెక్సికోకు సరఫరా చేస్తున్నారంటూ భారత్‌కు చెందిన రెండు సంస్థలపై అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ఓ ప్రకటన చేసింది. గుజరాత్‌కు చెందిన రక్సూటర్, అథోస్ అనే రసాయన సంస్థలపై ఈ అభియోగాలు నమోదయ్యాయి. అంతేకాక, ఈ కేసుకు సంబంధించి రక్సూటర్ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ భవేశ్ లథియా(36) న్యూయార్క్‌లో శనివారం అరెస్టు అయ్యారు. అక్రమ రవాణా, తప్పుడు లేబుల్స్‌తో మభ్యపెట్టి డ్రగ్స్ రవాణా చేయడం తదితర అభియోగాలు లథియాపై నమోదయ్యాయి. నేరం రుజువైతే లథియాకు 53 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశముంది. ఫెంటనిల్ అంశంలో భారతీయ సంస్థలపై అమెరికాలో కేసు నమోదవ్వడం ఇదే తొలిసారి.

ఇస్రో కొత్త చైర్మన్ వీ నారాయణన్



న్యూఢిల్లీ, జనవరి 7 : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నూతన చైర్మన్‌గా వీ నారాయణన్ నియమితులయ్యారు. ప్రస్తుత చైర్మన్ ఎస్ సోమనాథ్ పదవీ కాలం సోమవారంతో ముగియనుంది. అనంతరం జనవరి 14న నారాయణన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు చైర్మన్‌గా కొనసాగనున్నారు. నారాయణన్ ప్రస్తుతం ఇస్రోలో లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ డైరెక్టర్‌గా ఉన్నారు.

టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో భారీ భూకంపం

128 మంది మృతి

మరో 188 మందికి గాయాలు
7.1 తీవ్రతతో ప్రకంపనలు



నేపాల్‌లో భూకంపం కారణంగా కూలిన ఓ ఇంటి శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడటానికి ప్రయత్నిస్తున్న సహాయ సిబ్బంది

- వెయ్యికి పైగా ఇళ్లు నేలమట్టం
- కంపించిన ఎవరెస్ట్ బేస్ క్యాంప్
- భారత్‌లో ఉత్తరాదిపైనా ప్రభావం

బీజింగ్, జనవరి 7: హిమాలయాల్లోనే మంచు కొండలు, అందమైన లోయలతో పర్యాటకులను ఆకట్టుకునే టిబెట్‌పై ప్రకృతి ప్రకోపించింది. సముద్ర మట్టానికి 16 వేల అడుగుల ఎత్తులో.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఆవాస ప్రాంతంగా పేరొందిన షిజాంగ్‌లో భూమి కంపించింది. ఆ పరిసరాల్లో 20 కిలోమీటర్ల పరిధిలోని 27 గ్రామాలపై పంజా విసిరింది. వెయ్యికి పైగా ఆవాసాలను నేలమట్టం చేసింది. ఈ భూకంపం 128 మందిని పొట్టనబెట్టుకోగా.. 188 మంది క్షతగాత్రులయ్యారు. శిథిలాల కింద ఇంకా పదుల సంఖ్యలో పౌరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భూకంప ప్రభావం టిబెట్, నేపాల్‌తోపాటు.. చైనా, భూటాన్, భారత్‌లోని బిహార్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌పైనా ప్రభావం చూపింది. షిజాంగ్‌లో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు.. దట్టమైన పొగమంచు సహాయక చర్యలకు ఆటంకంగా మారింది.

ఉదయం నిద్ర లేస్తూనే..

ఉదయం 6.35 గంటలకు టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో.. టిబెట్‌లోని షిజాంగ్ పరిధిలో.. లబుచె వద్ద 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉండగా.. తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. ఈ ప్రాంతానికి 20 కిలోమీటర్ల పరిధిలో 27 గ్రామాలున్నాయి. వీటిల్లో 6,900 మంది జనాభా ఉంది. తాజా భూకంపం, తదనంతరం చోటుచేసుకున్న ప్రకంపనలతో వెయ్యికి పైగా ఇళ్లు నేలమట్టమైనట్లు చైనా మీడియా పేర్కొంది. పలు భవనాలు పూర్తిగా, పాక్షికంగా ధ్వంసమైనట్లు తెలిపింది. సాయంత్రం వరకు మొత్తం 150 భూప్రకంపనలు నమోదైనట్లు చైనా భూకంపాల కేంద్రం వెల్లడించింది. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో భూమి కంపించడంతో.. ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద కూడా భారీ ప్రకంపనాలు వచ్చినట్లు చైనా మీడియా పేర్కొంది. ఎవరెస్ట్ యాత్రికులను అధికారులు బేస్ వద్దే ఆపేసినట్లు తెలిపింది. నేపాల్‌లోని కర్మాండూ వరకు కూడా ప్రకంపనాల తీవ్ర ఉండడంతో.. అక్కడ కూడా ప్రజలు బయటకు పరుగులు తీశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెనువెంటనే సైన్యం, చైనా వైమానికదళం రంగంలోకి దిగింది. జవాన్లు డ్రోన్ కెమెరాలతో గాలింపు చర్యలను చేపట్టారు. అధికారులు షిజాంగ్‌కు 22 వేల తాత్కాలిక టెంట్లు, ఇతర సామగ్రిని తరలించారు. 340 మంది వైద్య సిబ్బంది, 1,500 మంది అగ్నిమాపక సిబ్బందిని మోహరించారు. 3,400 మంది విపత్తు నిర్వహణ సిబ్బంది శకలాలను తొలగిస్తున్నారు. భూకంపం సంభవించిన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మైనస్ 18 నుంచి మైనస్ 14 డిగ్రీలుగా ఉండడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలేర్పడుతున్నట్లు చైనా మీడియా పేర్కొంది. కాగా.. భూకంప ప్రకారం భారత్‌పైనా పడింది. ఉత్తరాది రాష్ట్రాలు– పశ్చిమబెంగాల్, బిహార్, ఢిల్లీ-ఎన్‌సీఆర్ సహా.. పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోనూ ప్రకంపనలు నమోదయ్యాయి.

లాసాలో భూకంపాలు ఎక్కువే?

ఎవరెస్టు శిఖరానికి 80 కిలోమీటర్ల దూరంలో.. భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతులో తాజా భూకంప కేంద్రం ఉంది. ఈ ప్రాంతాన్ని లాసా రీజియన్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి 13 వేల నుంచి 16 వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. భారత, యురేషియన్ భూఫలకాల్లో కదలికలు సంభవించినప్పుడల్లా ఈ రీజియన్ తీవ్రంగా ప్రభావితమవుతుంది. అందుకే ఈ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. ఈ రెండు ఫలకాలు ఒకదానికొకటి ఢీకొనే క్రమంలోనే హిమాలయాలు ఏర్పడ్డాయి.



బొగ్గు గనిలో ఉప్పొంగిన నీరు..
ముగ్గురు జలసమాధి

- చిక్కుకుపోయిన మరో 9 మంది

గువాహటి, జనవరి 7: అసోంలోని ఓ బొగ్గుగనిలో ఊహించని ప్రమాదం సంభవించింది. గనిలోకి ఒక్కసారిగా నీరు వచ్చి చేరడంతో ముగ్గురు కార్మికులు జల సమాధి అయ్యారు మరో 9 మంది కార్మికులు లోపలే చిక్కుకుపోయారు. అయితే సదరు గనికి అనుమతులు లేవని తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం దిమాహసావో జిల్లాలోని ఓ బొగ్గుగనిలోకి సోమ రాత్రి ఒక్కసారికి పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది. దాంతో గనిలో ఉన్న వారిలో ముగ్గురు జలసమాధవ్వగా, లోపలే మరో 9 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేవీ బృందం కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రాథమిక సమాచారం ప్రకారం ఆ గనికి అనుమతులు లేనట్లు తెలిసిందని అసోం సీఎం హిమంత వెల్లడించారు. కాగా, 2019లో మేఘాలయలోనూ ఇలాంటి ప్రమాదంలో 15 మంది చనిపోయారు.

సమాచార కమిషన్ పదవులను తక్షణమే భర్తీ చేయండి

న్యూఢిల్లీ, జనవరి 7: సమాచార కమిషన్లలో పలు పదవులు ఖాళీగా ఉండడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వాటిని తక్షణమే భర్తీ చేయాలని మంగళవారం ప్రభుత్వాలను ఆదేశించింది. పదవులు ఖాళీగా ఉంటే ఆ సంస్థలు ఉండి ఏమి ఉపయోగమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. సమాచార కమిషనర్లు లేకపోవడంతో తెలంగాణ, త్రిపుర, ఝార్ఖండ్‌ల్లో సమాచార కమిషన్లు క్రియారహితంగా మారాయని అభిప్రాయపడింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ పదవుల్లో కేవలం బ్యూరోక్రాట్లను మాత్రమే నియమిస్తుండడంపై ప్రశ్నించింది. అన్ని వర్గాల ప్రముఖులకు అవకాశం కల్పించాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార కమిషన్ల పదవులు భర్తీ కావడం లేదంటూ అంజలి భరద్వాజ్, మరికొందరు పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కమిషన్లలోని పదవులను భర్తీ చేయడం లేదంటే సమాచార హక్కు చట్టాన్ని హత్య చేయడమేనని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ కేంద్ర సమాచార కమిషన్‌లో పదవుల భర్తీ ప్రక్రియ 2024 ఆగస్టులోనే ప్రారంభించినా ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేదని కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖను ప్రశ్నించింది. కమిషనర్ల పదవుల కోసం 161 మంది దరఖాస్తు చేశారని, వారి వివరాలను వెల్లడించాలని తెలిపింది. అర్హులను ఎంపిక చేసి రెండు వారాల్లో జాబితాను రూపొందించాలని సూచించింది. ఝార్ఖండ్ సమాచార కమిషనర్ పదవులను భర్తీ చేయాలని గత ఏడాది జూన్‌లో ఆదేశాలు ఇచ్చినా, ప్రతిపక్ష నేత లేరన్న సాకుతో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుపట్టింది. కమిషన్లలో ఉన్న ఖాళీలు, అభ్యర్థుల అర్హతలు, ఎంపిక కమిటీల స్వరూపంపై వారం రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వాటిని భర్తీ చేశాక నివేదిక సమర్పించాలంది.

బ్యాంకులదే పూర్తి బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)


2017 జూలై 6న ఇచ్చిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. థర్డ్ పార్టీ యాప్, వ్యక్తుల ద్వారా జరిగే మోసాల విషయంలోనూ బాధితులకు ఊరట కలిగించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని స్పష్టం చేసింది. గువాహటికి చెందిన పల్లబ్ భౌమిక్ అనే బాధితుడి విషయంలో జస్టిస్ జేబీ పార్డివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. బాధితుడు 2021లో ప్రపంచ దిగ్గజ గార్మెంట్స్ సంస్థ లూయీఫిలిప్ నుంచి రూ.4 వేలు వెచ్చించి, ఓ బ్లేజర్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత.. దాన్ని వాపస్ చేస్తానంటూ లూయీఫిలిప్ వెబ్‌సైట్‌లో కస్టమర్ కేర్‌కు సమాచారం ఇచ్చారు. తనకు రూ.4 వేలను వెనక్కి ఇవ్వాలని కోరారు. అయితే.. 2021లో లూయీఫిలిప్ వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురై.. ఆ సైట్ నియంత్రణ హ్యాకర్ల చేతికి వెళ్లిపోయింది. వెబ్‌సైట్‌లో కస్టమర్‌కేర్‌ను సంప్రదించినట్లు బాధితుడు భావించినా.. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలచుకుని, లూయీఫిలిప్ మేనేజర్ పేరుతో ఫోన్ చేశారు. "తప్పకుండా మీ సొమ్మును తిరిగి ఇస్తాం. అయితే.. మీరు మేము పంపే లింకు ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి" అని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగానే.. అతని ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ.94,204.80 గూగుల్‌పే ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ అయ్యింది. తన ఖాతా ఖాళీ అవ్వడంతో బాధితుడు ఎస్‌బీఐ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. అయితే గూగుల్‌పే ద్వారా లావాదేవీలు జరిగినందున తాము బాధ్యులం కాదని కస్టమర్‌కేర్ సిబ్బంది సమాధానమిచ్చారు. దాంతో బాధితుడు గువాహటి పోలీసులు, అసోం సీఐడీ సైబర్ క్రైమ్ సెల్, జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించినా.. న్యాయం జరగకపోవడంతో గువాహటి హైకోర్టును ఆశ్రయించారు. ఈలోగా నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన 24 గంటల్లోనే బాధితుడు ఫిర్యాదు చేశారని, ఎస్‌బీఐదే లోపమని హైకోర్టు సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. అతను కోల్పోయిన రూ.94,204.80ని తిరిగి ఇచ్చేయాలని తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఎస్‌బీఐ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. బాధితుడు గూగుల్‌పే ద్వారా డబ్బును బదిలీ చేశాడని, అతనికి ఓటీపీ కూడా వచ్చిందని బ్యాంకు తరఫు న్యాయవాదులు వాదనలను వినిపించారు. అయితే.. బాధితుడి పక్షానే న్యాయం ఉండడంతో.. ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ కేసును విచారించిన జస్టిస్ జేబీ పార్డివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఎస్‌బీఐనే తప్పుబట్టింది. "ఎస్‌బీఐ వద్ద అధునాతన సాంకేతికత ఉంటుంది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించి, నియంత్రించే అవకాశాలుంటాయి. బాధితుడి ప్రమేయం లేకుండానే ఆయన ఖాతాలోని సొమ్ము బదిలీ అయ్యింది. కాబట్టి.. ఎస్‌బీఐ అతనికి పరిహారంగా మొత్తం సొమ్మును తిరిగి ఇవ్వాల్సిందే" అని తీర్పునిచ్చింది. అదే సమయంలో బ్యాంకు ఖాతాదారులు కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఓటీపీని ఇతరులకు చెప్పినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఖాతాదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

పోలీసులు కేసు మూసేసినా ట్రయల్ కోర్టు సమన్లు ఇవ్వొచ్చు

పోలీసులు కేసును మూసివేసినా, క్లీన్ చిట్ ఇచ్చినా కూడా నిందితులకు సమన్లు ఇచ్చే అధికారం ట్రయల్ కోర్టుకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అభియోగ పత్రంలో పేరు లేనప్పటికీ, విచారణ సందర్భంగా లభించిన ఆధారాలను ఆసరాగా చేసుకొని తరువాతైనా పేర్లను జోడించవచ్చని తెలిపింది. భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 358 ప్రకారం ట్రయల్ కోర్టులు సమన్లు ఇవ్వవచ్చని పేర్కొంది. అయితే విచారణలో వెల్లడయిన సమాచారం ఆధారంగా సమన్లు ఇవ్వాలే తప్ప, పోలీసు డైరీల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా కాదని ట్రయల్ కోర్టులకు స్పష్టం చేసింది.

ఆశారాంనకు మధ్యంతర బెయిల్

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో ఉన్న ఆధ్యాత్మికవేత్త ఆశారాం బాపు(86)నకు మంగళవారం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనారోగ్య కారణాల దృష్ట్యా మార్చి 31 వరకు బెయిల్ ఇస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ సమయంలో అనుయాయులు ఎవర్నీ కలుసుకోవద్దని షరతు విధించింది. ఆశ్రమంలోని శిష్యురాలిపై అత్యాచారం కేసులో ఆశారాం యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్నారు.



ఎక్కడ దాక్కున్నా పట్టిచ్చే 'భారత్ పోల్'

- సీబీఐ రూపకల్పన..ఆవిష్కరించిన షా

న్యూఢిల్లీ, జనవరి 7: మనదేశంలోని దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి కీలకంగా దోహదపడే 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. కేసుల విషయంలో అంతర్జాతీయంగా పనిచేస్తున్న మన దర్యాప్తు సంస్థల పనిని ఈ పోర్టల్ సులభతరం చేస్తుందని, ఇంటర్‌పోల్ సహకారం వేగంగా అందుకోగలుగుతామని ఆయన అన్నారు. 'భారత్ పోల్'ను సీబీఐ రూపొందించింది. "అంతర్జాతీయ పోలీసుల సహకారం ఇప్పటిదాకా సీబీఐ మాత్రమే తీసుకుంటోంది. 'భారత్ పోల్' రాకతో మన దేశానికి చెందిన అన్నీ దర్యాప్తు సంస్థలూ, చివరకు రాష్ట్ర పోలీసు విభాగాలు సైతం ఇంటర్‌పోల్ సాయం తీసుకొనగలుగుతాయి. అంతర్జాతీయంగా మనదేశం చేపట్టే విచారణ ప్రక్రియను కొత్త శకంలోకి ఇది నడిపిస్తుంది. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయం, సంబంధాల్లో తలెత్తుతున్న సమస్యలు తొలగించి..నేరగాళ్ల కట్టడికి బాగా పనిచేస్తుంది" అని అమిత్‌షా అన్నారు.

రూ.25,700 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా.. ఏడాదిలో 20 లక్షల మందికి ఏఐ నైపుణ్యాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏడాది ముగిసే సమయానికి ఆ అంచనాలను మించి.. 24 లక్షల మందికి శిక్షణ ఇవ్వగలిగింది. వారిలో 65 శాతం మంది మహిళలు కాగా.. 74% మంది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలవారే! ప్రపంచవ్యాప్తంగా ఏఐ నైపుణ్యాలను నేర్చుకుంటున్నవారిలో భారతీయ నిపుణులు ఎక్కువగా ఉంటున్నారని మైక్రోసాఫ్ట్ సంస్థ పేర్కొంది. ఈ క్రమంలోనే 'ఎడ్వాంటైజ్ ఇండియా' రెండో విడత పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ దిశగా మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ (ఎంఎస్ఆర్) ల్యాబ్ ఇప్పటికే ఏఐ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ పేరుతో ఫిజిక్స్‌వాలా, రెమిడియో, సాఫ్‌ఎక్స్ వంటి స్టార్టప్‌లతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. దేశీయ భాషల్లో లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్ రూపొందించడం, ప్రాంప్ట్ ఆప్టిమైజేషన్ వంటివాటిలో శిక్షణ ఇస్తోంది.

ఫిబ్రవరి 5న ఢిల్లీ ఎన్నికలు



- అమల్లోకి ఎన్నికల కోడ్

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల నగారా మోగింది. వచ్చేనెల 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వివరించింది. ఆ తర్వాత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. 17వ తేదీ వరకు నామినేషన్లకు అవకాశం ఉంటుంది. 18న నామినేషన్ల పరిశీలన(స్క్రూటినీ) ఉంటుంది. 20వ తేదీలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 5న పోలింగ్‌ను నిర్వహిస్తామని, 8న కౌంటింగ్, ఫలితాలు ఉంటాయని స్పష్టం చేసింది. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఢిల్లీలో 2 లక్షల మంది కొత్త ఓటర్లను కలుపుకొని 1.55 కోట్ల మంది ఓటర్లున్నట్లు ఈసీఐ వెల్లడించింది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 12 సీట్లు ఎస్సీ రిజర్వ్ క్యాటగిరీలో ఉన్నాయి. "ఢిల్లీలో మోడల్ కోడ్(ఎన్నికల నియమావళి) అమల్లోకి వచ్చింది. 85 ఏళ్లకు పైగా వయసున్న ఓటర్లకు ఇంటి వద్ద నుంచే ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నాం" అని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ తెలిపారు. కాగా, ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో "పెద్ద ఎత్తున ఎన్నికలకు సిద్ధం కండి" అని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ తమ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. "ఫిర్ లాయింగే కేజ్రీవాల్(కేజ్రీవాల్‌ను మళ్లీ తీసుకొస్తాం)" అనే పాటను తమ ప్రచార గీతంగా ఆప్ ప్రకటించింది.

కేంద్రం నా అధికారిక నివాసాన్ని లాక్కుంది: అతీశీ

కేంద్ర ప్రభుత్వం తన అధికారిక నివాసాన్ని లాక్కుందని ఢిల్లీ సీఎం అతీశీ మంగళవారం ఆరోపించారు. తనకు కేటాయించిన అధికారిక నివాసాన్ని ప్రజాపనుల శాఖ రద్దు చేయడంతో ఆమె ఈమేరకు ఆరోపించారు. అధికారిక నివాసం తనకో సమస్య కాదని, ఢిల్లీ ప్రజల కోసం వీధుల్లో ఉండయినా పనిచేయగలనని అన్నారు. అయితే, బీజేపీ ఈ ఆరోపణను తోసిపుచ్చింది. ఇచ్చిన గడువులోగా ఢిల్లీ సీఎం ఆ నివాసంలో చేరకపోవడం రద్దుకు ఒక కారణం కాగా.. సీబీఐ, ఈడీ విచారణలు మరో కారణమని తెలిపింది.

ఢిల్లీలో ప్రణబ్ స్మారక స్థూపం

- నిర్మించాలని కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ, జనవరి 7: దివంగత రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ప్రణబ్ ముఖర్జీ స్మారక స్థూపాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌ఘాట్ కాంప్లెక్స్ పరిధిలోని రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో దీన్ని నెలకొల్పనుంది. ఈ సమాచారాన్ని తెలియజేస్తూ కేంద్ర గృహనిర్మాణ-పట్టణాభివృద్ధి శాఖ అధికారులు తనకు లేఖ పంపారని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ తెలిపారు. అనూహ్యంగా ఈ కృప లభించిందని పేర్కొంటూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. ప్రణబ్ చనిపోయినప్పుడు సంతాపం తెలిపేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేకంగా భేటీ కాలేదంటూ ఇటీవల శర్మిష్ఠ విమర్శలు చేయడం గమనార్హం.

దేశంలో ఏడుకు చేరిన హెచ్‌ఎంపీవీ కేసులు

న్యూఢిల్లీ, జనవరి 7: దేశంలో మరో రెండు హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య ఏడుకు పెరిగింది. మంగళవారం నాగ్‌పూర్‌లో ఇద్దరికి ఈ వైరస్ సోకినట్లు గుర్తించారు. ఇంత వరకు బెంగళూరులో రెండు, సేలం, అహ్మదాబాద్, చెన్నైల్లో ఒక్కొక్క కేసు వంతున నమోదయింది. బాధితులంతా మూడు నెలల నుంచి 13 ఏళ్లలోపు ఉన్న పిల్లలే. ఇది కొత్త వైరస్ ఏమీ కాదని, దీనికి ఎలాంటి యాంటీ బయాటిక్స్ వాడాల్సిన పనిలేదని రణ్‌దీప్ గులేరియా అన్నారు.

10 నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్!

- ఏడాదిగా బకాయిలు చెల్లించలేదు
- పరిష్కరించకుంటే సేవలు నిలిపివేస్తాం
- సర్కారుకు ప్రైవేటు ఆస్పత్రుల అల్టిమేటం

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు ఈనెల 10వ తేదీ నుంచి నిలిపివేస్తామని ప్రభుత్వాన్ని తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు హెచ్చరించాయి. ఈమేరకు ఆరోగ్యశ్రీ సీఇవోకు ఈ-మెయిల్స్ పంపించాయి. ఏడాది కాలంగా తమకు బకాయిలు చెల్లించడం లేదని, ఈనెల 10లోగా తమ పెండింగ్ బకాయిల అంశాన్ని పరిష్కరించాలని, లేకుంటే అదే రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్నీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేశాయి. ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్), జర్నలిస్టు హెల్త్ స్కీమ్(జేహెచ్ఎస్) బకాయిలున్నాయని పేర్కొన్నాయి. పెండింగ్ బకాయిల వల్ల ఆస్పత్రులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాయని తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్(తానా) పేర్కొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇక ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించే పరిస్థితి లేదని తేల్చి చెప్పింది.

రూ. 1000 కోట్లకుపైగానే బకాయిలు

రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు రూ. 1000 కోట్లకు పైగానే ఉన్నాయని తానా చెబుతోంది. గత బీఆర్ఎస్ సర్కారు హయంలోనే సుమారు 9 నెలల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని నెట్‌వర్క్ ఆస్పత్రులు చెబుతున్నాయి. బీఆర్ఎస్ హయంలో రూ.672 కోట్లు ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలున్నాయని అంటున్నాయి. గతంలో తొలుత బిల్లులు పెట్టిన వారికే మొదట చెల్లింపు(ఫస్ట్ క్లెయిమ్, ఫస్ట్ పేమెంట్) తరహా పద్ధతి ఉండేదని, కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ బిల్లులను తొలుత సర్కారీ దవాఖానాలకే చెల్లిస్తున్నారని అంటున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులకు రెండు నెలల కొకమారు అదీ కూడా కొద్ది మొత్తంలో బిల్లులు చెల్లిస్తున్నారని, దీనివల్ల పెండింగ్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని చెబుతున్నాయి.

ఏడాదిలో 920 కోట్లు చెల్లించాం: వైద్యశాఖ

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏడాది కాలంలో రూ.920 కోట్లు చెల్లించినట్లు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 672 కోట్లు పెండింగ్ బిల్లులున్నాయని, వాటిని క్లియర్ చేస్తూనే, ఇప్పటి వాటిని కూడా ఇస్తున్నామని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. డిసెంబరు చివరి వారంలో కూడా ఆరోగ్యశ్రీకు సంబంధించి రూ.40 కోట్లు బిల్లులను విడుదల చేశామని, నెట్ వర్క్ ఆస్పత్రులు చెబుతున్నట్లుగా వేయికోట్ల బకాయిలు లేవని అంటున్నాయి. రూ.450-500 కోట్ల మధ్య పెండింగ్ బకాయిలుండే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

ఇక సేవలు కొనసాగించలేం

ఆరోగ్యశ్రీకి సంబంధించి మొత్తం 12 నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల చెల్లింపులు చేయకపోవడంతో ఆస్పత్రులు నడిపే పరిస్థితి లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించే పరిస్థితి లేదు. జనవరి 10లోగా సమస్యలను పరిష్కరించకుంటే ఆరోగ్యశ్రీ సేవలను పూర్తిస్థాయిలో నిలిపివేస్తాం.

- డాక్టర్ వద్దిరాజు రాకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్

చర్లపల్లిలో రెగ్యులర్ రైళ్లకు మరో 3 నెలలు?

- తిరుపతికి చేరిన తొలి రైలు

హైదరాబాద్ సిటీ/కుషాయిగూడ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొత్తగా ప్రారంభమైన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ నుంచి ప్రధాన /రెగ్యులర్ రైళ్లలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు మరో మూడు నెలలు ఆగాల్సిందే. ఎందుకుంటే సాంకేతిక కారణాల వల్ల చర్లపల్లి స్టేషన్ నుంచి ప్రస్తుతానికి ప్రత్యేక రైళ్లనే నడపనున్నామని రైల్వే శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇప్పటికే(90 రోజులు ముందుగా) సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్ల నుంచి/వరకు వివిధ రైళ్లలో ప్రయాణికులు రిజర్వేషన్ చేయించుకోవడంతో ఆయా రైళ్లను అవే టెర్మినల్స్ నుంచి/వరకు మరికొన్నాళ్లు తప్పక కొనసాగించాల్సి ఉంది. దీంతో చర్లపల్లి నుంచి ప్రధాన/రెగ్యులర్ రైళ్ల రాకపోకలకు సమయం పట్టనుంది. మరోపక్క, చర్లపల్లి టెర్మినల్‌కు అప్రోచ్ రహదారుల విస్తరణపై రైల్వే శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. చర్లపల్లి టెర్మినల్ నుంచి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమైన ప్రత్యేక రైలు(07077) మంగళవారం ఉదయం 4గంటలకు తిరుపతికి చేరింది. దీంతో చర్లపల్లి టెర్మినల్ నుంచి ప్రారంభమైన తొలి రైలుగా ఇది రికార్డులకు ఎక్కింది.

పత్తాలేని పౌరాస్త్రం

రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం సమాధి!

- చిన్నపాటి సమాచారానికి నెలల నిరీక్షణ
- భర్తీకి నోచుకోని సమాచార కమిషన్
- సుప్రీంకోర్టు ఆదేశాలూ బేఖాతరు
- లక్షకు పైగా దరఖాస్తుల పెండింగ్



హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం, పారదర్శకత కోరుకునే పౌరులకు బ్రహ్మాస్త్రమైన సమాచార హక్కు చట్టం తెలంగాణలో పత్తా లేకుండా పోయింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో వచ్చిన ఈ చట్టంపై గొప్పలు చెప్పే రాష్ట్ర పాలకులు అమలులో మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా.. రాష్ట్రంలో సహచార హక్కు కమిషన్ రెండేళ్లుగా ఏర్పాటు కాలేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కమిషన్ ఏర్పాటు, నియామకాలను ప్రస్తుత, గత ప్రభుత్వాలు సరిగా పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సమాచార హక్కు చట్టం ఉద్దేశ్యం కూడా నెరవేరడం లేదు.

రెండేళ్లలో రెండుసార్లు నోటిఫికేషన్..

నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు ప్రైవేటు లీజుకు సంబంధించి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పంద వివరాలు అందించండి.. ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సమాచార హక్కు చట్టం కింద హెచ్ఎండీఏకు ఈ దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు అధికారులు స్పందించకపోవడంతో ఆయన ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. అంతేనా.. తాము అధికారంలోకి వస్తే సమాచార హక్కు చట్టాన్ని రాష్ట్రంలో పక్కా అమలు చేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఆయన అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా సమాచార కమిషన్ నియామకం జరగలేదు. నిర్దిష్ట సమయంలోగా ఖాళీగా ఉన్న సమాచార కమిషనర్ పోస్టులను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏడాది క్రితమే ఆదేశించింది. కానీ, నియామకాల అంశం అతీగతి లేకుండానే ఉంది. నిజానికి, సమాచార కమిషనర్ల నియామకంపై గత ప్రభుత్వం 2023 జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం 2023 డిసెంబరులో ప్రభుత్వం మారడం, తర్వాత మళ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో నియామక ప్రక్రియ ఆలస్యమైంది. అయితే, ఓ ప్రధాన కమిషనర్, ఆరుగుర కమిషనర్ల నియామకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం గత జూన్‌లో మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. చాలా మంది దరఖాస్తు చేసుకోగా.. రాజకీయ జోక్యం లేకుండా నియామకాలు జరగాలని సీఎం రేవంత్ అప్పట్లో అధికారులను ఆదేశించారు. ఆ దిశగా కసరత్తు చేసిన అధికారలు ఓ జాబితాను సిద్ధం చేసి ఇంటెలిజెన్స్ విచారణ కూడా చేపట్టారు. కానీ, నియామక ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే, సమాచార కమిషన్ నియామకాల అంశంపై సుప్రీంకోర్టు మంగళవారం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. నియామక ప్రక్రియను ప్రారంభించామని, త్వరలో పూర్తి చేస్తామని ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. దీంతో త్వరలోనే కమిషనర్ల నియామకాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సంవత్సరాలుగా నిరీక్షణ..

సమాచార హక్కు చట్టం అమలులో తెలంగాణ అధమస్థాయిలో ఉంది. సమాచారం కోసం పౌరులు ఏళ్లగా నిరీక్షిస్తున్నారు. 2023 ఫిబ్రవరి నుంచి కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ విభాగంలో కోరిన ఏ సమాచారమైనా గరిష్ఠంగా 30 రోజుల్లో ఇవ్వాలి. లేనిపక్షంలో అతడి పైఅధికారికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అక్కడా 30 రోజుల్లో రాకుంటే రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఇలా రాష్ట్ర కమిషన్ వద్ద లక్షకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు సమాచార చట్టం సక్రమంగా అమలు కాకుండా గత ప్రభుత్వం కూడా అడ్డుకుంది. పౌరుల దరఖాస్తులకు సమాచారం ఇచ్చే ముందు రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకోవాలని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశాలిచ్చారు. ఈ నిర్ణయం తీవ్ర విమర్శల పాలైంది.

చట్టంలో ఏముంది?

- సమాచార హక్కు చట్టం-2005 సెక్షన్ 7(1) ప్రకారం.. ప్రభుత్వ శాఖలకు సంబంధించి పౌరులు కోరిన సమాచారాన్ని గరిష్ఠంగా 30 రోజుల్లోపు ఇవ్వాలి. వ్యక్తి జీవితం, స్వేచ్ఛకు సంబంధించిన అంశమైతే అత్యవసర సమాచారంగా భావించి గరిష్ఠంగా 48 గంటల్లోపు ఇవ్వాలి.
- అధికారి 30 రోజుల్లో సమాచారం ఇవ్వని పక్షంలో పౌరులు సెక్షన్ 19 (1) ప్రకారం పైఅధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- అక్కడ కూడా 30రోజుల్లో సమాచారం రానిపక్షంలోసెక్షన్ 19(3) ప్రకారం సెకండ్ అప్పీలేట్ అథారిటీ అయిన రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.
- సమాచారాన్ని సకాలంలో ఇవ్వడంలో విఫలమైన ప్రజా సమాచార అధికారిపై సెక్షన్-20 కింద గరిష్ఠంగా రూ. 25వేల జరిమానా, క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం సమాచార కమిషన్‌కు ఉంది.



అంబేడ్కర్ విగ్రహం వద్ద డప్పు వాయిస్తున్న మందకృష్ణ

లక్ష డప్పులతో హైదరాబాద్‌కు తిరిగొస్తాం

- ఎమ్మార్పీఎస్ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం కాదు: మందకృష్ణ మాదిగ

కవాడిగూడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వంద డప్పులతో గ్రామాలకు వెళుతున్నాం, లక్ష డప్పులతో హైదరాబాద్‌కు వస్తాం, డప్పులతోనే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులను ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలం కాదని ఆయన స్పష్టం చేశారు. 'వేల గొంతులు.. లక్ష డప్పుల' కార్యాక్రమాన్ని విజయవంతం చేయడం కోసం మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బషీర్‌బాగ్ బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వరకు పది జిల్లాల రథయాత్ర కార్యక్రమాన్ని జెండా ఊపి మందకృష్ణ మాదిగ ప్రారంభించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ డప్పు వాయించి ప్రచార రథాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 30ఏళ్ల ఉద్యమానికి 30 రోజుల సమయాన్ని కళాకారులంతా కేటాయించి ప్రజలలోకి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. వంద డప్పులతో ప్రజల్లోకి వెళుతున్నామని, ఫిబ్రవరి 7న లక్ష డప్పులతో హైదరాబాద్‌కు తిరిగి వస్తామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకులకు డప్పులతోనే దీటైన సమాధానం చెబుతామని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో మాల సామాజిక వర్గానికి చెందిన నాయకుల ప్రభావం ఎక్కువగా ఉందని, వారు వర్గీకరణకు అడ్డుతగులుతున్నారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లో వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దానిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

కిరాణా వ్యాపారి కిడ్నాప్

రూ.10 లక్షలు డిమాండ్ చేసిన కిడ్నాపర్లు

చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు!


వ్యాపారి రమేశ్‌బాబు

వడ్డేపల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఓ కిరాణా వ్యాపారిని కిడ్నాప్ అయ్యారు. అయనను విడిచిపెట్టేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేశారు కిడ్నాపర్లు. వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వ్యాపారిని రక్షించినట్లు సమాచారం. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణం శాంతినగర్‌కు చెందిన రమేశ్ బాబు అనే వ్యాపారికి ఒక వ్యక్తి లక్ష రూపాయలు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం రమేశ్‌కు ఫోన్ చేసి ఆ లక్ష రూపాయలు ఇస్తానని హైదరాబాద్‌కు వచ్చి తీసుకోవాలని చెప్పాడు. దాంతో రమేశ్ హైదరాబాద్ వెళ్లగా, ఇద్దరు వ్యక్తులు అతడిని కలిసి తీసుకెళ్లి ఓ అపార్ట్‌మెంట్‌లో బంధించి హింసించారు. అతడితో భార్యకు ఫోన్ చేయించి రూ.10 లక్షలు కావాలని చెప్పించారు. ఆందోళనకు గురైన రమేశ్ భార్య మంగళవారం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రమేశ్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్‌లో అతడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. రమేశ్‌ను రక్షించి కిడ్నాపర్లను శాంతినగర్‌కు తీసుకొచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కిడ్నాపర్లలో శాంతినగర్‌లోని ఓ మొబైల్ షాపు వ్యక్తి, కల్కుంట్ల గ్రామానికి చెందిన మరో వ్యక్తి, హైదరాబాద్‌కు చెందిన మరో ముగ్గురు ఉన్నట్లు సమాచారం. సంఘటనకు సంబంధించి శాంతినగర్ సీఐ టాటాబాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

ఆక్రమించిన అసైన్డ్ భూమి అప్పగింత

- సిరిసిల్ల జిల్లాలో కొనసాగుతున్న ఆక్రమణదారుల అరెస్టులు

సిరిసిల్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్న వారు.. తిరిగి ఆ భూములను అప్పగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములను తమ పలుకుబడి ఉపయోగించుకొని అక్రమంగా పట్టాలు పొందిన వారి అరెస్ట్‌లు ఒకవైపు కొనసాగుతుండగా మరోవైపు మాజీ ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా భూములను అప్పగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని తంగళ్లపల్లి మండలం సారంపల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ సుంచుల కుమారస్వామి తన కబ్జాలో ఉన్న సర్వే నం.464లోని మూడెకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వానికి అప్పగించాడు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ సమక్షంలో లిఖితపూర్వకంగా లేఖను అందించాడు. మరోవైపు భూకబ్జా చేసి అక్రమంగా పట్టాలు పొందిన వారిపై అధికార యంత్రాంగం అరెస్టుల పరంపర కొనసాగిస్తోంది. గత నెలలో నలుగురు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయగా తాజాగా మంగళవారం బీఆర్ఎస్‌కు చెందిన నేరేళ్ల సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ భూములను స్వచ్ఛందంగా అప్పగించాలి: సిరిసిల్ల కలెక్టర్

జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి 2023 వరకు ప్రభుత్వ భములను ఆక్రమించి రైతు బంధు, పీఎం కిసాన్ వంటి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన సొమ్ము రికవరీ కోసం డిమాండ్ నోటీస్ జారీ చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆక్రమణకు గురైన 250 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.


కలుషిత ఆహారంతో 28 మంది విద్యార్థినులకు అస్వస్థత

- కరీంనగర్ జ్యోతిబా పూలే గురుకులంలో ఘటన

గణేశ్‌నగర్ (కరీంనగర్), జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం రాత్రి కలుషిత ఆహారంతో 28 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వసతి గృహ అధికారి, సిబ్బంది వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థినులకు హాస్టల్‌కు పంపించారు. అస్వస్థతకు గురైన వారికి సెలవులు ఇచ్చి, ఇళ్లకు పంపించారు. మెనూ ప్రకారం సోమవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బొబ్బర్లు ఉడికించి స్నాక్స్‌గా అందించారు. రాత్రి భోజనంలో కాలీఫ్లవర్ కూరతో పాటు సాంబార్ అందించారు. అది తిన్న విద్యార్థినులకు అర్ధరాత్రి 12 గంటల నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు ప్రారంభమయ్యాయి. దీంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో, బీసీడీవో, డీఎంహెచ్‌వో, ఆహార తనిఖీ అధికారులు గురుకుల హాస్టల్‌కు చేరుకుని ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. శాంపిళ్లు సేకరించి, పరీక్షల కోసం తమ వెంట తీసుకెళ్లారు. సోమవారం రాత్రి వండిన కాలీఫ్లవర్స్ 4 రోజుల క్రితం గురుకులానికి వచ్చాయని తెలిసింది. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు గురుకులం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

చిత్రకళా పరిశోధకుడు జగదీశ్ మిట్టల్ ఇకలేరు

- భారతీయ చిత్రకళా రంగంలో విమర్శకుడిగా గుర్తింపు


జగదీశ్ మిట్టల్

హైదరాబాద్ సిటీ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత చిత్రకళా పరిశోధకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత, జగదీశ్ మిట్టల్ (99) ఇకలేరు. కొద్ది రోజులుగా వయోధిక సమస్యలతో మంచానికే పరిమితమైన ఆయన దోమల్‌గూడలోని స్వగృహంలో మంగళవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. జగదీశ్ మిట్టల్ 1925 సెప్టెంబరు 16న ఉత్తరప్రదేశ్‌లోని బులంద్ షహర్‌లో ఓ విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి చిత్రకళలపై మక్కువ కలిగిన ఆయన, విశ్వకవి రవీంద్రుడు నెలకొల్పిన శాంతి నికేతన్, కళాభవన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తన సహాధ్యాయి, ప్రఖ్యాత చిత్రకారిణి కమలను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు బద్రి విశాల్ పిట్టి ఆహ్వానం మేరకు 1953లో హైదరాబాద్‌కు వచ్చారు. జవహర్ లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో భారతీయ చిత్రకళ చరిత్రను కొంతకాలం బోధించారు. క్రీ.పూ ఒకటవ శతాబ్దం మొదలు క్రీ.శ 1900 వరకు అరుదైన చిత్రకళా సంపదను సేకరించారు. తన భార్య కమల మరణానంతరం జగదీశ్ అండ్ మిట్టల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ ఆర్ట్ పేరుతో 1976లో ఇంటినే మ్యూజియంగా మలిచారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1990లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం శ్మశాన వాటికలో జగదీశ్ మిట్టల్ అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రూడో నిష్క్రమణ

గొప్పగా ప్రారంభమై చప్పగా ముగిసిన రాజకీయ ఘట్టం కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కథ. 'పాశ్చాత్య దేశాలలో నవీన ప్రగతిశీల వాదానికి ప్రతినిధిగా జస్టిన్ ట్రూడో కంటే చెప్పదగిన నాయకుడు మరొకరు లేరు. ట్రూడో పాలన వలే మరెవ్వరి పాలన ఉపద్రవకరంగా విఫలమవలేదు' అని కెనడియన్ వ్యాఖ్యాత జోర్డాన్ పీటర్సన్ అన్నారు. ప్రధానమంత్రి పదవి, అధికార లిబరల్ పార్టీ నాయకత్వం నుంచి వైదొలగనున్నట్టు ట్రూడో సోమవారం నాడు ప్రకటించారు.

కెనడా 23వ ప్రధానమంత్రిగా నవంబర్ 2015లో అధికారం చేపట్టిన ట్రూడో తొమ్మిదేళ్లకు పైగా పాలనలో సామాజిక సంక్షేమ విధానాలకు ప్రాధాన్యమిచ్చారు. కెనడా 15వ ప్రధాని పియెర్రె ఎలియట్ ట్రూడో కుమారుడైన జస్టిన్ తన రాజకీయ జీవితంలో ఎన్నికల పరాజయమనేది ఎరుగని నేత. 2008లో తొలిసారి పార్లమెంటుకు ఎన్నికైన జస్టిన్ ట్రూడో 2013లో లిబరల్ పార్టీ నాయకత్వానికి పోటీ చేసి నెగ్గారు. 2015వ నవంబర్ ఎన్నికల్లో ఆయన నాయకత్వంలో లిబరల్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. ప్రధాన మంత్రిగా తన తొలి కేబినెట్‌లోనే జెండర్ సమత్వానికి ప్రాధాన్యమిచ్చారు. ఆ విధానాన్ని ఆయన చివరిదాకా కొనసాగించారు. 2019లోను, 2021లోను ఆయన నాయకత్వంలో లిబరల్ పార్టీ న్యూ డెమొక్రాటిక్ పార్టీ మద్దతుతో మైనారిటీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. గత కొద్దినెలలుగా పార్టీ నుంచి అంతర్గత ఒత్తిళ్లు, ప్రజల నుంచి నిరసనలు తీవ్రమవడంతో ట్రూడో ప్రధాన మంత్రి పదవి, లిబరల్ పార్టీ నాయకత్వం నుంచి వైదొలగడానికి నిర్ణయించుకున్నారు. అక్టోబర్‌లో జరగనున్న తదుపరి పార్లమెంటరీ ఎన్నికలలో లిబరల్ పార్టీ గెలుపు అసాధ్యమనే అభిప్రాయం గట్టిగా ఉన్నది. కెనడాలో ఒక పార్టీ వరుసగా నాలుగుసార్లు అధికారంలోకి రావడమనేది చాలా అరుదు. ఆ అరుదైన చరిత్ర ఒక శతాబ్దం క్రితం మాత్రమే సంభవించింది.

కెనడాలోని సిక్కు పౌరులు 2015లో ట్రూడో విజయానికి విశేషంగా దోహదం చేశారు. ఆయన నాయకత్వంలోని మైనారిటీ ప్రభుత్వం మనుగడకు సిక్కు నాయకుల నేతృత్వంలోని న్యూ డెమొక్రాటిక్ పార్టీ గట్టి దన్నుగా ఉన్నది. ఈ కారణంగా, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఖలిస్తానీ వేర్పాటువాదులకు మద్దతునివ్వడంలో ఆయన చూపిన అత్యుత్సాహం చివరకు భారత్‌తో దౌత్య వివాదానికి దారి తీసింది. ఆ వివాదం పార్టీలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసింది. భారత్‌తో అనవసర కలహానికి ట్రూడో కారకుడయ్యారన్న అభిప్రాయం కెనడా ప్రజల్లో కూడా నెలకొన్నది. భారత్‌తో దౌత్య జగడం ఆయన రాజీనామా నిర్ణయానికి దారితీసిన కారణాలలో ఒకటి.

ఈ నెల 20న అమెరికా 47వ అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న డోనాల్డ్ ట్రంప్ సైతం ట్రూడో అధికార ప్రాభవానికి గండి కొట్టారు. ట్రంప్ గతంలో అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇరుదేశాలకు సానుకూలంగా 'ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' పునరుద్ధరించుకునే విషయమై ఆయనతో చర్చలు జరపడంలో ట్రూడో సఫలమయ్యారు. అయితే ట్రంప్ 2024 నవంబర్ అధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన తరువాత కెనడా నుంచి అమెరికాకు దిగుమతి అయ్యే సరుకులపై 25 శాతం సుంకం విధిస్తామని ఖరాఖండీగా ప్రకటించారు. అంతేగాక కెనడా నుంచి అమెరికాకు వలసకారుల వెల్లువను అరికట్టాల్సిన బాధ్యత కూడా కెనడాదేనని ట్రంప్ నిర్దేశించారు. సుంకాల పెంపుదలపై ట్రంప్ తన వైఖరిని విడనాడని పక్షంలో కెనడా ఆర్థికవ్యవస్థ తీవ్రంగా నష్టపోతుంది. దీనిపై అన్ని రాజకీయ పక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. చర్చలు జరిపి పరిస్థితిని చక్కబరిచేందుకు ట్రూడో ప్రోటోకాల్‌కు విరుద్ధంగా అమెరికా వెళ్లి, అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చెయ్యాలని ట్రూడోకు ట్రంప్ సూచించినట్టు కొన్ని వార్తలు కూడా వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో ట్రంప్ ఇదే చెబుతూవస్తున్నారు కూడా. సుంకాల పెంపుదల బెదిరింపుతో పాటు ఈ వెక్కిరింపు ధోరణి కెనడాలో తీవ్ర అసంతృప్తి, నిరసనలకు దారితీసింది. ట్రంప్‌ను ట్రూడో నిలువరించలేక పోతున్నారనే అభిప్రాయం కెనడాలో ఉంది. కెనడా సార్వభౌమత్వ హక్కును కాపాడడంలో ట్రూడో విఫలమవడంపై సొంత పార్టీలో అసంతృప్తి పెరిగింది. ఉరుములేని పిడుగులా డిప్యూటీ ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ రాజీనామా చేశారు. ట్రంప్‌తో గట్టిగా వ్యవహరించడంలో ట్రూడో విఫలమవుతున్నారంటూ ఆయన నాయకత్వ సమర్థతపై ఆమె బహిరంగంగా సందేహాలు వ్యక్తం చేశారు. క్రిస్టియా రాజీనామాతో పార్టీ నాయకత్వం, ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలిగేందుకు ట్రూడో నిర్ణయించుకున్నారు. పోగుబడిన అనేక వివాదాలను, సమస్యలను ఆయన రాజీనామా పరిష్కరించగలదో లేదో చూడాలి.

పెట్టుబడులను ఆకర్షించడంలో దేశీయంగా తమిళనాడు, అంతర్జాతీయంగా చైనా, సౌదీ అరేబియాల విధానాలను ఆదర్శంగా తీసుకోవాలి. విదేశీ పెట్టుబడుల ద్వారా తెలంగాణలో ఉత్పన్నమయ్యే అభివృద్ధి, ఉపాధి అవకాశాలను సమరీతిలో వికేంద్రీకరించాలి.

వికేంద్రీకరణతో సమ అభివృద్ధి

భారత్‌కు విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి; భారతీయ యువజనులేమో మెరుగైన విద్యకు విదేశాలకు వెళ్లుతున్నారు! ఆ విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత అక్కడే ఉపాధి అవకాశాలు అన్వేషించుకుని స్థిరపడుతున్నారు. ఈ రెండు వాస్తవాలు వర్తమాన భారతీయ సమాజ విచిత్ర వైరుధ్యాలు కావూ?

ప్రభవిస్తున్న నవ భారతంలో వాణిజ్య, పారిశ్రామిక, సేవా రంగాలలో భారీ పెట్టుబడులతో విదేశీ సంస్థలు ప్రవేశిస్తుండగా, సరైన ఉపాధి, విద్యావకాశాలు లేక భారతీయ యువత విదేశాలకు వెళ్లుతోంది. నెలకు సగటున 450 కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి. ఇది, నిస్సందేహంగా భారత్ శీఘ్ర పురోగతికి ఒక సూచిక. అయితే నెలకు సగటున రెండు లక్షల మంది ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ విదేశాలకు వెళ్లవలసి రావడం తిరోగమనానికి సంకేతమనేది అవిస్మరణీయం.

గల్ఫ్ లేఖ

విదేశీ పెట్టుబడులను అత్యధికంగా సాధించే రాష్ట్రం గుజరాత్. అయితే అక్రమ మార్గాల్లో అమెరికాకు వెళ్లుతున్న వారిలో అత్యధికంగా ఉంటున్నవారు గుజరాతీ యువజనులే అన్నది ఒక కఠోర వాస్తవం. అత్యధిక విదేశీ పెట్టుబడులను పొందే దేశం చైనా. చైనా పౌరులు ఎవరూ ఉపాధి వలసలకు స్వదేశ సరిహద్దులు దాటి వెళ్లరు మరి.

మౌలిక సదుపాయాల వసతులతో పాటు పరిశ్రమలో పని చేయడానికి అవసరమైన మానవ వనరులు కూడ చాలా అవసరమనే విషయాన్ని భారతీయ పాలకులు విస్మరిస్తున్నారు. తమ యువతకు సాఫ్ట్‌వేర్ శిక్షణ ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలు అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు తమ వద్దకు వచ్చే విధంగా చేసుకోవడంలో సఫలమయ్యాయి. ఈ సాఫల్యతను ఇతర రంగాలలోనూ మరింతగా సాధించవలసిన అవశ్యకత ఉంది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో దక్షిణాదిలో ప్రథమ స్థానం తమిళనాడుదే అని మరి చెప్పనవసరం లేదు. ఐటితో పాటు ఇతర రంగాలను ఆ రాష్ట్రం వ్యూహాత్మకంగా అభివృద్ధి



చేస్తోంది. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ ఉత్పాదక రంగంలో విదేశీ పెట్టుబడులు సింహభాగం ఆ రాష్ట్రానికే వెళతాయి. ఈ రంగాలకు అవసరమైన నైపుణ్యతతో కూడిన మానవ వనరులను అభివృద్ధిపరచి విదేశీ సంస్థలకు అందుబాటులో ఉంచుతుంది. ఈ కారణాన శాంసంగ్‌తో సహా అనేక విదేశీ సంస్థలు తమిళనాడును ఎంచుకుంటున్నాయి. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ వాహనాలలో దాదాపు సగం వరకు ఒక్క తమిళనాడు నుంచే వస్తున్నాయి. విద్యుత్ వాహనాల ఉత్పత్తిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వియత్నాం కంపెనీ విన్ ఫాస్ట్ రూ. 16 వేల కోట్ల రూపాయల పెట్టుబడికి తమిళనాడునే ఎంచుకున్నది. ఈ ఒక్క పరిశ్రమతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయి. పైగా తమిళనాడులోని విభిన్న ప్రాంతాలలో క్లస్టర్ల ఏర్పాటుతో సమ అభివృద్ధికి ఆస్కారమేర్పడుతుంది.

ఐటి నైపుణ్యత అభివృద్ధి ద్వారా అటు పెట్టుబడులు ఇటు ఉపాధి అవకాశాలను పెంపొందించిన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు చమురు రంగంలో పెట్టుబడులతో పాటు పెట్రో కెమికల్స్ విశ్వవిద్యాలయంపై దృష్టి పెట్టారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే అంతగా అనుకూల పరిస్థితులు లేకున్నా ఉత్తరప్రదేశ్‌కు సైతం విదేశీ పెట్టుబడులు భారీగా రావడం గమనార్హం. తెలంగాణ సైతం విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రశంసనీయమైన రీతిలో ముందుకు వెళ్లుతోంది. ఖాళీ ఖజానాతో తాము అధికార బాధ్యతలు స్వీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరుచు ప్రస్తావిస్తుంటారు. ఇది, స్థానిక రాజకీయ కోణంలో అనుకూలిస్తున్నా పెట్టుబడుల దృక్పథంతో పరిశీలిస్తే ప్రతికూలంగా మారే పరిస్థితులు ఉన్నాయి. అయినప్పటికీ తెలంగాణకు విదేశీ పెట్టుబడులు వస్తుండడం హర్షణీయం. గత ప్రభుత్వం తరహా కార్పొరేటీకరణ, ప్రచార ఆర్భాటం లేకుండా రేవంత్ సర్కార్ ఈ దిశగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో అదానీ పెట్టుబడులను ఒక వ్యాపారాత్మక దృష్టితో చూడాలి కానీ రాజకీయ కోణంతో కాదు. కేరళలో వామపక్ష ప్రభుత్వం కూడా అదానీ పెట్టుబడులను స్వాగతించిందనే విషయాన్ని విస్మరించకూడదు.

అధికార బాధ్యతలు స్వీకరించిన కొద్ది వారాలకే రేవంత్‌రెడ్డి ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొనడానికి స్విట్జర్లాండ్ వెళ్లారు. గత ప్రభుత్వ హయాంతో పోల్చితే ఈ సారి 33 శాతం అదనంగా పెట్టుబడులను తెలంగాణ సాధించినట్లుగా కేంద్రం విడుదల చేసిన గణంకాలు వెల్లడించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు వచ్చిన రూ. 12,864 కోట్లు హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాలకు రావడం జరిగింది. పెట్టుబడులకు తోడుగా రేవంత్‌రెడ్డి సర్కార్ స్కిల్ యూనివర్శిటీని కూడా శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. పెట్టుబడులతో రాష్ట్రానికి వచ్చే పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యత కల్గిన యువతను అందించే ఈ విశ్వవిద్యాలయం మదుపుదారులకు అదనపు ఆకర్షణగా ఉంటుందనడంలో సందేహం లేదు, పెట్టుబడులతో పాటు ఈ విశ్వవిద్యాలయ ప్రాంగణాలను హైద్రాబాద్‌ను దాటి ఇతర ప్రాంతాలలోను విస్తరింప చేసే దిశగా ఆలోచించాలి.

పెట్టుబడులను ఆకర్షించడంలో దేశీయంగా తమిళనాడు, అంతర్జాతీయంగా చైనా, సౌదీ అరేబియాలు అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకోవలిసిన అవసరమున్నది. విదేశీ పెట్టుబడుల ద్వారా తెలంగాణలో ఉత్పన్నమయ్యే అభివృద్ధి, ఉపాధి అవకాశాలను సమరీతిలో వికేంద్రీకరిస్తే ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లవుతుంది.

▪ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎవరికి వారే ప్రత్యేకం..!



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

గత నెల 25న అటల్ బిహారీ వాజపేయి శతజయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఉదయం 8 గంటలకు అనేక మంది నేతలు ఇంకా ప్రవేశించకముందే తెలుగుదేశం అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజ్ ఘాట్‌కు చేరుకున్నారు. ఇంకా పొగమంచు ఢిల్లీని వీడలేదు. దట్టమైన చలిలో నేతలు కోట్లు, మఫ్లర్లు ధరించి అక్కడికి చేరుకోగా చంద్రబాబు సాధారణంగా ఎప్పుడూ ధరించే దుస్తులతో కనపడ్డారు. 'మీరు చలిని అధిగమించినట్లున్నారే, మీనుంచి రాజకీయాలనే కాదు, ఆరోగ్యం గురించి కూడా తెలుసుకోవాలి' అని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా నవ్వుతూ ఆయనను ప్రశ్నించారు. చంద్రబాబును చూడగానే బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, హోంమంత్రి అమిత్ షా ఆయనను తమ మధ్య కూర్చోబెట్టుకున్నారు. అటల్‌కు నివాళుల కార్యక్రమం అయిపోయిన తర్వాత కేంద్రమంత్రులు, బీజేపీ సీనియర్ నేతలు చంద్రబాబును ఒకరి తర్వాత మరొకరు పలకరించారు. ఆ తర్వాత నడ్డా, అమిత్ షా ఆధ్వర్యంలో జరిగిన ఎన్డీఏ సమావేశంలో పాల్గొన్న చంద్రబాబు అదే రోజు మోదీ, అమిత్ షాతో సహా ఆరుగురు మంత్రులను కలుసుకున్నారు. ఒకరిద్దరు కేంద్రమంత్రులు చంద్రబాబును ఢిల్లీలోని ఆయన నివాసానికే వచ్చి కలుసుకున్నారు. ఉదయం 8 గంటల నుంచీ రాత్రి 9 గంటల వరకు ఖాళీ లేకుండా సమావేశాల్లో పాల్గొని హైదరాబాద్ వెళ్లిన చంద్రబాబు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించారని తెలియగానే మళ్లీ ఢిల్లీ తిరిగి వచ్చారు. ఎక్కడా ఆయన అలిసిపోయినట్లు కానీ, వయసు మీద పడినట్లు కానీ కనిపించలేదు. 'మన్మోహన్ సింగ్ ఈ దేశంలో సంస్కరణలు ప్రవేశపెట్టిన ఉత్తమ ఆర్థికవేత్తే కాదు. రాజనీతిజ్ఞుడు. వైఎస్ హయాంలో నాకు భద్రతను ఉపసంహరించినా మన్మోహన్ సింగ్ జోక్యం చేసుకుని మళ్లీ భద్రతను కల్పించేలా చూశారు' అని చంద్రబాబు టీడీపీ ఎంపీలకు చెప్పారు ఈ రెండు రోజులు జాతీయ రాజకీయాల్లో చంద్రబాబు బలమైన ఉనికిని మరోసారి గుర్తు చేశాయి.

వాజపేయి, మన్మోహన్ సింగ్ ఇద్దరూ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించినందువల్లే వారి మరణానంతరం కూడా వివిధ పక్షాల గౌరవాన్ని అందుకున్నారు. వాజపేయితో విభేదించినవారు కూడా ఆయన తమను పలకరించినంత మాత్రాన ఆయన ఆకర్షణకు లోనయ్యేవారు. తాను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న సోనియాగాంధీతో కూడా ఆయన సత్సంబంధాలు కొనసాగించారు.

గత వారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసినప్పుడు రాజకీయాల్లో ఇలాంటి విశాల హృదయులు, రాజనీతిజ్ఞులు కొరవడుతున్న విషయంపై చర్చ జరిగింది. ప్రస్తుతం వాజపేయి, మన్మోహన్ సింగ్ లాంటి నేతలు లేకపోవడం, ఒకర్నొకరు రాజకీయంగా అంతం చేసుకునే ప్రయత్నాలు చేయడం గురించి చర్చకు వచ్చింది. నిజానికి సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కూడా అత్యంత కీలకమైన నిర్ణయాలు జరిగాయి. పీవీ నరసింహారావు హయాంలోని సంకీర్ణ ప్రభుత్వమే సంస్కరణలను ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిందే. చంద్రబాబు కన్వీనర్‌గా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో 18 నెలల్లో వడ్డీ రేట్లపై నియంత్రణలు తొలగించడం, పన్నులపై కోత విధించడం వంటి చెప్పుకోదగ్గ సంస్కరణలు జరిగితే, వాజపేయి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో కూడా గ్రామీణ సడక్ యోజన, స్వర్ణ చతుర్భుజితో పాటు అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సర్వశిక్షా అభియాన్ లాంటి ప్రయోజనకరమైన పథకాలు అమలు అయ్యాయి. నాయకత్వానికి దూరదృష్టి, స్పష్టతా ఉంటే రాజకీయ అస్థిరతకూ బలమైన నిర్ణయాలు అమలు చేయడానికీ సంబంధం ఉండవలసిన పనిలేదు.

నాయకులు అంతా ఒకే విధంగా వ్యవహరించాలని ఎక్కడా లేదు. పీవీ, మన్మోహన్ వాజపేయిలతో పోలిస్తే నరేంద్రమోదీ అనుసరిస్తున్న తీరు భిన్నమైనది. అందుకు ప్రధాన కారణం ఆయన హయాంలో పార్టీ పూర్తి మెజారిటీ సాధించడం. పార్టీపైన, ప్రభుత్వంపైనే కాదు మొత్తం వ్యవస్థలపై మోదీ పట్టు బిగించారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం, పార్టీ తన కేంద్రీకృతంగా నడిచేలా చూశారు. బలమైన నిర్ణయాలు తీసుకోవడమే కాదు, మొత్తం నిర్ణయాలు తీసుకునే క్రమంలో ప్రజాస్వామిక వైఖరి అనుసరించడం లేదన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రత్యర్థులను అణిచివేసేందుకు ఆయన ఏ మాత్రం వెనుకాడబోరనే అభిప్రాయం కల్పించారు. తన చుట్టూ ఉన్నవారిలో తానంటే భయం, భక్తి కనపడేలా చూసుకున్నారు. తాను తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదమైనా వాటిని వెనక్కు తీసుకునేందుకు ఆయన ఏ మాత్రం ప్రయత్నించలేదు. సంచలన, వివాదాస్పద, భావోద్వేగాలు కల్పించే వ్యాఖ్యలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. నరేంద్రమోదీ లాంటి వ్యక్తులు తమకు అనుకూలంగా, వ్యతిరేకంగా బలమైన శిబిరాలు ఏర్పడేలా చేసుకుంటారు. తద్వారా రెండు శిబిరాల్లోనూ ఆయన పేరే మారుమ్రోగేలా చేసుకుంటారు. ఇద్దరు వ్యక్తులు కలిసి రాజకీయాలు మాట్లాడుకుంటే పదినిమిషాల్లో ఒక్కసారైన నరేంద్రమోదీ పేరు వినిపించక తప్పదు. దేశంలో అనేక మంది నేతలను ఒకే రకమైన దుస్తుల్లో చూడడం ప్రజలకు అలవాటైతే మోదీని రకరకాల దుస్తుల్లో చూడడం కూడా వారికి అలవాటైంది. ఒకసారి తపోముద్రలో కనపడితే మరోసారి నీళ్లలో మునకలు వేస్తూ కనపడడం, మరోసారి నెమళ్లతో ఆడుకుంటూ, ఆవులకు దాణా వేస్తూ దర్శనం ఇవ్వడంలో మోదీకి మోదీయే సాటి. ప్రత్యర్థులపై ఎంత తీవ్రంగా, సైద్ధాంతిక పరిభాషలో విరుచుకుపడగలరో, అదే సమయంలో చాలా అల్పమైన వాఖ్యలు చేసి ఈయన దేశ ప్రధానమంత్రేనా అన్న అనుమానాలు రేకెత్తించడం కూడా మోదీకి అలవాటే.

అయినప్పటికీ నరేంద్రమోదీపై ఆయనంటే పార్టీలో అసమ్మతి కానీ రణ గొణ ధ్వనులు కానీ ఏ మాత్రం వినిపించడం లేదు. దీనికి కారణం ఆయన నేతృత్వంలో పార్టీ ఘన విజయాలు చవి చూడడం. గత పదేళ్లలో జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ బలమైన, గుర్తింపు గల నేతగా మోదీ ఆవిర్భవించారు. భారత రాజకీయాల్లో ఇంతటి ప్రభావశీల నాయకుడు కనిపించడం లేదు. ఈ బలమైన నాయకత్వమే ఆయనకు పార్టీలోనే కాక, ఎన్డీఏలోనూ ఆమోదయోగ్యత పెంచేలా చేసింది. నరేంద్రమోదీ శైలి నచ్చనివారు కూడా ఆయనతో కలిసి నడిచేందుకు, ఆయన



> **పీవీ, మన్మోహన్, వాజపేయిలతో పోలిస్తే నరేంద్రమోదీ అనుసరిస్తున్న తీరు భిన్నమైనది. అందుకు ప్రధాన కారణం ఆయన హయాంలో పార్టీ పూర్తి మెజారిటీ సాధించడమే. పార్టీపైన, ప్రభుత్వంపైనే కాదు మొత్తం వ్యవస్థలపై మోదీ పట్టు బిగించారు. చంద్రబాబు కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటూ వస్తున్నారు. విధానాలను, వ్యవహారశైలిని మార్చుకోవడానికి, తప్పులు అంగీకరించడానికి ఆయన వెనుకాడడం లేదు. అధికారంలో ఆరునెలలు పూర్తి చేసుకున్న తర్వాత, తన చర్యల్లో వేగం పుంజుకునే టేకాఫ్ దశలో ఉన్నట్లు చంద్రబాబు కనిపిస్తున్నారు.**

నాయకత్వాన్ని ఆమోదించేందుకు పూనుకున్నారంటే ప్రత్యామ్నాయం లేకపోవడమే కాదు, తమ తక్షణ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలనుకోవడం కూడా కారణం. తనతో స్నేహం చేసిన వారిని మోదీ విస్మరించబోరన్నది వారి ప్రగాఢ విశ్వాసం. మోదీ ఎలా ఉంటేనేం, ఫలితాలు సాధిస్తున్నారా లేదా అన్నది వారికి ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు తగ్గితేనేం. మళ్లీ హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో నరేంద్రమోదీ బలహీనం అయ్యారన్న అభిప్రాయాలకు తెరపడింది. కార్పొరేట్ శక్తులన్నీ మోదీకి అనుకూలంగా మారడం ఆయనతో చేతులు కలిపేవారందరికీ ఉపయోగకరమని వేరే చెప్పనక్కర్లేదు. అదే సమయంలో మూడోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మోదీ తనతో కలిసి వచ్చే వారిని విస్మరించబోననే సంకేతాలు పంపడం ప్రారంభించారు. తాను తగ్గినా నెగ్గినట్లే కనిపించడం మోదీ స్వభావం.

బలమైన నాయకులంతా ప్రజాస్వామికంగా వ్యవహరించవలసిన అవసరం లేదని, నియంత స్వభావం ఉన్నవారికి కూడా ప్రజలు ఆకర్షితులవుతారని ఇవాళ ప్రపంచ రాజకీయాలు కూడా నిరూపిస్తున్నాయి. లేకపోతే డోనాల్డ్ ట్రంప్. పుతిన్ లాంటి వారికి తిరుగులేకుండా పోవడమేమిటి? ట్రంప్ కూడా రెండు బలమైన అనుకూల, వ్యతిరేక శిబిరాలను ఏర్పర్చుకున్నారు. తాను మాట్లాడే అంశాలను ద్వేషంతోనైనా వినే వర్గాన్ని పెంచుకున్నారు. ఎప్పుడు భావోద్వేగాలు కల్పించాలో, ఎప్పుడు సంచలన వ్యాఖ్యలు చేయాలో ఆయనకు బాగా తెలుసు. అనూహ్యంగా వ్యవహరించడమే ఆయన శైలి. ఏది మాట్లాడినా వినేవారిని (ఆడియన్స్)ను కోల్పోకపోవడమే ఆయన విజయ రహస్యం. దాని వల్లే జార్జి బుష్ తర్వాత అత్యంత జనాదరణ పొంది, 75 మిలియన్ అమెరికన్ల ఓట్లు సంపాదించుకోగలిగారు. పుతిన్ కూడా సుదీర్ఘ కాలం రష్యా అధినేతగా ఉన్న కాలంలో తనను విస్మరించలేని పరిస్థితులను కల్పించుకున్నారు. ప్రజాస్వామ్యం, ప్రతిపక్షం లాంటి వాటిని డిక్షనరీలోంచి తీసేసి బలమైన, ప్రమాదకరమైన నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేయకుండా ముందుకు సాగారు.

రాజకీయాల్లో వారసత్వం వల్ల జనం ఆదరిస్తారనే రోజులు పోయాయి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో ఆ కాలం చెల్లింది. రాహుల్‌గాంధీ గత రెండు దశాబ్దాలుగా తన ఉనికి కోసం పోరాడుతూనే ఉన్నారు. నాయకత్వం లభించాలంటే కాలం కలిసి రావాలి. వాతావరణం పరిపక్వంగా మారాలి. సహజ నాయకుడుగా ఉద్భవించే సమయం కోసం వేచి చూడాలి. అప్పుడు వారసత్వం కూడా కలిసి వస్తుంది. సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కాంగ్రెస్ రాజకీయాల్లో జన్మించకపోయినా కాంగ్రెస్ ముఖ్యమంత్రులుగా నిలదొక్కుకున్నారు. బీజేపీలో హిమంత బిశ్వాస్ శర్మకు దక్కిన అవకాశమే కాంగ్రెస్‌లో వారికి లభించింది. అయినా సిద్ధరామయ్య, రేవంత్‌రెడ్డిల శైలి వేరు. కాని ఇద్దరి సమస్యలు ఒక్కటే. కెరటాల్లా ముందుకు వచ్చినట్లే వచ్చి వెనక్కు తగ్గడం వారి తత్వంలా కనిపిస్తోంది. దేశంలో అత్యంత సీనియర్ నాయకుడైన చంద్రబాబు కాలానుగుణంగా తనను తాను మార్చుకుంటూ వస్తున్నారు. తన విధానాలను, వ్యవహారశైలిని మార్చుకోవడానికి, చేసిన తప్పులు అంగీకరించడానికి ఆయన వెనుకాడడం లేదు. తనపై వస్తున్న విమర్శలేమిటో ఆయనకు తెలియనిది కాదు. కాని ఆయన ప్రాధాన్యతలు వేరు. ఆరునెలలు పూర్తి చేసుకున్న తర్వాత ఆయన తన చర్యల్లో వేగం పుంజుకునే టేకాఫ్ దశలో ఉన్నట్లు కనిపిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కాంగ్రెస్ దిగజారుడు రాజకీయం!

ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ చేసినప్పుడు కొన్ని బావుల్లో విపరీతమైన ఒత్తిడితో సహజవాయువు వెలువడుతూ ఉంటుంది. విపరీతమైన శబ్దంతో మంటలు ఎగజిమ్ముతూ ఉంటాయి. ఈ మంటలను ఆర్పటానికి వారు అనుసరించే ఉపాయం- ఆ బావి చుట్టూ రంధ్రాలు పెట్టి దాని ద్వారా ఆ ఒత్తిడిని తగ్గించి మంటలు ఆర్పటానికి ప్రయత్నించటం. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమపై ఎగసిపడుతున్న ప్రజా వ్యతిరేకత నుంచి తప్పించుకోవటానికి అరెస్టులను సాధనంగా ఎంచుకొని.. తద్వారా ప్రజాభిప్రాయాన్ని... మీడియా ప్రాధమ్యాలను మళ్లించటానికి ప్రయత్నిస్తున్నది. తాజాగా రామ్‌ అన్నపై కేసులు పెట్టడం.. అరెస్టుకు ప్రయత్నాలు చేస్తూ ఉండటం దీనిలో భాగమే! తెలంగాణ ప్రజలు ఈ డైవర్షన్ పాలిటిక్స్‌ను గ్రహించలేనంత అమాయకులు కారు. అసలు రేవంత్ ప్రభుత్వం ఈ తరహా వ్యూహాలు ఎందుకు పన్నుతోంది? అని కొందరికి అనుమానం రావచ్చు. 'ఇందిర ఆత్మీయ భరోసా'లోని వైఫల్యాలు ప్రజలు గమనించకుండా వారి దృష్టిని వేరే అంశాలపైకి మళ్లించటానికి చేసే ప్రయత్నమే ఇది. ఈ తరహా దగా రాజకీయాలు అనుసరించటం కాంగ్రెస్ పార్టీకి కొత్తేం కాదు. ఎందుకంటే దగా అనేది ఆ పార్టీ రాజకీయ డీఎన్‌ఏలోనే మనకు కనిపిస్తుంది. దీని గురించి ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.

'ముందు దగా.. వెనక దగా.. కుడి ఎడమలు దగా దగా..' మహాకవి శ్రీశ్రీ ఈ కవితాపంక్తులు వేరే సందర్భంలో చెప్పి ఉండచ్చు. కానీ, ఇవి ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు అద్దంపడతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో ఎక్కడా రైతులు సంతోషంగా ఉన్నట్లు దాఖలాలు లేవు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు, మార్కెట్ అవకాశాలను అభివృద్ధి చేయటం- ఇలా అన్ని విషయాలలోను ఈ పార్టీ రైతులను మోసం చేస్తూనే వస్తోంది. ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇవ్వటం.. వాటిని అమలు చేయలేక చేతులెత్తేయడం మన రాష్ట్రంలో అధికార పార్టీకి సర్వసామాన్యమయిపోయింది. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కే మోసకారితనం రైతు భరోసా పంపిణీ కార్యక్రమంలో మరోసారి బయటపడింది. ఈ కార్యక్రమాన్ని కేసీఆర్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇది దేశవ్యాప్తంగా ఒక రోల్ మోడల్‌గా నిలిచింది. రేవంత్‌రెడ్డి సర్కారు- దీని పేరును 'ఇందిర ఆత్మీయ భరోసా'గా మార్చింది. ఏడాదికి 10 వేలు కాకుండా 15 వేలు ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలందరూ ప్రజల దగ్గరకు వెళ్లి పదే పదే చెప్పారు. వరంగల్‌లో జరిపిన భారీ బహిరంగ సభలో రైతు డిక్లరేషన్ పేరిట 15 వేలు ఇస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డిలు ప్రకటించారు. కేవలం రాహుల్‌గాంధీ మాత్రమే కాదు.. ప్రియాంకగాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి వారు కూడా పాల్గొన్న ప్రతి సభలో 15 వేలు ఇస్తామని చెబుతూనే వచ్చారు. ఇక ప్రగల్భాల రేవంత్‌రెడ్డి అయితే- 'కేసీఆర్ ఇచ్చే ముష్టి పదివేలు ఎందుకు? మా ప్రభుత్వం రాగానే ఎకరాకు 15 వేలు ఇస్తామని' ఊరూరా తిరిగారు. రాహుల్‌గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలందరూ చెబుతున్నారు కాబట్టి అమలు చేస్తారని ప్రజలు అమాయకంగా వీరి మాటలు నమ్మారు. దగా చేయటం కాంగ్రెస్ డీఎన్‌ఏలో ఉందనే విషయాన్ని తెలంగాణ రైతాంగం మర్చిపోయింది.

ఎన్నికలు అయిన తర్వాత వాయిదాల పర్వం ప్రారంభమయింది. సోనియాగాంధీ పుట్టిన రోజుకు కానుకగా ఇస్తామన్నారు. రాష్ట్రానికి అప్పులు ఉన్నాయి కాబట్టి తర్వాత ఇస్తామన్నారు. వాయిదాలు వేసి వేసి- ఇప్పుడు 15 వేలు కాదు.. 12 వేలు మాత్రమే ఇస్తామని రేవంత్ రెడ్డి సర్కారు నిసిగ్గుగా ప్రకటించింది. అది కూడా వ్యవసాయ యోగ్యమైన భూములకు అని కొందరు మంత్రులు బహిరంగంగా చెబుతున్నారు. కానీ వ్యవసాయయోగ్యమైన భూములంటే ఏమిటో చెప్పటం లేదు. అంతే కాదు- సాధారణంగా రైతులకు వానకాలం నాట్లకు పెట్టుబడులు అవసరమవుతాయి. ఆ సమయంలో ప్రభుత్వం భరోసా ఇవ్వకుండా 11 వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టింది. ఇప్పుడు యాసంగిలో షరతులతో కూడిన పంపిణీ చేస్తానంటోంది.



> **ప్రజలను దగా చేయటం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. ప్రజలు ఇలాంటి దగాకోరులతో జాగ్రత్తగా ఉండాలి. అంతేకాకుండా తమ వద్దకు వచ్చినప్పుడు- వాగ్దానాలు ఏమయ్యాయని నిలదీయాలి. అక్రమ అరెస్టులను వ్యతిరేకించాలి. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి.**

ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ప్రజలకు తెలియాలి. ఈ మధ్య జరిగిన ఒక మంత్రివర్గ సమావేశంలో చాలా మంది మంత్రులు - హామీలు అమలుపరచకపోవటంపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేశారట. 'రైతుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉంది. రోజు రోజుకు పెరుగుతోంది. ఇదే కొనసాగితే నియోజకవర్గాల్లో మేం తిరగలేం.. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తాయి' అని స్పష్టంగా కూడా చెప్పారట. అయితే రైతులకు హామీలిచ్చిన మన ముఖ్యమంత్రి- నేనేం చేయలేనని చేతులెత్తేశారట! 15 వేల నుంచి 12 వేలకు తగ్గిస్తున్నట్లు చెబితే సమస్యలు ఎదురవుతాయని- మంత్రివర్గ సమావేశం తర్వాత జరిగే విలేకరుల సమావేశంలో ఈ విషయం చెప్పటానికి ఎవరూ ముందుకు రాలేదట. దీనితో ముఖ్యమంత్రే స్వయంగా విలేకరులకు చెప్పాల్సి వచ్చింది. ఈ ఒక్క వ్యవహారం చాలు.. మంత్రివర్గంలో ఉన్న అసంతృప్తి.. అభిప్రాయభేదాలు.. రేవంత్‌రెడ్డిపై ఉన్న అసంతృప్తి తెలియజేయటానికి!

గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్- 'అభయ హస్తం' పేరిట ఒక మేనిఫెస్టో విడుదల చేసింది. దీనిలో ప్రతి రైతుకు.. వారు కౌలు రైతు అయినా సరే- ఎకరానికి 15 వేల రూపాయలు ఇస్తామని.. రైతు కూలీలకు 12 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ఆ సమయంలో ఈ అభయహస్తమే తమ పాలిట భస్మాసుర హస్తమవుతుందని రైతులు ఊహించలేదు. రేవంత్‌రెడ్డి ప్రకటనలో మరో తిరకాసు కూడా ఉంది. ఇప్పటి దాకా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంత మంది రైతులకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'లో స్థానం కల్పిస్తారు.. వారిలో ఎంత మంది కౌలురైతులు.. ఎంత మంది వ్యవసాయ కూలీలనే విషయాన్ని చెప్పటం లేదు. లబ్ధిదారుల విషయంలో ప్రభుత్వం భారీగా కోత పెడుతుందనే వార్తలూ వస్తున్నాయి. ఇదే నిజమైతే లక్షలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఈ వార్తలు నిజమవుతాయనుకోవటానికి కూడా ఒక కారణముంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో కోతలు పెట్టింది. 46 లక్షల మందికి కల్పించాల్సిన రుణమాఫీని 22లక్షల మందికే పరిమితం చేసింది. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి తర్వాత మాట మార్చింది. కేవలం సన్నవడ్లకే బోనస్ ఇస్తానంటోంది. ఇలా రైతులకు కోతల పేరిట ఈ ప్రభుత్వం వాతలు పెడుతోంది.

ఈ దగా కాంగ్రెస్ ప్రభుత్వం- అధికారంలోకి రాక ముందు- వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రకటించింది. మహలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామంది. ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీ ఇస్తామంది. ఇప్పుడు ఆ ఊసే లేదు. వృద్ధులకు, వితంతువులకు రూ. నాలుగువేలు పెన్షన్ ఇస్తామంది. విద్యార్థులకు ఐదు లక్షల రూపాయల భరోసా కార్డు ఇస్తామంది. నిరుద్యోగులకు రెండు లక్షల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామంది.. రెండు లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని భరోసా ఇచ్చింది. పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటుగా ఇళ్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయలు సాయం కూడా చేస్తామంది. ఈ వాగ్దానాలన్నీ ఇప్పుడు ఏ గాలికి కొట్టుకుపోయాయో తెలియదు. వీటి గురించి మాట్లాడటానికి ఇటు మంత్రులు కానీ అటు రేవంత్‌రెడ్డి కానీ సిద్ధంగా లేరు. ఇలా తాము ఆచరణలో పెట్టలేని వాగ్దానాలను కాంగ్రెస్ ఎందుకు చేసిందని మీలో కొందరికి అనుమానం రావచ్చు. ఎందుకంటే- దగా చేయటమనేది కాంగ్రెస్ డీఎన్‌ఏలో ఉంది కాబట్టి.. ప్రజలను దగా చేయటం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య కాబట్టి! ఇక పైనైనా ప్రజలు ఇలాంటి దగా కోరులతో జాగ్రత్తగా ఉండాలి.. అంతే కాకుండా తమ వద్దకు వచ్చినప్పుడు- వాగ్దానాలు ఏమయ్యాయని నిలదీయాలి.. అక్రమ అరెస్టులను వ్యతిరేకించాలి. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి.. దానిలో భాగస్వాములకు బుద్ధి చెప్పాలి.



▪ కల్వకుంట్ల కవిత
ఎమ్మెల్సీ

ఇదొక రాజకీయ పాఠం!

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి నూరవ సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఆంధ్రజ్యోతిలో డిసెంబర్ 22న చెరుకూరి సత్యనారాయణ రాసిన వ్యాసం, దానికి సమాధానంగా డిసెంబర్ 31న సురవరం సుధాకరరెడ్డి స్పందన చూసిన తర్వాత చిన్న విషయం చెప్పాలనిపించింది. చెరుకూరి వ్యాసంలో వైఫల్యాలు, సురవరం వ్యాసంలో విజయాలూ రెండూ వాస్తవాలే. వందేళ్ల సుదీర్ఘకాలంలో అనివార్యంగా లభించే కొన్ని విజయాలు రాజ్యాధికారం దిశగా సాగే ఉద్యమాల వైఫల్యాలను దాచలేవు. విషయాల లోతుల్లోకి వెళ్లడం నా ఉద్దేశం కాదు. ఉద్యమంపై వచ్చే విమర్శలకు వివిధ స్థాయిల్లో ఉన్న కమ్యూనిస్టు నాయకులు అనేకసార్లు సమాధానాలు చెప్పడం చూశాం. కానీ, సురవరం వ్యాసంలో ఉన్న నమ్రత, వినయం, హుందాతనం ఎప్పుడూ ఏ నాయకుని స్పందనలోనూ చూడలేదు. విమర్శ పట్ల కమ్యూనిస్టులు ఎలా స్పందించాలి అనే దానికి సురవరం స్పందన ఒక కరదీపిక. భవిష్యత్తులో కమ్యూనిస్టులు తమ రాజకీయ తరగతుల్లో విమర్శ-ప్రతివిమర్శ అనేది ఎలా ఉండాలో చెప్పడానికి చెరుకూరి వ్యాసం-సురవరం ప్రతివ్యాసం సిలబస్‌గా ఉంచుకోవాలి.

– సి. మేఘనాథరెడ్డి



'వైరస్' అలర్ట్!

హెచ్ఎంపీవీ పై వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆస్పత్రుల్లో ముందస్తు జాగ్రత్తలు

- ప్రాణాంతకం కాదంటున్న వైద్యులు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సలహాలు
- దేశంలో కేసులు నమోదైన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు

7



'భద్రకాళి' ఇక దేదీప్యమానం

- చెరువులోని ఐల్యాండ్ సుందరీకరణకు ప్రతిపాదనలు
- పునఃప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న కుడా అధికారులు
- సుమారు రూ.10కోట్ల అంచనాతో అభివృద్ధి పనులు
- దేవాలయం నుంచి ద్వీపం వరకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం
- పర్యాటకుల ఆహ్లాదం కోసం ప్రభుత్వం చర్యలు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయాన్ని టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా భద్రకాళి బండ్ నుంచి మధ్యలో ఉన్న ఐల్యాండ్‌ను అనుసంధానం చేస్తూ టూరిస్ట్ హబ్ ఏర్పాటుకానుంది. ఇటీవల భద్రకాళి చెరువు పూడికతీత కోసం నీటిని తరలించిన తర్వాత అధికారులకు ఐల్యాండ్ (ద్వీపం) అభివృద్ధి చేయాలని సంకల్పించారు. అక్కడ కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే పర్యాటకులకు ఆహ్లాదంతో పాటు ప్రభుత్వ ఖజానాకు నిధులు వస్తాయని తలంచారు. ఈ మేరకు కుడా అధికారులు ఐల్యాండ్ అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నారు. 2007లోనే భద్రకాళి అభివృద్ధి కోసం కుడా (కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ) అధికారులు ప్రణాళికలు రచించినా.. చెరువు నిండా నీరు ఉండడంతో సాధ్యం కాలేదు. రూ.2కోట్ల నిధులతో పనులు పూర్తి చేయవచ్చని అప్పటి అధికారులు డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు) సిద్ధం చేసినా అమలుకు నోచుకోలేదు. తాజాగా భద్రకాళి చెరువు సుందరీకరణ కోసం నీటిని ఖాళీ చేసిన నేపథ్యంలో కుడా అధికారులకు ఐల్యాండ్ అభివృద్ధి చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ విషయాన్ని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్ద ప్రస్తావనకు తీసుకొచ్చారు. అయితే పాత డీపీఆర్‌ను సవరణ చేసి కొత్త డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం.

రూ.2కోట్లతో అభివృద్ధి

చారిత్రాత్మక భద్రకాళి చెరువులో గతంలో నీరు ఇంకి పోయిన సమయంలో చెరువు స్వభావం, స్వరూపం కనిపించేది. 2005లో చెరువు మధ్యలో సుమారు 5 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపాన్ని అప్పటి అధికారులు గుర్తించారు. ద్వీపం దిబ్బను శుభ్రం చేసి తవ్విచూడగా ప్రాచీన శిల్పాలు, ఆయుధ కర్మాగారం ఉన్నట్లు ప్రాచీనకారులు గుర్తించారు. అంతేకాకుండా ఈ ద్వీపంపై ఆదిమానవులు జీవించినట్లు ఆధారాలు లభించినట్లు చెప్పారు. దిబ్బను ద్వీపంగా మార్చడంతో పాటు ధ్యానం చేయడానికి ప్రత్యేక మందిరం, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని నిర్ధారణకు వచ్చారు. అనుకున్నదే తడవుగా భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్ వద్దకు వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2007లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు గాను రూ2కోట్ల నిధులు కేటాయించారు. ధ్యాన మందిరం ఇంకా అభివృద్ధి పనులకు మరో రూ.3కోట్లు ఖర్చవుతుందని డీపీఆర్‌లు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి ఏకరువు పెట్టారు. అయితే 365 రోజుల పాటు చెరువు నిండు కుండలా నీటితో నిండి ఉండడం కారణంగా ఐల్యాండ్ అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

టూరిస్ట్ హబ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్నవరం తర్వాత అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణం మరెక్కడా లేదు. హంటర్‌రోడ్డులో గుట్టపై ఉన్నప్పటికీ అంత పెద్దగా ప్రాచుర్యం పొందలేదు. కానీ భద్రకాళి చెరువు నుంచి నీరు తరలించిన తర్వాత అధికారులు, ప్రాచీనకారులకు కేబుల్ బ్రిడ్జి ఆలోచన వచ్చింది. భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్ వరకు సుమారు 600 నుంచి 700 మీటర్ల పొడవులో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే చెరువుతో పాటు ద్వీపం ప్రాంతమంగా టూరిస్ట్ హబ్‌గా మారుతుందని చెప్పుకొస్తున్నారు. ఇటీవల కుడా అధికారులు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఐల్యాండ్‌ను అభివృద్ధి చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి నిపుణులను పిలిపించి చూపించినట్లు తెలిసింది. అయితే ఐల్యాండ్ అభివృద్ధి పనులు చేపట్టి భద్రకాళి దేవాలయం, మాడవీదులు, భద్రకాళి బండ్‌ను అనుసంధానం చేస్తూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే పర్యాటకులకు అనుకూలంగా ఉంటుందని, లక్నవరాన్ని మించిన పర్యాటక ప్రాంతంగా భద్రకాళి ద్వీపం వెలుగొందుతుందని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

పనులకు శ్రీకారం

భద్రకాళి చెరువులోని ఐల్యాండ్ వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు కుడా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. గతంలో రచించిన డీపీఆర్ కాకుండా ప్రస్తుతం నిపుణులతో కొత్త డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సుమారు రూ.10కోట్ల వరకు కేబుల్ బ్రిడ్జి, ధ్యానమందిరం, బోటింగ్, సుందరీకరణ, పర్యాటకులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించవచ్చని అధికారులు వెల్లడించారు. చెరువులో పూడికతీత పనులు జరుగుతున్న సమయంలోనే అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా పనులు చేయవచ్చని తెలిపారు. గతంలో నిధుల లేమి వలన పనులు నిలిచిపోయినట్లు కొందరు అధికారులు భావిస్తున్నా.. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పనులకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తోంది. ఇప్పటికైనా కుడా అధికారులు కొత్త డీపీఆర్ ప్రకారం త్వరితగతిన పనులకు శ్రీకారం చుట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

'బండ్' పనులను వేగవంతం చేయాలి

- నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- నియోజకవర్గస్థాయి సమీక్షలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

6

దరఖాస్తులపై సత్వరమే స్పందించాలి

'ప్రజావాణి'లో వరంగల్ కలెక్టర్ సత్య శారద



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చిన వినతులే మళ్లీ మళ్లీ వస్తున్నాయని, వాటిని సాధ్యమైనంత మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 88 వినతులు అందగా శాఖల వారిగా ఎండార్స్ చేశారు. రెవెన్యూ శాఖకు 18, జడ్పీ సీఈవోకు 26, డీఆర్‌డీఏ 2, సివిల్ సప్లై 2, జీడబ్ల్యూఎంసీ 1, పోలీసుశాఖ 3, విద్యాశాఖ 8, ఉపాధిశాఖ 3, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 11, ఎంజీఎం 2, ఎల్‌డీఎంకు 2 వినతులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పెండింగ్ సమస్యలు పరిష్కరించండి..

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి, వరంగల్ ఎంపీ కావ్య
- ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్షా సమావేశం



ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య

హనుమకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. హనుమకొండ కనకదుర్గకాలనీలోని ఎమ్మెల్యే కడియం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారుల సమస్యలపై అధికారులతో కూలంకశంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ.. జనగామ ఆర్‌వోబీ నుంచి కరుణాపురం వరకు అన్ని గ్రామాల్లో సైడ్ డ్రైనేజీలు నిర్మాణం చేశారని, కానీ ఆ డ్రైనేజీ నీరు బయటకు వెళ్లకుండా గ్రామాల్లోకే వస్తోందని, కనుక నీరు బయటకు వెళ్లేలా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. వరంగల్ నుంచి జనగామ పట్టణానికి వెళ్లే జంక్షన్‌లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జంక్షన్ అభివృద్ధి చేయాలని అన్నారు. జనగామ-సూర్యాపేట ఆర్‌వోబీకి ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు, యూటర్న్‌లు సరిగాలేవని, వెంటనే వాటిని సరిచేయాలని అన్నారు. స్టేషన్‌ఘనపూర్, నిడిగొండ, చాగల్, చిన్నపెండ్యాల గ్రామాల్లో సర్వీస్ రోడ్డు చివరి వరకు బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, వీటన్నింటినీ స్వయంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎన్‌హెచ్ఏఐ పీడీ హామీ ఇచ్చారు. అలాగే చిన్నపెండ్యాల గ్రామం వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.27లక్షలు మంజూరు అయ్యాయని, త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో టీచ్-2025 ప్రారంభం

- ఐదు రోజుల ఎఫ్‌డీ కార్యక్రమం
- పాల్గొన్న శ్రీలంక ప్రొఫెసర్ సమరవీర



ఆన్‌లైన్‌లో ప్రసంగిస్తున్న శ్రీలంక ప్రొఫెసర్ దర్శన సమరవీర

హనుమకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టీచ్-2025 ప్రారంభమైంది. 'టీచింగ్ ఇంగ్లీష్ విత్ ఏఐ, క్రిటికల్ పెడగాగీ, హిస్టరీ' పేరుతో మంగళవారం ప్రారంభమైన ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) ఈనెల 11వ తేదీ వరకు కొనసాగుతుంది. నిట్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (హెచ్అండ్ఎస్ఎస్), సెంటర్ ఫర్ ట్రెయినింగ్ అండ్ లర్నింగ్ (సీటీఎల్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో శ్రీలంకకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ దర్శన సమరవీర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలకోపన్యాసం చేస్తూ 21వ శతాబ్దంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు అధ్యాపకులను సిద్ధం చేయడానికి సమకాలీన బోధనా పద్ధతులతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత ఆవిష్కరణలను చేయాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు. సెంటర్ ఫర్ ట్రెయినింగ్ అండ్ లర్నింగ్ అధిపతి ప్రొఫెసర్ టి.కిశోర్‌కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బోధనా పద్ధతులను మెరుగుపరచడంలో, డిజిటల్ లర్నింగ్ కార్యక్రమాలను ప్రోత్సహించడంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యత ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.రాజా విశ్వనాథన్, ప్రొఫెసర్ ఆర్.వెన్నెల పాల్గొన్నారు.

ఐనవోలు జాతరకు సమన్వయంతో పనిచేయాలి

- పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి
- వీడియోకాల్‌లో మంత్రి కొండా సురేఖ ఆదేశం
- మల్లన్న ఆలయ ఆవరణలో సమీక్ష సమావేశం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే నాగరాజు

7



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

బిదూరిని బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలి

- ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



హనుమకొండ అశోకా జంక్షన్‌లో బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ రాష్ట్ర కల్కాజీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రమేశ్ బిదూరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆ మేరకు బీజేపీ అధిష్ఠానం తక్షణమే స్పందించాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐసీసీ అధినేత, ఎంపీ ప్రియాంకగాంధీపై బిదూరి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ అశోకా జంక్షన్‌లో రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బిదూరి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బిదూరి వ్యాఖ్యలు మహిళాలోకాన్ని అగౌరపరిచేలా ఉన్నాయన్నారు. వెంటనే ఆయన ప్రియాంకగాంధీకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రమేశ్ బిదూరి ఏ ముఖం పెట్టుకొని ఢిల్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, రామక్రిష్ణ, పుల్లా పద్మావతి, రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తులదే హవా

హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వసూళ్లు

అధికారుల పేరు చెప్పి ప్రతీ రిజిస్ట్రేషన్‌పై బాదుడు ● ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు



హనుమకొండ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ రిజిస్ట్రేషన్లలో ప్రైవేటు వ్యక్తుల జోరు ఎక్కువైంది. అధికారుల పేరు చెప్పి అందినకాడికి దండుకుంటున్నారు. ఇలా ప్రైవేటు వ్యక్తులు రోజుకు రూ.లక్షల్లో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. హనుమకొండలోని వడ్డేపల్లి సమీపంలో ఉన్న జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రతీ పనికి ఒక రేటు చొప్పున ప్రైవేటు వ్యక్తుల ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. భూముల రిజిస్ట్రేషన్లలో అదనపు వసూళ్లతో ఆస్తులు కూడబెట్టుకుంటూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. హనుమకొండ జిల్లాలో ఇటీవల అక్రమ రిజిస్ట్రేషన్ల పేరుతో లక్షల్లో డబ్బులు ముట్టచెప్పినట్లు కొందరు అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో అనేక అవినీతి ఆరోపణలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి, మరో ప్రైవేటు వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించి ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో లెక్క చొప్పున డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టచెబుతున్నట్లు చెబుతున్నారు. అనేక అవినీతి ఆరోపణలు వచ్చిన వారిపై ఫిర్యాదు చేసినా.. జిల్లా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తి చెప్పిన విధంగానే డబ్బులు వసూలు చేసి పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

హనుమకొండ జిల్లా ఎల్లాపూర్ సమీపంలో ఓ వెంచర్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగాయని ఒక్కో ప్లాట్‌కు రూ.లక్ష చొప్పున తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై జిల్లా రిజిస్ట్రార్ విచారణ చేపట్టడంతో అనేక అవినీతి ఆరోపణలు బయటకు వస్తున్నాయి. కొంతమంది ప్రైవేటు వ్యక్తుల ద్వారా రోజుకు రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు చెబుతున్నారు. అలాగే కిందటేడు ఓ సబ్ రిజిస్ట్రార్ అధికారి పేరు చెప్పి డాక్యుమెంటర్ల వద్ద డబ్బులు వసూలు చేసి ప్రైవేటు వ్యక్తులు తీసుకున్న విషయంపై కార్యాలయంలో గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ విషయంలో సబ్ రిజిస్ట్రార్ మందలించినట్లు తెలిసింది. దీంతో ఇలాంటివి ఇంకోసారి జరుగకుండా చూసుకుంటామని ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు చేయించి ఆ కార్యాలయంలోనే ఆ ప్రైవేటు వ్యక్తి పనిచేస్తున్నట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి మరో ప్రైవేటు వ్యక్తితో కలిసి కార్యాలయంలో అధికారులతో ఆర్థిక సంబంధాలు ఏర్పాటు చేసుకొని నగరంలో వంద గజాల భూమికి అదనంగా రూ.10వేలు, ఇతర రిజిస్ట్రేషన్లకు రోజువారిగా ప్రతీ డాక్యుమెంట్‌పై కొన్ని డబ్బులు అధికారుల పేరు చెప్పి వసూళ్లు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వారిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పలువురు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



పరీక్షల తీరును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ తదితరులు

ఎస్డీఎల్‌సీఈ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్ జనవరి7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూర విద్య కేంద్రం అందిస్తున్న పీజీ సైన్స్ కోర్సుల మొదటి పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కేయూక్యాంపస్‌లోని కెమిస్ట్రీ, ఎడ్యుకేషన్ కళాశాల విభాగం పరీక్షల కేంద్రాల్లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన వారిలో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. రణధీర్‌రెడ్డి, ఎస్డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటగోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్‌లో స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు గోడిశాల స్రవంతి మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. స్రవంతి 'పెర్ఫార్మెన్స్ ఎనాలసిస్ ఆఫ్ టెలికం ఇండస్ట్రీ - ఏ స్టడీ ఆఫ్ సెలెక్టు ఎంటర్‌ప్రైజెస్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల రిటైర్డు ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి పర్యవేక్షణలో స్రవంతి పరిశోధన పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని అవినాష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా స్రవంతి పనిచేస్తున్నారు.

కేయూ ఎంబీఏ మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 22

కేయూ క్యాంపస్ జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ రెగ్యులర్ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జనవరి 22 వరకు చెల్లించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జనవరి 24 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని చూచించారు.

ఫిబ్రవరి 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

హనుమకొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (ఏఐపీటీఎఫ్) పిలుపునిచ్చిందని ఏఐపీటీఎఫ్ జాతీయ కౌన్సిలర్ పి.విక్రంబాబు తెలిపారు. ఏఐపీటీఎఫ్ జాతీయ అధ్యక్షుడు బసవరాజ్ గురికర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా నూతన పెన్షన్ విధానంపై చర్చ జరిగిందన్నారు. జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని కోరుతూ సమావేశం తీర్మానించిందన్నారు. ఈ పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రైమరీ టీచర్స్ రాష్ట్ర ప్యాట్రన్ కూడా అయిన విక్రమ్ బాబు పిలుపునిచ్చారు.

భద్రకాళి బండ్ పనులను వేగవంతం చేయాలి

- నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- నియోజకవర్గస్థాయి సమీక్షలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, జనవరి7(ఆంధ్రజ్యోతి): భద్రకాళి బండ్, వడ్డెపల్లి బండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధ్యక్షతన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, స్మార్ట్‌సిటీ నిధులతో జరుగుతున్న పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. బండ్ ఆవరణలలో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని పార్కులలో ఉన్న ఓపెన్‌జిమ్ పరికరాలను మరమ్మతు చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. బాలసముద్రం, పోతననగర్‌లలో ఉన్న జీడబ్ల్యూఎంసీ డంపింగ్ యార్డులను వెంటనే పూర్తిచేయాలని, స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టర్‌లకు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని, సదరు కాంట్రాక్టర్ తీసుకున్న పనులనన్నింటినీ ప్రారంభించాలన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా నగరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా విస్తరణ పనులను చేపట్టాలని, హనుమకొండ బస్‌స్టేషన్ జంక్షన్ నుంచి కాంగ్రెస్ భవన్ వరకు ఎడమవైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వెడల్పు చేస్తే రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ భవన్ నుంచి రెడ్డికాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డు వెడల్పులో ఉన్నవారికి రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అలాగే పోతననగర్ రోడ్డు వైన్డింగ్, భద్రకాళి అమ్మవారి పార్కింగ్, పెద్దమ్మగడ్డ చివరి రోడ్డు విస్తరణ పరిశీలించాలని, బాధితులు ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. నగరంల ఇంకా ఏమైనా భూకబ్జాలు ఉంటే అధికారుల వెంటనే దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాయిని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారుల వెంట ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. అలాగే నగరంలో అసంపూర్తిగా ఉన్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని, రోడ్డుపై ఉన్న వారిని లోపలికి తీసుకురావాలని సూచించారు. ప్రధానంగా రద్దీగా ఉండే ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్ హోటళ్లలో, గ్రౌండ్‌లలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నూతనంగా నిర్మించే వ్యాపార సముదాయాల భవనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటేనే అనుమతి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నియోకవర్గంలో ఇప్పటికే 3మహిళా శక్తి క్యాంటీన్‌లు ఉన్నాయని, మహిళలకు చేయూత ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న పథకం ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌లను నగరంలో మరిన్ని అభివృద్ధి చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు అందించనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితోపాటు ఆర్డీవో, కార్పొరేషన్ అధికారులు, తహసీల్దార్లు, ఆర్అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



తరిగొప్పులలో దేవాదుల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తరిగొప్పుల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరువుతో అల్లాడుతున్న మెట్ట ప్రాంతమైన తరిగొప్పుల మండలంలో వచ్చే వానాకాలం సీజన్ లోపు గోదావరి జలాలు పరువళ్లు తొక్కనున్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పేజ్-3లో భాగంగా చేపడుతున్న పైపులైన్ పనులకు ఆయన మంగళవారం తరిగొప్పుల మండల కేంద్రం శివారు కనీలకుంట్లలో భూమి పూజ చేశారు. అనంతరం రైతులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరువు ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఒప్పించి 19వ జీవో ద్వారా రూ.104 కోట్లు మంజూరి చేయించానన్నారు. ఈ నిధులతో గండిరామారం మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి మొదటి లింకు లిఫ్ట్ ద్వారా గోదావరి జలాలను పంపింగ్ చేసి మండలంలోని అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, తరిగొప్పుల, అంకుషాపూర్, సోలిపూర్, పోతారం, భోజ్యతండా , కొత్తతండా , వాచ్చతండా , మాన్‌సింగ్‌తండ, బొత్తలపర్రె, బొంతగట్టు నాగారం గ్రామాలలోని 3350 ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీరందగా, పరోక్షంగా మరో 17 వేల ఎకరాలకు సాగునీరందుతోందన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగరావు, మండలాధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, చిలువేరు లింగం, ఉమ్మడి నర్మెట మండల కన్వినర్ పెద్ది రాజిరెడ్డి, మాజి సర్పంచ్ దామెర ప్రభుదాస్, మాజి జెడ్పీటీసీ ముద్దసాని పద్మజ వెంకట్ రెడ్డి, నాయకులు జొన్నగోని సుదర్శన్ గౌడ్, సాయిల్ల రాజు, మల్యాల సుధీర్, కొండ కుమార్ పాల్గొన్నారు.

గడువులోగా రిజర్వాయర్ల పనులు పూర్తి చేయాలి

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



రిజర్వాయర్ల మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. యాసంగికి సాగునీటిపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. రెండు రిజర్వాయర్ల నీటి నిలువ సామర్థ్యంపై సమగ్రంగా వివరాలను అందించాలన్నారు.

దేవరుప్పుల : పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. 60మంది లబ్ధిదారులకు రూ. 60,06,960 విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీఓ సురేష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయడైరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రెడ్డిరాజుల రమేష్, మొలుగూరి రమేష్, ఉప్పల సురేష్‌బాబు, భూక్యా సజ్జన్, రాంచెంద్రూనాయక్, నాగరాజు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు



హమాలీల సమ్మెలో మాట్లాడుతున్న బత్తుల రమేష్‌బాబు

వడ్డెపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ గోదాం హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయీస్ హమాలీల ఎగుమతి, దిగుమతి రేట్ల ఒప్పందం ప్రకారం జీవో విడుదల చేసి పెరిగిన రేట్లను అమలు చేయాలని కోరుతూ హనుమకొండ అంబేద్కర్ భవన్ ప్రాంతంలోని గోదాముల వద్ద చేపట్టన సమ్మె మంగళవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపి బత్తుల రమేష్‌బాబు మాట్లాడారు. సివిల్ సప్లయీస్ హమాలీల వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు సమ్మె చేస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి రేట్లు గతంలో రూ. 26 ఉండగా ప్రస్తుతం రూ.29కి పెంచారని వీటిని తక్షణమే అమలు చేసి ఏరియర్స్‌తో సహా చెల్లించాలని ఆయన కోరారు. హమాలీ కార్మికులందరికీ రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీలతో పాటు రేషన్ డీలర్లకు సైతం గౌరవ వేతనం చెల్లించాలని బత్తుల రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ సమ్మెలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, రాష్ట్ర మునిసిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల ధర్మరాజు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు చలగాని మోహన్, తోట సమ్మయ్య, బత్తుల మహేష్, పోతరాజు రమేష్, గౌరీశంకర్‌తోపాటు ఏఐటీయూసీ నాయకులు బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పులలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో

ఎరువుల దుకాణాల్లో డీఏవో తనిఖీలు

దేవరుప్పుల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా యాసంగి సీజన్‌కు సరిపడే అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే సందేహంతో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులను పంపిణీ చేసే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. డీలర్లు, దుకాణదారులు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాలకుర్తి ఏడీఏ పరశురాం, ఏవో దివ్య, ఏఈవో సాగర్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లిస్తేనే ఆరోగ్యశ్రీ సేవలు

వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ బకాయిలు 12 నెలలు ఉన్నాయని, అవి పూర్తిగా చెల్లిస్తేనే ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగిస్తామని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ వద్దిరాజు రాకేశ్ తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు సమస్యను పరిష్కరించకుంటే ఆరోగ్యశ్రీ సేవలు పూర్తిగా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.



సీపీ అంబర్ కిశోర్‌ఝాకు పూలమొక్క అందజేస్తున్న ఐఎంఏ కార్యవర్గం

సీపీని కలిసిన ఐఎంఏ నూతన కార్యవర్గం

వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను, డిప్యూటీ పోలీస్ కమిషనర్ షేక్ సలీమాను మంగళవారం ఐఎంఏ నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారికి పూలమొక్కలను అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఐఎంఏ చేసే సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నాగార్జునరెడ్డి, సెక్రటరీ డాక్టర్ అజిత్ మహ్మద్, టీజీఎంసీ పీఆర్ కమిటీ చైర్మన్, ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.నరేశ్ కుమార్, ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ మన్మోహన్‌రాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ దిలీప్, డాక్టర్ అభిలాష్‌లు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి: ఏసీపీ

పోలీసు శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ

జఫర్‌గడ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రత నిబంధనలు విధిగా పాటించాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జఫర్‌గడ్‌లో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ వద్ద వాహనదారులు, డ్రైవర్లు, గ్రామస్తులతో ఏసీపీ మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. రహదారిపై ఓవర్ టేక్, రోడ్డు క్రాస్ చేసే సందర్భంలో ముందు, వెనుక వాహనాల రాకపోకలను తప్పనిసరిగా గమనించాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, అలాగే ద్విచక్ర వాహనదారులు ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, జఫర్‌గడ్ ఎస్ఐ బానోత్ రాంచరణ్‌నాయక్, పోలీసు సిబ్బంది, వాహనదారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఏసీపీ నర్సయ్య, పోలీసు, వాహనదారులు

కూనూరు హైస్కూల్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ అవార్డు



హెచ్ఎం రాంమూర్తికి అవార్డును అందిస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్య

జఫర్‌గడ్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌కు 2024 విద్యా సంవత్సరానికి గాను మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్, హైబ్రిజ్ టీవీ సంస్థ, హైద్రాబాద్ సంయుక్తంగా ఎడ్యుకేషన్ ఎక్సలెన్సీ-2024 అవార్డును ప్రకటించారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల సంఖ్య నమోదు పెంపు, ఉత్తీర్ణత, విద్య, సాంస్కృతిక క్రీడా రంగాల్లో విద్యార్థుల ప్రతిభ, పరిశుభ్రత, వంటి అంశాల ప్రాతిపదికన జిల్లాలో కూనూరు హైస్కూల్‌ను ఎంపిక చేసినట్లు సంస్థల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం హైద్రాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా కూనూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంమూర్తి నేతృత్వంలో ఉపాధ్యాయుల బృందం అవార్డు, మెమెంటోలను అందుకున్నారు. అవార్డు రావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

10న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 10న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కేపీఎల్ గ్రూప్ కంపెనీలో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు శుక్రవారం ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సంబంధిత జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నకిలీ వైద్యుడి గుట్టురట్టు

ఫిజియోథెరపీ చదివి ప్రాక్టీస్ చేస్తున్నవైనం

వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కరీమాబాద్‌లో నకిలీ వైద్యుడి గుట్టును రట్టు చేశారు. ఫిజియోథెరపీ చదివి డాక్టర్ అని చెప్పుకుంటూ ప్రాక్టీస్ చేస్తున్న ఎ.దిలీప్‌ను మంగళవారం వరంగల్ జిల్లా టీజీఎంసీ, ఐఎంఏ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి గుర్తించారు. సదరు ఫిజియోథెరపిస్టు ఎ.దిలీప్ ప్రభుత్వ అనుమతి లేకుండా క్లినిక్ ఏర్పాటు చేసి అశాస్త్రీయంగా అధిక మోతాదులో యాంటీబయోటిక్, స్టెరాయిడ్స్, నొప్పి నివారణ ఇంజక్షన్స్ రోగులకు ఇస్తున్నట్లు గుర్తించారు. చట్టవిరుద్ధంగా ఆధునిక వైద్యం చేస్తూ సుమారు రూ.3వేల విలువగల మందులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. డ్రగ్స్, కాస్మెటిక్ చట్టం (1940) సెక్షన్ 18సీ ప్రకారం కేసు నమోదు చేస్తామని వరంగల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అరవిండ్ కుమార్ తెలిపారు. అలాగే ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఐఎంఏ రాష్ట్ర అంటి క్వాకరీ చైర్మన్ డాక్టర్ అశోక్‌రెడ్డి, వరంగల్ జిల్లా ఐఎంఏ కోశాధికారి డాక్టర్ శిరీష్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2110	2045
పల్లికాయ (సూక)	6500	5600
పల్లికాయ (పచ్చిది)	4850	4500
కందులు	7166	5560
పెసళ్లు	7059	4000
పత్తి	7155	5800
పసుపు (కాడి)	11559	10235
పసుపు (గోల)	11565	10432
తేజ మిర్చి	13500	9000
తేజ మిర్చి (కొత్తది)	14500	10500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	14000	11000
యూఎస్ 341 కొత్తది	14000	12500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



వైరస్ అలర్ట్!

హెచ్ఎంపీవీ వ్యాధిపై వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం


- దేశంలో కేసులు నమోదైన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆస్పత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణుల సలహాలు



ప్రాణాంతకం కాదు.. భయపడొద్దు అంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటాన్యూమో (హెచ్ఎంపీవీ) వైరస్.. ప్రస్తుతం ప్రపంచాన్ని భయపెడుతోంది. చైనాలో ఈ వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, మన దేశంలోనూ బెంగళూరు, గుజరాత్, చెన్నైల్లో ఐదుగురు చిన్నారులు ఈ వైరస్ బారిన పడిన విషయం వెలుగులోకి రావడం.. పైగా ఆ బాధితుల్లో ఎవరూ విదేశాలు వెళ్లిన వారు లేకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొవిడ్ కాలం నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటు న్నారు. ఈ క్రమంలో అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నివారణతోపాటు బాధితులకు అందించాల్సిన వైద్యసేవలపై దృష్టిపెట్టాయి. ఇదే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. అన్ని ఆసుపత్రుల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. ఓ వైపు ప్రజలను అప్రమత్తం చేస్తూనే జాగ్రత్తలు చెబుతున్నారు. ఈ వైరస్ గురించి భయపడాల్సింది ఏమీ లేదని ధైర్యాన్ని ఇస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 24గంటల ఆస్పత్రులు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లోని డాక్టర్లు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో హెచ్ఎంపీవీ లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విదేశాల నుంచి ఉమ్మడి జిల్లాకు వస్తున్నవారిపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. సాధారణంగా ఉమ్మడి జిల్లా నుంచి చైనా, తదితర దేశాలకు వెళ్లే వారు ఎక్కువ సంఖ్యలోనే ఉండటంతో.. ఇటీవల కాలంలో చైనా నుంచి వచ్చిన వారెవరైనా ఉన్నారా? అని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కరెంట్ టాపిక్



ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం..



దేశంలో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఐసోలేషన్‌వార్డుల ఏర్పాటు లాంటి వాటిపై ప్రాథమిక సూచనలు చేశాం. ఈ వైరస్ ప్రాణాంతకమైంది కాకపోయినా దీని బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి. ప్రతీ ఒక్కరు మాస్కులు ధరించాలి. కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు ఇప్పుడు కూడా పాటిస్తే మరీ మంచిది.

- డాక్టర్ అప్పయ్య, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

ఆందోళన అవసరం లేదు..


హెచ్ఎంపీవీకి వ్యాక్సిన్ లేదు. కరోనా సమయంలో ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు హెచ్ఎంపీవీని గుర్తించడానికి ఎలాంటి పరీక్షలు లేవు. ఇంత వరకు ఈ వ్యాధిని నయం చేయడానికి తగిన ఔషధాలు కూడా లేవు. ఈ వైరస్ మరింత బలపడితే తీవ్ర ప్రభావం చూపే అవకాశాలుండటంతో అప్రమత్తంగా ఉండాలని అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు, ఆస్పత్రుల సూపరింటెండెట్లకు రాష్ట్ర వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. దాంతో హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో వైద్యులు హెచ్ఎంపీవీ పై దృష్టి సారిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ఇప్పటి వరకు హెచ్ఎంపీవీ సంబంధిత కేసులు నమోదు కాకపోవడంతో ఊరటనిచ్చే అంశమని, అయినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. ఇది ప్రాణాంతకం కాదని, భయపడాల్సిన అవసరం లేదు... కానీ గాలి ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అవకాశమున్న నేపథ్యంలో మాస్కులు ధరిస్తే మంచిదని, శానిటైజర్ వాడటం, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ప్రచారం చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి త్వరగా ఈ వైరస్ సోకుతుందని, కీమోథెరపీ, అవయవ మార్పిడి చేసుకున్న వారిపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పులు లాంటివి తీవ్రంగా ఉంటే ఆందోళన చెందకుండా వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

ఇది కరోనా లాంటి వైరస్ కాదు..



హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ) రెండు రకాలు. అది ఏ, బీ. దీనిలో ఆరు జీనో రకాలున్నాయి. దానిలో ఏ2సీ, బీ2 అనే రకాలు అధిక శాతం వ్యాప్తిలో ఉన్నాయి. దీనిలో ఏ2సి ప్రపంచ వ్యాప్తంగా 2018లో 1.10కోటి కేసులకు కారణమైంది. ఈ వైరస్ అంత ప్రాణాంతకమైనది కాదు. జ్వరం, దగ్గు, న్యూమోనియా దీని ముఖ్య లక్షణాలు. ఈ హెచ్ఎంపీవీ వైరస్ ముఖ్యంగా 1 నుంచి 4 యేళ్ల వయసు గల పిల్లల్లో అధికంగా సోకుతుంది. చైనాలో వ్యాప్తి చెందిన ఏ2బీ వేరియంట్ ఏ2సీతో పోలిస్తే తక్కువ తీవ్రత ఉంది. ఇది కరోనాలాంటి వైరస్ కాదు. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి.

- డాక్టర్ అజిత్ మహ్మద్,
సీనియర్ జనరల్ ఫిజీషియన్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి



మేడారంలో పనులు శాశ్వతంగా నిలవాలి

- భక్తులకు అసౌకర్యం కలగొద్దు
- మినీ జాతర ఏర్పాట్లపై మంత్రి సీతక్క సమీక్ష

ములుగు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మేడారంలో చేపట్టే ప్రతీ పని శాశ్వతంగా నిలవాలని, నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర ఏర్పాట్లపై గట్టమ్మ సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష జరిపారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే జాతరను విజయవంతం చేసేందుకు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మినీ జాతర నేపథ్యంలో ముందస్తుగా మేడారానికి భక్తులు వస్తున్నారని, దాంతో 15 రోజులుగా రద్దీ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతులను మెరుగు పర్చాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి భక్తుల రాక అధికమవుతుందని, ఈమేరకు అప్రమత్తం కావాలని అన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

జనవరి నెలాఖరుకల్లా లింకురోడ్ల పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. తల్లుల గద్దెలను దర్శించుకునే సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దన్నారు. పారిశుధ్య లోపం తలెత్తవద్దని, వీలైనంత ఎక్కువ మంది కార్మికులను నియమించుకోవాలని సూచించారు. జాతర జరిగే ఐదు రోజులపాటు విద్యుత్ సరఫరా నిరంతరాయం కొనసాగాలన్నారు. జంపన్న వాగు వద్ద పుణ్య స్నానాలు చేసిన మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయాలని, ఉన్నతాధికారులు నిత్యం పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని ఆదేశించారు. పనుల నిర్వహణకు అయ్యే వ్యయ అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైనన్ని నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఓఎస్డీ రవీందర్, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, ఆయా శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ద్వార దర్శనంతో విష్ణు కటాక్షం

- ఎల్లుండి వైకుంఠ ఏకాదశి
- ముస్తాబైన ఆలయాలు.. ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఆధ్యాత్మికం



వరంగల్ కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీ శుక్రవారం రోజున వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5గంటలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వరంగల్ గీతా భవన్ శ్రీవేంకటేశ్వర స్వామి, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఎల్లంబజార్‌లోనిశ్రీసీతారామచంద్రస్వామి, భద్రకాళి రోడ్డులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, డాక్టర్స్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఆకారపు వారి దేవాలయంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రం, శివనగర్‌లోని శ్రీరామాలయం, కరీమాబాద్‌లోని రామస్వామి గుడి, కాశిబుగ్గలోని శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో ఉదయం అభిషేకాలు నిర్వహించిన అనంతరం అలంకరణలు అర్చనలు పూజలు నిర్వహించి వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తారు.

పవిత్రం

వైకుంఠ ఏకాదశి అన్ని ఏకాదశిలలో అత్యంత పవిత్రమైనది. ఈ రోజున ఉపవాసం ఉండి శ్రీమహా విష్ణువును ద్వార దర్శనం చేసుకుంటారు. దీనినే వైకుంఠ ద్వార దర్శనమని కూడా అంటారు. వైకుంఠం అంటే విష్ణు నివాసం అని అర్థం. ఈ వైకుంఠ ఏకాదశి రోజున హిందువులు విష్ణువును ఆరాధిస్తే స్వర్గానికి చేరుకుంటామని భావించి ఉపవాస దీక్షతో పూజలు నిర్వహిస్తారు. పురాణాల కాలం నుంచి వైకుంఠ ద్వార దర్శనాన్ని నిర్వహిస్తున్నారు. ద్వార దర్శనం సందర్భంగా ఆలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలను భక్తులు దర్శించుకోనున్న నేపథ్యంలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

ఆండాళ్ అమ్మవారికి పూజలు, తిరుప్పావై ప్రవచనం

నెల రోజుల పాటు కొనసాగే ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం నిర్వహిస్తారు. ఆ రోజున గోదాదేవి ఆండాళ్ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుప్పావై ప్రవచనాలు పఠిస్తారు. ఈ సందర్భంగా భగవద్గీత పారాయణాలు, శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణాలు పఠిస్తారు. అనంతరం భక్తులకు పొంగలి, లడ్డూ, పులిహోర ప్రసాదాలను అందిస్తారు.

దశాబ్దాల ఆనవాళ్లు..

గూడూరులో కనువిందు చేస్తున్న భారీ వృక్షాలు



గూడూరు అటవీశాఖ కార్యాలయంలో భారీగా ఉన్న వేప, చింత, రావి చెట్లను చూపిస్తున్న బేస్‌క్యాంప్ సిబ్బంది

'ఈ చెట్లు మా తాతల కాలం నాటివి.. మా ముత్తాతల కంటే ముందు తరాలకు చెందిన ఈ వృక్షాలు చెక్కు చెదరలేదు.. ఇవి మా అమ్మ తన చిన్నప్పుడు నాటిన చెట్లు..' ఇలాంటి మాటలు మనం తరచూ వింటున్నాం కదా..! కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే చెట్ల వయస్సు మాత్రం మనమెవ్వరం ఊహించలేం కూడా.. వాటి వివరాల్లోకి వెళితే.. గూడూరు అటవీశాఖ కార్యాలయంలో సుమారు 80 ఏళ్ల భారీ వృక్షాలు 8 మీటర్ల వెడల్పుతో భారీ కొమ్మలతో పచ్చని వాతావరణం కల్పిస్తున్నాయి. ఈ భారీ వేప, చింత, రావి చెట్లు అటవీశాఖ సంరక్షణలో సరికొత్తగా చిగురిస్తూ ఆకాశమంతా ఆకుపచ్చ అందాలను పరిచేసింది. ఎండకాలంలో నీడతో పాటు చల్లని వాతావరణాన్ని అందిస్తున్నాయి. చెట్ల చుట్టూ చెదలు, తెగుళ్లు రాకుండా గూడూరు ఎఫ్ఆర్వో సురేష్ సిబ్బందితో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మహా వృక్షాలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

గుర్తుకొస్తున్నాయి..

ఎన్నో జ్ఞాపకాలను తట్టిలేపుతున్న పాత రైలు టికెట్

జ్ఞాపకం

దశాబ్దాల క్రితం వాడిన వస్తువులను చూడగానే ఎవరికైనా నాటి స్మృతులన్నీ కళ్లముందు కదలాడుతుంటాయి. ప్రతీ ఒక్కరు జ్ఞాపకాల్లోకి వెళుతుంటారు. ఇదే తరహాలో కేసముద్రం నుంచి వరంగల్‌కు 2004లో ఉపయోగించిన పాతతరం రైల్వే టికెట్ ఒకటి స్థానిక సామాజిక మాధ్యమాల్లో రెండు, మూడు రోజులుగా చక్కర్లు కొడుతోంది. 1990 దశకంలో నాటి పిల్లలు అట్టముక్కపై ముద్రించి ఉన్న టికెట్లను సేకరించి ఆడుకునేవారు. తిరుపతి, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాలకు వెళ్లిన సందర్భంలో ఆ ప్రయాణానికి సంబంధించిన టికెట్లను ఒక జ్ఞాపకంగా దాచిపెట్టుకునే వారు. నేటి డిజిటల్ యుగంలో కాగితం టికెట్లు, ఈ-టికెట్లు రావడంతో అవన్నీ నేటి తరం వారికి తెలియకుండా పోయాయి. అయితే సోషల్‌మీడియాలో పాతటికెట్ ఒకటి చెక్కర్లు కొడుతుండటాన్ని చూసిన వారంతా 'గుర్తుకొస్తున్నాయి..' అంటూ ఆ తీపి గురుతును తెలిసిన వారందరికీ షేర్ చేస్తుండడం విశేషం.

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న కేసముద్రం - వరంగల్ మధ్య రాకపోకలకు 20ఏళ్లనాడు ఉపయోగించిన రైలు టికెట్

'కష్టాల' కల్లాన్ని ఊడ్చి!

- కూటి కోసం తిప్పలు పడుతున్న 70ఏళ్ల లచ్చమ్మ



మట్టి కలిసిన వడ్లను చాటతో చెరుగుతున్న లచ్చమ్మ

ములుగు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నెరిసిన జుట్టు గాలికి చెదిరిపోయింది.. అయినా ఆమె నుదురుపై సింధూరం ధగధగా మెరిసిపోతోంది.. ముడతలు పడ్డ చర్మం ఆమె వృద్ధాప్యాన్ని ఎత్తి చూపుతున్నా.. కష్టాల కల్లాన్ని ఊడేడ్చేందుకు ఆమె శ్రమిస్తోంది. కల్లంలో పడిన వడ్లగింజలను ఏరుతూ.. మొక్కిలి చీపురుతో ఊడ్చుతూ.. వచ్చిన మట్టిని జల్లెడపట్టి.. చాటతో చెరుగుతూ ధాన్యాన్ని కుప్పలు పోస్తోంది. నడినెత్తిన ఎండ మండుతున్నా ఆమె శ్రమిస్తూనే ఉంది.. ములుగు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో మంగళవారం కిందపడిన వడ్లను సేకరిస్తున్న ఆమెను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. 70ఏళ్ల వయసులో కాసిన్ని మెతుకుల కోసం వడ్ల గింజలను పోగుచేసుకుంటున్న ఆ వృద్ధురాలి పేరు రత్న లచ్చమ్మ ఊరు వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి. 'ఎండలో ఎందుకింత కష్టం' అని అడిగితే.. కడుపుతిప్పలకు తప్పదు కదా బిడ్డా..! అని సమాధానం చెప్పింది. ఆమె కళ్లు ఓ వైపు వడ్ల గింజలను వెతుకుతూనే ఉండగా.. తన బరువెక్కిన హృదయంతో తన దీన స్థితిని వెలిబుచ్చింది. 'నా భర్త ఎల్లయ్య. 80ఏండ్లు దాటినై. మంచంలోనే ఉంటడు. నేను పెడితెనే తింటడు. మాకు ఏడుగురు కొడుకులు. ఒక బిడ్డ. మేం ఆకలితో ఎండినా కొడుకులకు మాత్రం ఏ తక్కువ చేయలే. నా బిడ్డ చచ్చిపోయింది. ఏడుగురు కొడుకుల్లో ఒకడు ఇంజనీరు. ఒక కొడుక్కు నౌకరి ఉందని సర్కారు నాకు పించిని ఇత్తలేదు. పండగలకు, పబ్బాలకు ఇంటికి వచ్చినప్పుడు నా కొడుకు నాలుగైదు వేలు ఇచ్చిపోతడు.. వాటితో కొన్ని ఖరుసులెల్తయ్. నా భర్త ఎల్లయ్య నేడు పెడితేనే తింటడు. నాలుగేండ్ల సంది వడ్ల కల్లాలను ఊడ్చుకుని దొరికిన వడ్లను అమ్ముకుంటున్నా..' అంటూ కన్నీటి పర్యంతమైంది. ఏడుగురు కొడుకులున్నా ఎవ్వరిపై ఆధారపడకుండా ఏడుపదుల వయసులో మనోనిబ్బరంతో కష్టపడుతున్న ఆమె అందరికీ మార్గదర్శకం. అయితే పదిరోజులుగా లచ్చమ్మ కల్లాన్ని ఊడ్చి 120కిలోల వడ్లను పోగేసింది.

ఐనవోలు జాతరకు సమన్వయంతో పనిచేయాలి

- వీడియోకాల్‌లో మంత్రి కొండా సురేఖ ఆదేశం
- మల్లన్న ఆలయ ఆవరణలో సమీక్ష సమావేశం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే నాగరాజు



మల్లికార్జునస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఐనవోలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవాదాయధర్మదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాల్ ద్వారా ఆదేశించారు. జనవరి 12 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ ప్రావీణ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు వివిధ శాఖల ఎజెండా అంశాలను చదివి వినిపించారు. సమీక్ష సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. గత జాతర అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ ఫ్రీజాతరగా చేయాలనే ఉద్దేశంతో పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ బ్యాగ్‌లు, బాటిల్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి, స్క్రోలింగ్ లైన్స్‌ని ఏర్పాటు చేసి వ్యాపారులను, భక్తులను అనౌన్స్‌మెంట్ ద్వారా చైతన్యపరుచాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంత్రిని విజ్ఞప్తి చేశారు.

భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తాం..

జాతరకు భక్తులు లక్షల సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా సకల సౌకర్యాలు కల్పిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చెప్పారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే జాతర విజయవంతానికి అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖతోపాటు ప్రైవేటు ఆస్పత్రులను భాగస్వామ్యం చేసి కమ్యూనిటీ రిసోర్స్ ఫండ్ కింద వారు వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. కొత్త వైరస్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని అవసరమైతే జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలని వివరించారు. ఐనవోలుకు వచ్చే రహదారులను తక్షణమే మరమ్మతులు చేయాలని, మూలమలుపులు, వ్యవసాయబావుల వద్ద రేడియంతో కూడిన సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖల ఆధ్వర్యంలో నిరంతరం పారిశుధ్య నిర్వహణ చేపట్టాలన్నారు. మహిళల కోసం స్నానగదులు ఏర్పాటు చేసి దుస్తులు మార్చుకోవడం కోసం డ్రెస్సింగ్ రూములు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జాతరలో భక్తులను చేరవేసేందుకు ఆర్టీసీ బస్సులను ఎక్కువమొత్తంలో నడుపాలన్నారు. అగ్నిమాపకశాఖ మినీ వెహికిల్స్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రత్యేక వీఐపీ లైన్ ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు.

జాతరలో అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా నిఘా ఉంచాలని ఆదేశించారు. జాతర పరిసర ప్రాంతాల్లో మద్యం విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూంచించారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. మేడారం తర్వాత ఐనవోలు పెద్ద జాతర ఐనందున కార్పొరేషన్ ద్వారా అన్నివిధాలా సహకరిస్తామన్నారు. పారిశుధ్య సిబ్బంది, ఫాగింగ్ యంత్రం, చెత్త తరలింపునకు డంపర్ బిన్లను అందుబాటులో ఉంచుతామన్నారు.కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జాతర సమయం సమీపిస్తున్నందున ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపులో గ్రేటర్ వరంగల్ మునిసిపల్, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డ్రెస్సింగ్ రూంలు, తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్ర శాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని సత్వరమే పనులు చేపట్టి పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కమిషనర్ అశ్విని తానాజి వాకడే మాట్లాడుతూ.. పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని కేటాయించి చెత్తను తరలించేందుకు స్వచ్ఛ ఆటోలను సిద్ధంగా ఉంచనున్నట్లు తెలిపారు. టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు స్వచ్ఛమైన మిషన్‌భగీరథ తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మునిసిపల్ శాఖ అందిస్తున్న సేవలు మరువలేనివని ఎప్పటికీ అలాగే అందించాలని కోరారు.

'కుడా' ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ఐనవోలు ఆలయ ప్రాంగణంలో 'కుడా' ద్వారా ఇప్పటికే పనులు చేపట్టామని, మిగిలిన శాశ్వత నిర్మాణ పనులను జాతర అనంతరం చేపడుతామని హామీ ఇచ్చారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. మల్లికార్జునస్వామి సేవలో భక్తులు... భక్తుల సేవలో పోలీసులు.. నిమగ్నమై సేవలందిస్తారని తెలిపారు. జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తును ఏర్పాటు చేసి నిఘా కళ్లతో పర్యవేక్షిస్తామన్నారు. గత జాతరలో లోపాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా చర్యలు చేపడుతామన్నారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ ద్వారా జాతరను పర్యవేక్షిస్తామన్నారు.

కాగా, సమీక్ష సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యే, మేయర్, కుడా ఛైర్మన్, జిల్లా కలెక్టర్, అధికారులు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ ఏసీ సునిత, ఆర్డీవో రమేష్‌రాథోడ్, డీఎంఅండ్‌హెచ్‌వో అప్పయ్య, డీపీవో రమాకాంత్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బొట్ల చక్రపాణి

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు చేస్తున్న ఎగుమతి దిగుమతుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి సెస్‌ల రూపంలో కోట్ల రూపాయలు వస్తున్నా.. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం నయా పైసా ఖర్చు చేయడం లేదన్నారు. అందుకే వెంటనే హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, వెంకన్న, ఆదాం, అంజయ్య, కమల్, వెంకటప్ప, రామ్మూర్తి, రమేష్, సదయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



కేయూలో ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

కేయూ క్యాంపస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కేయూ పరిపాలన భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోధ్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తమ న్యాయమైన డిమాండ్ తమను క్రమబద్ధీకరణ చేయాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల జీవితాల్లో చీకట్లు నింపిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తమకు రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వర్సిటీల్లో 1,445 మంది పనిచేస్తున్నారని తెలిపారు. రెగ్యులజ్ ప్రక్రియ ఆలస్యమైతే తమకు యూజీసీ 7వ వేతన ఒప్పందం మేరకు బేసిక్ పే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిని కలిసిన కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం కోఆర్డినేషన్ నేతలు వినతి పత్రాన్ని అందచేశారు. తమ సమస్యలను రిజిస్ట్రార్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం కోఆర్డినేషన్ నేతలు సతీశ్, కనుకయ్య, జూల సత్య, సాధు రాజేశ్, భిక్షపతి, నాగయ్య, సిద్ధార్థ్, వెంకటేశ్, సూర్యనారాయణ, రఘువర్ధన్‌రెడ్డి, రమేశ్, లింగయ్య, సదాశివుడు, చంద్రశేఖర్, శ్రీధర్‌రావు, చందూలాల్, ప్రణీత, ప్రియాంక, సుజాత, రాజేశ్వరి, వందన, భాగ్య శ్రీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలి



అకాడమిక్ సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చునని ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి టి.యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యాదగిరి మాట్లాడుతూ... కళాశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు అధ్యాపకులు ఫోన్లు చేసి వారిని కళాశాలకు రప్పించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. వివిధ అకడమిక్ అంశాలపై అధ్యాపకులకు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాలల్లోని లాబొరేటరీలు, లైబ్రరీ, తరగతి గదులను ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో ఏ గోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాసరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు



విద్యార్థులు వేసిన ముగ్గులను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించిన ముగ్గుల పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించిన న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ సుచరిత పాల్, డాక్టర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రెడ్డికాలనీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు, ప్రధాన కార్యదర్శి గుర్రపు రమేశ్, కోశాధికారి నరెట్ల మహేందర్, దుంపేటి నరేందర్‌బాబు, బేతి రమేశ్, బత్తుల మహేందర్, శ్రీనివాస్, మహేశ్, సారంగపాణి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు ఓనర్‌తో సీఐ వాగ్వాదం

వరంగల్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పబ్లిక్ గార్డెన్ పక్కన పార్కింగ్ చేసిన ట్రావెల్ బస్సు టైర్ల నుంచి కొద్ది రోజులుగా ఉదయం వేళ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి గాలి తీస్తుండటంతో బస్సు యజమానికి, సీఐ మధ్య మంగళవారం వాగ్వాదం చోటు చేసుకుంది. బస్సు యజమాని అశోక్ కథనం ప్రకారం.. పెట్రోల్ పంపు సమీపంలో అశోక్ ట్రావెల్స్ నెలకొల్పి వాహనాలను కిరాయికి ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం శంఖం ఫౌంటేన్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో రాత్రి పూట వాహనాలను పార్కింగ్ చేసేవారు.

కాగా గతంలో పని చేసిన ట్రాఫిక్ పోలీసులు అక్కడి నుంచి టీటీడీ కల్యాణ మండపం గేట్ తర్వాత ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు ప్రహరీ వెంట పార్కు చేసుకోవాలని సూచించగా, కొంత కాలం నుంచి రాత్రి సమయాల్లో అక్కడే పార్కింగ్ చేస్తున్నాడు. కాగా, బస్సుల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ జామ్ అవుతోందని, బస్సులను అక్కడి నుంచి తీసేయాలని కొద్ది రోజుల నుంచి ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి ఉదయం పూట వచ్చి బస్సు టైర్లలో గాలి తీస్తున్నారని ట్రావెల్ నిర్వాహకుడు అశోక్ వాపోయాడు.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష

హనుమకొండ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయమై పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమీక్ష జరిపారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నిష్పక్షపాతంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని సూచించారు. లోపాలు లేకుండా ఎంపిక ఉండాలని, ఎవరైనా తప్పుడు పనులకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

క్రీడాకారులను సన్మానించిన నాయిని

హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్ స్టేట్ మీట్ పోటీల్లో పతకాలు సాధించిన సాయిచరణ్, సరస్వతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాన్ని ముక్తవరపు సరస్వతి సాధించారు. అలాగే ట్రిపుల్ జంప్‌లో గోల్డ్ మెడల్‌ను కామను సాయిచరణ్ గెలిపొందారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లాకు చెందిన వారిని ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. జిల్లాకు క్రీడా పరంగా కీర్తి తీసుకురావాలని సూచించారు. క్రీడాకారులకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు.

సమ్మయ్యను అభినందించిన ఎమ్మెల్యే

తెలంగాణ కాంగ్రెస్ ఫిషర్‌మెన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమితులైన మండల సమ్మయ్యను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో మండల సమ్మయ్య ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ క్రమంలో సమ్మయ్యను సన్మానించి అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బాలసముద్రం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, హింస నుంచి రక్షణ పొందడానికి బాధితులకు అవసరమైన సహాయాన్ని అందుకునేందుకు సఖీ వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని హనుమకొండ సఖీ వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పేర్వారం హైమవతి సూచించారు. మంగళవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని సఖీ సెంటర్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా రక్షణ కోసం మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త భాగస్వామ్యంతో వన్‌స్టాప్ సెంటర్ 24 గంటల పాటు పనిచేస్తున్నట్లు ఆమె వివరించారు. హింసను ఎదుర్కొంటున్న బాధిత మహిళలు హెల్ప్‌లైన్ 181కు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

బాధితులకు అవసరమైన పక్షంలో వైద్య సహాయం, పోలీసు సహాయం, న్యాయ సహాయం తాత్కాలిక వసతిని కల్పించనున్నట్లు హైమావతి తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా కాపాడుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సఖీ సెంటర్ ఉద్యోగులు పావని, విజయలక్ష్మి, శ్రీదేవి, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మడికొండ, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : రైతులు, రైతు కూలీలకు రైతు భరోసా కింద రూ. 12000 ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు మంగళవారం మడికొండ చౌరస్తాలో కాజీపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, 64, 46 డివిజన్ల అధ్యక్షులు కుర్ల మోహన్, వస్కుల నాగరాజ్, నాయకులు వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బిల్ల రవిందర్, రాజారపు స్వామి, వస్కుల శ్రీనివాస్, వస్కుల శివ, నాగరాజ్, కంచనపల్లి వెంకటయ్య, కొప్పుల నవీన్, దువ్వ చిన్న కుమార్, నీలం రజిని, మూల మురళి, బరిగల శ్రవణ్, బోగి లింగమూర్తి, నిగ్గుల వెంకటప్రసాద్, రాజ్‌కుమార్, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ మహిళా జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జనవరి 7 నుంచి 11 వరకు చైన్నైలోని జెప్పీయాన్ వర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ మహిళల వాలీబాల్ జట్టును 2024-25 ఏడాదికి గాను మంగళవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హసన్ పర్తి కిట్స్ కళాశాల, పీడీ కె. వెంకటస్వామి వ్యవహరి స్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ వెంకయ్యలు అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

వడ్డెపల్లి, జనవరి 7 (ఆంధ్ర జ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని పింగిళి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3ల ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో వరంగల్ వారితో గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు బీ రవీందర్, అధ్యాపకులు సురేష్‌బాబు, అరుణ, కవిత, రత్నమాల, మమత, రాజే శ్వ రి, రేణుక, లక్ష్మీకాంతం, సునిత, ప్రశాంతి, ఉదయశ్రీ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు చర్యలు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, అక్రమ మద్యం, గుడుంబా నిర్మూలనను పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజిత్‌రావు తెలిపారు. 'అచేతన అబ్కారీ' పేరిట సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డీసీ స్పందించారు. ఉమ్మడి జిల్లాలోని 17 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లతో పాటు జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీంలు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను సమన్వయం చేస్తూ గుడుంబా రవాణా, నల్లబెల్లంను నియంత్రిస్తామని, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న సుంకం చెల్లించని అక్రమ మద్యం రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామన్నారు. పల్లెల్లో చాలా వరకు గుడుంబాను కట్టడి చేశామన్నారు. వివిధ కేసుల్లో చాలా మందిని అరెస్టు జైలుకు తరలించామన్నారు. గంజాయి నివారణకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 ఎన్‌డీపీఎల్, 18 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు. సోమవారం కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్‌లు, రైళ్లలో స్థానిక ఎక్సైజ్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశామన్నారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనుమానితులను అదుపులోకి తీసుకొని సోదాలు నిర్వహించామన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ లీగల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ క్యాలెండర్‌ను వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి నిర్మల గీతాంబ ఆవిష్కరించారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో నూతన క్యాలెండర్‌ను జడ్జి చేతుల మీదుగా విడుదల చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముదసిర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, ఇతర కార్యవర్గ సభ్యులు వెంకటరమణ, గోపికారాణి, సాంబశివ రాజు, హరిహర కుమార్, రాజేందర్, సునిల్ పాల్గొన్నారు.

మాంజా స్వాధీనం

వరంగల్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్‌లో రూ10,900 విలువ చేసే మాంజాను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిషేధిత మాంజాలను విక్రయిస్తున్న తుల మమతను పోలీసులకు అప్పగించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై పరుశురాములు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కాలు పట్టివేత

వరంగల్ డివిజన్‌లోని మిల్స్‌కాలనీ, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పీఎస్‌ల పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాలను సీజ్ చేశారు. ఇంతేజార్‌గంజ్ పరిధిలో అల్లాడి సాయిరాం, చకిలం నాగరాజు, భీమ్‌నాథ్ హరితేజ నుంచి రూ.16,200, మట్టెవాడ పీఎస్ పరిధిలో చందు అశోక్‌కుమార్ నుంచి రూ.16,300, రాజ్‌పురోహిత్ నరేశ్ నుంచి రూ.86,200, గొల్ల మల్లికార్జున్ నుంచి రూ.57,200, మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో వనిశెట్టి రవి నుంచి రూ.32,150 విలువ చేసే గుట్కాలను సీజ్ చేసినట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

సీఎం కప్ క్రీడా పోటీల్లో హనుమకొండ జట్టుకు 4వ స్థానం

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం కప్ -2024 క్రీడా పోటీల్లో హనుమకొండ జిల్లా క్రీడాకారులు ఓవరల్ చాంపియన్ షిప్ సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు డీవైఎస్‌వో అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 19 నుంచి జనవరి 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 36 క్రీడాంశాల్లో వివిధ జిల్లాల్లో సీఎం కప్ క్రీడలు జరుగగా హనుమకొండ జిల్లా క్రీడాకారులు పలు క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభతో రాణించి పలు పతకాలు సాధించి ఓవరల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలువడం అభినందనీయమన్నారు. కాగా, రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారులను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, సెపక్ తక్రా, అసోసియేషన్‌ల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి

మడికొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సీపీ ఆదేశాల మేరకు మడికొండలోని బాలుర గురుకులంలో మంగళవారం ఎస్సై రాజ్‌కుమార్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ నేరాల బారిన పడినట్టయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కేఎంసీ మెడికోలు

వరంగల్ మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థులు వెటర్నరీ డాక్టర్లుగా మారి గర్భంతో ఉన్న ఆవును కాపాడారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో గడ్డి మేయడానికి వచ్చిన నిండు గర్భంతో ఉన్న ఆవు అవస్థకు గురై నేలపై పడుకొని గట్టిగా అరుస్తుండటంతో ద్వితీయ సంవత్సరం మెడికల్ విద్యార్థులు గమనించారు. వెంటనే వారు వెటర్నరీ నిపుణుడిని వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆవు ప్రసవాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రసవం తర్వాత ఆవు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు గోపాలమిత్ర సభ్యులు తెలిపారు. ఈ అరుదైన ఘటనలతో మెడికల్ విద్యార్థులు వెటర్నరీ రంగంలో కూడా తమ సేవలను నిరూపించుకున్నారు. రెండో సంవత్సరం విద్యార్థులు ఉదయ్ కిరణ్, స్వరూప్, మోహన్‌దీప్, షణ్ముఖ్, నవనీత్, హేమంత్, మధుకర్ పాల్గొన్నారు.



ఆవుకు ప్రసవం చేస్తున్న మెడికోలు

విద్యార్థులకు సీపీ అభినందన

వరంగల్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న సంగెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు డ్రాయింగ్ టీచర్ ఈశ్వర్‌తో కలిసి 'సే నో టూ డ్రగ్స్' అనే నినాదంతో కాగితాలపై ఆకర్షణీయంగా ముద్రించి ప్రచారం చేస్తున్న విద్యార్థులు మంగళవారం సీపీని కలిసి వారి ఆలోచనలు వివరించారు. ఈ సందర్భంగా వారి ప్రయత్నాన్ని సీపీ అభినందించడంతో పాటు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు మత్తు పదార్థాలకు అవగాహన కల్పించడంతో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్‌స్టేషన్, డాక్టర్ వెంకటరెడ్డి హస్పిటల్ డీటీఆర్ 100 కేవీఏ, రహమత్‌నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, సోమిడి, కాజీపేట మెయిన్ రోడ్డు, డీమార్ట్ ఏరియా, రెల్వేస్టేషన్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్‌నగర్ డబ్బాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

సదస్సును విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేయూ ఎంఈఎఫ్ నేతలు

కేయూ క్యాంపస్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలోని ఠాకూర్ ఆడిటోరియంలో నిర్వహించే మాదిగ ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని కేయూ ఎంఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పోడేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఎంఈఎఫ్ పోస్టర్ కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. సామాజిక న్యాయం అన్ని కులాలకు దక్కడం కోసమే వర్గీకరణ అమల్లోకి రావాలని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైందని చెప్పారు. వేల గొంతుల లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేతలు డాక్టర్ పుల్లా రమేశ్, బొచ్చు తిరుపతి, కనుకయ్య, లింగయ్య, మంద రాజు, కుమ్మరి రాజయ్య సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్ఐ ఈసీ మెంబర్‌గా సారంగపాణి



వరంగల్ స్పోర్ట్స్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యుడిగా హనుమకొండకు చెందిన కొదురుపాక సారంగసాణి నియమితులయ్యారు. మంగళవారం చండీఘర్ రాష్ట్రంలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎలక్షన్, ఆఫీస్ బేరర్స్, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణికి అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కమిటీలో ఈసీ మెంబర్‌గా అవకాశం కల్పించడంతో రాష్ట్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా హనుమకొండ జిల్లాలో పలు రాష్ట్ర, జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించిన నేపథ్యంలో ఈ అరుదైన అవకాశం దక్కింది. ఈ మేరకు సారంగపాణి మాట్లాడుతూ.. తనకు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కమిటీలో ఈసీ మెంబరుగా అవకాశం కల్పించిన సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ లలిత్‌కే బానోటు, అథ్లెటిక్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వీరి పదవీకాలం నాలుగేళ్ల పాటు కొనసాగనుంది.

ఎస్సైని దుర్భాషలాడిన ఇద్దరిపై కేసు

మడికొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సైని దుర్భాషలాడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సై పి.రాజ్‌కుమార్ సోమవారం పోలీసులతో కలిసి మెట్టుగుట్ట ద్వారం వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ బైక్ ఆపి తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఉన్న మడికొండకు చెందిన దారంగుల రవి అనే వ్యక్తి ఎస్సై విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తన భార్య దారంగుల కల్పనను తీసుకువచ్చి ఎస్సైని దుర్భాషలాడారు. మంగళవారం ఎస్సై రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు దారం గుల రవి, కల్పనపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఫ్యాషన్



ఒకవైపు సంప్రదాయం మరోవైపు ఆధునికత కలగలసి ఈ తరం అమ్మాయిల మనసు దోచుకుంటోంది 'షరారా శారీ'. టాప్‌గా షార్ట్ కుర్తీ... బాటమ్‌గా షరారా ప్యాంట్... జతగా అందమైన దుపట్టాతో అన్ని వర్గాలవారిని ఆకర్షిస్తోంది. సంప్రదాయ చీరకట్టుని తలపిస్తూ స్టయిలిష్ లుక్‌లో హుందాగా అమ్మాయిలను కట్టిపడేస్తోందీ లక్నో డ్రెస్. పండుగలు, వేడుకలు, పార్టీలు ఇలా ఏ సందర్భమైనా యువతుల మొదటి ఎంపిక షరారా శారీనే!

షరారా శారీతో స్టయిల్‌గా



- సంప్రదాయ పండుగలకు ఎరుపు, పసుపు రంగుల డ్రెస్‌లు బాగుంటాయి. దుపట్టాను ఓణీలా వేసుకోవచ్చు. చీర కట్టుకోవడం, లంగా-ఓణీ వేసుకోవడం ఇబ్బంది అనుకునేవారికి ఈ షరారా శారీ సౌకర్యవంతంగా ఉంటుంది.
- టాప్‌గా షార్ట్ కుర్తా వేసుకుంటే ఒక స్టైల్, అదే ఎంబ్రాయిడరీ బ్లౌజ్ వేసుకుంటే మరో స్టైల్‌లో కనిపించవచ్చు. వివాహాది వేడుకలకు ఎంబ్రాయిడరీ బ్లౌజ్, సంప్రదాయ ఆభరణాలు ధరిస్తే అందంగా కనిపిస్తారు.
- సాయంకాలపు పార్టీలకు ఫ్లోరల్, టాప్ టు బాటమ్ ఒకే రంగు ఉన్న డ్రెస్‌లు బాగుంటాయి. వీటికి ఆభరణాల అవసరం ఉండదు. సాధారణంగా కనిపిస్తూనే దర్పాన్ని ఒలకబోస్తుందీ డ్రెస్
- షరారా... ప్యాంట్‌లా ఉంటే సింపుల్‌గా కనిపిస్తుంది. అదే కుచ్చులు జతచేస్తే స్టయిలిష్ లుక్ వస్తుంది. ఎన్ని ఎక్కువ కుచ్చులు పెడితే అంత గ్రాండ్‌గా కనిపిస్తుంది. షరారాకు బెల్ట్ అదనపు ఆకర్షణ

నిద్ర లేవగానే ఇలా...

రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. దీనిని అలవరచుకోవడానికి ఉదయం వేళలు అనుకూలంగా ఉంటాయి. నిద్రలేవగానే ఏ అలవాట్లు పాటించాలో తెలుసుకుందాం!

వేడి నీళ్లు తాగాలి:
ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగడం మంచిది. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె కూడా కలుపుకోవచ్చు. దీనివల్ల శరీరంలో నీటి శాతం తగ్గకుండా సమతౌల్యంలో ఉంటుంది. జీవక్రియలు సక్రమంగా జరుగుతాయి. జీర్ణ వ్యవస్థ మెరుగై శరీరమంతా పరిశుభ్రమవుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.




యోగా చేయాలి:
పొద్దున్నే కనీసం ఇరవై నిమిషాలు యోగా చేయడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. సూర్య నమస్కారాలు చేసినా భుజంగాసనాలు వేసినా శరీరంలోని కండరాలు చురుకుగా మారతాయి. శరీరాన్ని సాగదీసే ఆసనాలు వేస్తే రక్తప్రసరణ వ్యవస్థ మెరుగై అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉంటాయి. సులభమైన యోగాసనాలు రోజూ వేస్తూ ఉంటే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

నడవాలి:
పొద్దున్నే పచ్చని చెట్ల మధ్య లేదంటే ఏదైనా పార్కులో కనీసం అరగంట నడవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. రెట్టింపు శక్తితో పనులు చేసుకోవచ్చు. కోపం, ఒత్తిడి, ఆందోళన, గుండె జబ్బులు, మధుమేహం దరిచేరవు. శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అంది మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. క్రమం తప్పకుండా నడక అలవాటు చేసుకుంటే జీవక్రియలు సమన్వయంగా పనిచేసి ఊబకాయం రాకుండా చేస్తాయి.

అల్పాహారం తినాలి:
ఉదయం పూట ప్రోటీన్లతో కూడిన అల్పాహారం తీసుకోవడం మంచిది. ప్రోటీన్లు ఆకలిని నియంత్రించడమే కాకుండా శక్తిని అందిస్తాయి. గ్రీన్ టీ, గుడ్లు, ఓట్స్, పండ్లు, గింజలు, మొలకలు, సలాడ్స్ పన్నీరు, బఠానీలు, ఆవిరిమీద ఉడికించినవాటిని అల్పాహారంలో చేర్చుకోవడం వల్ల శరీరం చురుకుగా ఉంటుంది.

ముత్యాల ముగ్గు





వి.ఇ.లత
బెంగళూరు

11 చుక్కలు, సంధు చుక్కలు, 7వ చుక్కలో నిలపాలి

ఈ-మెయిల్: features@andhrajyothy.com

కళలపై నిహారికా నాయర్‌లో చిగురించిన ఆసక్తి... గిరిజన జీవితాల్లో వెలుగు తేవాలనే సంకల్పంగా మారింది. బెంగళూరుకు చెందిన ఈ పదిహేడేళ్ల అమ్మాయి స్థాపించిన 'ప్రాజెక్ట్ ట్రైబలి'... నాలుగేళ్లలో వెయ్యికి పైగా కుటుంబాలకు ఆసరా అందించింది. ఆమె ప్రయత్నం జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రశంసలందుకొని, ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.

ఆసక్తే సంకల్పంగా



నృత్యం, సంగీతం... ఇవి నిహారికా నాయర్‌కు ప్రాణం. ఈ అభిరుచే గిరిజన సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తిని ఆమెలో కలిగించింది. బెంగళూరులో పుట్టి పెరిగిన ఈ అమ్మాయి ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు... పలు గిరిజన ప్రాంతాలను సందర్శించి, వారి కళా రూపాల గురించి తెలుసుకోవాలనుకుంది. కానీ ఆ గూడేల్లో కఠోరమైన జీవన పరిస్థితులు ఆమెకు కనిపించాయి. "కనీస సదుపాయాలకు నోచుకోకుండా, తమకు అర్హత ఉన్నవాటిని సైతం అందుకోలేని ప్రజల అసక్తత, అవగాహనాలోపం నన్ను తీవ్రంగా కదిలించాయి. వారికోసం ఏదైనా చెయ్యాలనే ఆలోచనను నా కుటుంబానికి, స్నేహితులకు చెప్పినప్పుడు... అందరూ ఎంతగానో ప్రోత్సహించారు. అలా 2000 నవంబర్‌లో 'ప్రాజెక్ట్ ట్రైబలి' ప్రారంభించాను" అంటోంది నిహారిక. నాలుగేళ్లలో ఈ ప్రాజెక్ట్ వెయ్యికి పైగా కుటుంబాల్లో సానుకూల మార్పుకు దోహదపడింది.

> గిరిజనులకు వారి హక్కుల గురించి బోధించడం, వాటిని సాధించుకొనేలా సాయపడడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంచడం, విలక్షణమైన వారి కళలను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించడం... ఇవే ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్న 'ట్రైబలి'... గిరిజనులతో హస్తకళా ఉత్పత్తులను తయారు చేయించి, ప్రదర్శనలు ఏర్పాటు చేసి విక్రయిస్తోంది. నైపుణ్యాలను, జీవనశైలిని చాటి చెప్పే అవకాశం కల్పిస్తోంది.

ఎన్నెన్నో సవాళ్లు...

"దీనికోసం మొదట వారి ప్రాథమిక హక్కుల మీద దృష్టి పెట్టాను. చాలామందికి ఆధార్ కార్డులు లేవు. దీనివల్ల ప్రభుత్వం వారికి ఉద్దేశించిన పథకాలు అందడం లేదు. కొందరి పేర్లు నమోదైనా కార్డులు వారికి చేరలేదు. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగాను. కొన్ని నెలల్లోనే దాదాపు ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చేశాను. అదే సమయంలో... అత్యవసర సమస్యలు ఎదురైనప్పుడు వారికి డబ్బు అందుబాటులో ఉండడం కోసం బంధువులు, మిత్రుల నుంచి డబ్బు పోగుచేసి, ఒక నిధిని ఏర్పాటు చేశాను" అని గుర్తు చేసుకుంది నిహారిక. మొదట కర్ణాటకలోని ఒక గ్రామంలో మొదలుపెట్టి, ఈ నాలుగేళ్లలో కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని సుమారు పది గిరిజన ప్రాంతాలకు ఆమె సంస్థ సేవలను విస్తరించింది. వైద్య శిబిరాలను నిర్వహించడం, పోషకాహార లోపాన్ని నివారించడం, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, కట్టెల పొయ్యిలకు బదులు సోలార్ కుక్కర్ల వినియోగానికి సాయపడడం... ఇలా పలు కార్యక్రమాలను నిహారిక చేపడుతోంది. "ఈ క్రమంలో నాకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. ప్రభుత్వాలు పథకాలు ప్రకటించి, నిధులు కేటాయించినా... అవినీతివల్ల అవి గిరిజనులకు అందడం లేదు. అలాగే గూడేల్లోని పిల్లలకు అర్థమయ్యేలా బోధన పద్ధతులు లేవు. దీనివల్ల ఎంతో మంది చదువుకు దూరమవుతున్నారు. మైదాన ప్రాంతాల్లోని పిల్లలతో సమానంగా చదువులో అభివృద్ధి చెందడానికి బోధన, శిక్షణ చేపడుతున్నాం. ఆధునిక సాగు పద్ధతులకు గిరిజనులు దూరంగా ఉన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సహాయంతో వారికి ఆ పద్ధతులను నేర్పిస్తున్నాం. వాటి ప్రయోజనాలు వివరిస్తున్నాం" అంటారు నిహారిక.

అది మరచిపోలేను...

ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న పదిహేడేళ్ల నిహారిక సేవా నిబద్ధత అంతర్జాతీయంగానూ గుర్తింపు పొందుతోంది. 2023లో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్'లో తన ప్రాజెక్ట్ కార్యకలాపాలు, లక్ష్యాల గురించి ఆమె వివరించినప్పుడు... ప్రతినిధులందరూ ఆమెను ముక్తకంఠంతో ప్రశంసించారు. కిందటి ఏడాది డిసెంబర్ 24న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన '1ఎం1బి- (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) నేషనల్ యంగ్ ఛేంజ్‌మేకర్స్ షోకేస్'లో పాల్గొనే అవకాశం ఆమెకు దక్కింది.

"ఆ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకోవడం, మాట్లాడడం నా జీవితంలోనే మరచిపోలేని గొప్ప అనుభవం. సమష్టి కృషిలో గొప్ప శక్తి ఉందని నేను ఎప్పుడూ నమ్ముతాను. మనం చేపట్టే పనులు క్షేత్రస్థాయిలో ప్రభావాన్ని సృష్టించినప్పుడే మార్పు సాధ్యమవుతుంది. అలాంటి మార్పు కోసం నా ప్రయాణాన్ని కొనసాగిస్తాను" అంటోంది నిహారిక.

వీటిని అలాగే తింటే మేలు..!

కొన్ని రకాల కూరగాయలను ఉడకబెట్టుకొని కాకుండా పచ్చివిగా తింటేనే ఆరోగ్యకరం అంటున్నారు పోషకాహార నిపుణులు. అలా తినడంవల్ల వాటిల్లోని పోషక విలువలు పూర్తి స్థాయిలో శరీరానికి అందుతాయని చెబుతున్నారు. అలాంటి కూరగాయలే ఇవి...

బీట్‌రూట్: దీనిలో పీచుపదార్థం, ఫోలేట్లు, ఐరన్, సి విటమిన్, పొటాషియం, మాంగనీస్ అధికంగా ఉంటాయి. బీట్‌రూట్ ముక్కలను ఎక్కువ వేడిమీద ఉడికిస్తే ఈ పోషకాల్లో 25 శాతం వరకూ నష్టపోతాం. అందుకే బీట్‌రూట్ ముక్కలను సలాడ్స్‌లో కలుపుకుని తినడం, జ్యూస్ చేసుకుని తాగడం మంచిది. బీట్‌రూట్‌ని సన్నని చక్రాల్లా కోసి దానిమీద నిమ్మరసం, మిరియాలపొడి చల్లుకుని తింటే రక్తంలో హెమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. రక్తహీనత సమస్యలు రావు.



కేరెట్: దీనిలో బీటా కెరోటిన్, పీచు పదార్థం, కె విటమిన్, ఎ విటమిన్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పిండిపదార్థాలు ఉంటాయి. కేరెట్‌ను ఉడికించినపుడు వీటిలో చాలావరకూ ఆవిరైపోతాయి. కేరెట్ రుచిగా ఉంటుంది కాబట్టి దానిని అలాగే తినడం ఉత్తమం. లేదంటే కేరెట్ తురుముని సలాడ్స్‌లో, మొలకల్లో కలుపుకుని తినవచ్చు. జ్యూస్ చేసుకుని తాగవచ్చు.




కేరెట్‌లోని పోషకాలు కంటి చూపుని మెరుగుపరుస్తాయి. క్యాన్సర్‌ను నివారిస్తాయి.


నిమ్మకాయ: దీనిలో సి విటమిన్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ లాంటి పోషకాలు ఉంటాయి. నిమ్మరసాన్ని వేడి పదార్థాలకు కలిపితే ఇవన్నీ నశించిపోతాయి. అందుకే గోరువెచ్చగా ఉన్నపుడు మాత్రమే వంటకాలకు నిమ్మరసాన్ని కలపాలి.



పచ్చి కొబ్బరి: ఇది జీర్ణక్రియకు, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. దీనిలో సిలీనియం, మాంగనీస్, కాపర్, జింక్ లాంటి అరుదైన పోషకాలతోపాటు పీచుపదార్థాలు, ఐరన్, ప్రోటీన్లు, పిండిపదార్థాలు అధికంగా ఉంటాయి. పచ్చి కొబ్బరిని పచ్చడి రూపంలో తినడం వల్ల ఈ పోషకాలను పూర్తిగా పొందవచ్చు. వంకాయ, దొండకాయ, బీరకాయ లాంటి కూరలను వండిన తరవాత వాటికి పచ్చి కొబ్బరి తురుం కలిపి తినవచ్చు.



టమాటా: దీనిని వంటకాల్లో చాలా రకాలుగా ఉపయోగిస్తుంటాం. ప్యూరీ, గ్రేవీ, రసం ఇలా సందర్భానుసారం టమాటాలను వాడుతుంటాం. కూర, పచ్చడి, చారు అంటూ ఎన్నో చేస్తుంటాం కూడా. అప్పుడప్పుడు టమాటాలను పచ్చిగా కూడా తింటూ ఉంటే ఆరోగ్యానికి మంచిది. దీనిలో సి, కె, బి విటమిన్లతో పాటు పీచు పదార్థం, పిండిపదార్థాలు, ప్రోటీన్లు, పొటాషియం, లైకోపీన్, బీటా కెరోటిన్లు ఉంటాయి. ఇవి చర్మ సౌందర్యానికి, క్యాన్సర్ నివారణకు, గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి.



విభిన్నం



రోడ్డు ప్రమాదంలో వీధి కుక్క ఒకటి తీవ్రంగా గాయపడి... మరణించింది. ఆ దృశ్యం **రిమ్‌జిమ్ జోషీ షిండే**ను కలచివేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా... వీధుల్లో తిరిగే శునకాలకు రక్షణగా... ఏదైనా చేయాలని ఆ క్షణమే ఆమె నిర్ణయించుకున్నారు. వెంటనే కార్యక్షేత్రంలోకి దిగారు. క్యూఆర్ కోడ్ రిఫ్లెక్టివ్ కాలర్స్ తయారీ మొదలుపెట్టారు. కానీ ఇప్పుడు అదే ఆమెను వ్యాపారవేత్తను చేసింది. పేద మహిళలకు ఉపాధి మార్గమైంది.

ప్రేమతో మొదలై!

"ఒక చిన్న ప్రయత్నం అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చింది. ఇది నేను అస్సలు ఊహించలేదు. రాత్రిళ్లు రోడ్డుపై సంచరించే వీధి కుక్కలు చీకట్లో వాహనదారుల కంట పడకపోవడంవల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. నా ఆలోచనల్లా... ఈ ప్రమాదాల నుంచి వాటిని రక్షించాలని. అదే నేడు ఒక చక్కని ఆవిష్కరణకు కారణమైంది. నేను రూపొందించిన క్యూఆర్ కోడ్‌గల రిఫ్లెక్టివ్ కాలర్స్... వీధుల్లో తిరిగేవాటికే కాదు, పెంపుడు కుక్కలకూ రక్షణ కవచంలా నిలుస్తున్నాయి. రేడియం స్టికర్లలా లైటు పడగానే వాటి మెడలోని కాలర్ మెరుస్తుంది. దాంతో వాహనదారులు అప్రమత్తమవుతారు. దీనివల్ల మూగజీవాలకే కాదు... నాకు కూడా ఒక ఆదాయ వనరు అయింది. 'పాజిటివిటీ' అనే కంపెనీ ఏర్పాటుకు కారణమైంది. మరికొంతమంది పేద మహిళలకు ఉపాధి కల్పించే సాధనమైంది.

ఆ ఘటన కలచివేసింది...

నేను కంపెనీ ప్రారంభించడం వెనుక బలమైన కారణమే ఉంది. అది 2015. ఓ రాత్రి వేళ. వీధిలోకి వెళితే రోజూ కనిపించే శునకం. రోడ్డుపై సంచరిస్తూ ఏదో బండి కింద పడింది. ప్రాణాలు కోల్పోయింది. సదరు వ్యక్తి నిర్లక్ష్యంవల్ల కాదు... చిమ్మ చీకట్లో అది అతని కంటికి కనిపించకపోవడంవల్ల ప్రమాదం జరిగిందని అర్థమైంది. రోడ్డునపోయేవారు ఆ శునకాన్ని బతికించడానికి ప్రయత్నించారు. కానీ ఫలించలేదు. ఇంటి సమీపంలో జరిగిన ఆ దృశ్యం నన్ను కలచివేసింది. దీనికి ఒక పరిష్కారం కావాలి. మనలాగే జంతువులకు కూడా ఈ సమాజంలో జీవించే హక్కు ఉంది. ఆ హక్కును పరిరక్షించడానికి నావంతుగా రోడ్లపై సంచరించే జంతువులకు రక్షణ కల్పించాలని అనుకున్నాను. అందులో నుంచి పుట్టిందే కుక్కల మెడలో మెరిసే బెల్టుల ఆలోచన. అదే మా 'పాజిటివిటీ'కి అంకురార్పణ అయింది.

చిన్న ఆలోచనే... కానీ...

నా మదిలో మెదిలిన ఒక చిన్న ఆలోచన... నేడు పెను ప్రభావం చూపిస్తోంది. వీధి శునకాలే కాదు, యజమానుల నుంచి తప్పిపోయిన పెంపుడు కుక్కలకు కూడా మా ఉత్పత్తి ఒక వరంలా మారింది. రోడ్డు ప్రమాదాల నుంచి వాటికి రక్షణ కలుగుతోంది. అలాగే తప్పిపోయిన శునకాలు క్యూఆర్ కోడ్ కాలర్‌వల్ల తిరిగి ఇంటికి చేరుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే, వాటి యజమాని పేరు, అడ్రెస్ ఉంటాయి. వీధికుక్కలైతే అవి ఏ ప్రాంతానికి చెందినవి, వ్యాక్సినేషన్ అయిందా లేదా తదితర వివరాలు ఉంటాయి. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందంటూ జంతు ప్రేమికులు అభినందించారు. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాలవారు కూడా వచ్చి మా ఉత్పత్తులను కొనుగోలు చేయడం మొదలుపెట్టారు. ఏడాది తిరిగేలోపే అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. అందరికీ అందుబాటు ధరలో ఉండాలనే ఉద్దేశంతో యాభై, అరవై రూపాయలకే ఈ కాలర్స్ విక్రయిస్తున్నాం.

> ### అవంటే భయం... కానీ...
>
> మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ మాది. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. ముఖ్యంగా జంతు సంరక్షణకు సంబంధించి పలు ప్రాంతాల్లో పర్యటించాను. అయితే నాకు కుక్కలంటే చచ్చేంత భయం. అవంటే ప్రేమే కానీ... దగ్గరకు వెళ్లాలంటే వణుకు. అలాంటిది ఇప్పుడు వాటి మధ్యనే గడుపుతున్నాను. ప్రస్తుతం మా కంపెనీ టర్నోవర్ 70 లక్షల రూపాయలు దాటింది. గత ఏడాదితో పోలిస్తే 25 శాతం వృద్ధి సాధించాం. వచ్చినదాంట్లో కొంతమొత్తం వీధి కుక్కల కోసం ఖర్చు చేస్తున్నాను. వాటికి వైద్యం, వ్యాక్సినేషన్లతో పాటు రోజూ ఆహారం అందిస్తున్నాను.

పని మనిషి సహకారంతో...

2016లో మా సంస్థ ప్రారంభమైంది. అయితే మొదట కాలర్స్ తయారు చేద్దామని అనుకున్నప్పుడు వాటి గురించి నాకు అస్సలు ఎలాంటి అవగాహన లేదు. ఎలా చేయాలి? దానికి కావల్సిన సామగ్రి ఎక్కడ దొరుకుతుంది? ఎంత ఖర్చవుతుంది? ఇవేవీ తెలియదు. ఆ సమయంలో మా ఇంట్లో పని చేసే రీనా భరోసా ఇచ్చింది. మెటీరియల్ ఎక్కడ లభిస్తుందో తెలుసునని, తనకు కుట్టు పనిలో కూడా ప్రవేశం ఉందని చెప్పింది. ఎలా మొదలుపెట్టాలో తెలియని నాకు రీనా రూపంలో చక్కని మార్గం కనిపించింది. అవసరమైన సామగ్రి తెచ్చి, ఇద్దరం కలిసి పని ప్రారంభించాం. మావారు తుషార్ కూడా మాకు అండగా నిలిచారు.

పేద మహిళలకు ఆసరా...

క్రమంగా ఆర్డర్లు పెరుగుతున్నాయి. మేం ముగ్గురం కష్టపడితే సరిపోవడంలేదు. ఆర్డర్లు పెండింగ్‌లోకి వెళ్లిపోతున్నాయి. దాంతో మరికొంతమంది ఉద్యోగులను తీసుకొందామనుకున్నాను. మా సంస్థ తొలి అడుగు ఒక మహిళతోనే మొదలైంది. కాబట్టి... అదే దారిలో మరింత మంది పేద మహిళలకు ఉపాధి కల్పిస్తే చేసే పనికి ఒక సార్థకత ఉంటుందని అనిపించింది. ఆసక్తి గల గ్రామీణ మహిళలను గుర్తించి, వారికి శిక్షణనిచ్చాం. రోజువారీ పనులు చూసుకొంటూనే, ఇంటి వద్దే పని చేసే వెసులుబాటు కల్పించాం. ఇప్పుడు వారు నెలకు పదిహేను నుంచి పద్దెనిమిది వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. పండుగల వంటి ప్రత్యేక సందర్భాల్లో పని ఎక్కువ ఉంటుంది. ముఖ్యంగా దీపావళి టపాసుల మోత భరించలేక పెంపుడు కుక్కలు పారిపోతుంటాయి. అందుకే అలాంటి సమయాల్లో ఆర్డర్లు ఎక్కువ వస్తాయి. ఏదిఏమైనా మా 'పాజిటివిటీ' ద్వారా అణగారిన వర్గాల గృహిణులకు ఒక ఉపాధి మార్గం దొరికింది. ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము జీవించే అవకాశం లభించింది. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తుంది."

బతుకమ్మ కుంట కేసులో హైడ్రా విజయం

- కుంటగానే గుర్తిస్తూ హైకోర్టు తీర్పు
- ఎడ్ల సుధాకర్‌రెడ్డి పిటిషన్ కొట్టివేత
- త్వరలో చెరువు పునరుద్ధరణకు చర్యలు

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట పునరుద్ధరణపై హైడ్రాకు అనుకూలంగా హైకోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. బతుకమ్మ కుంటను కుంటగానే గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 'అగ్రిమెంట్ ఆఫ్ సేల్' ఆధారంగా మూడు దశాబ్దాలుగా సదరు స్థలం తమదేనంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. కుంటను పునరుద్ధరించాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు హైడ్రాకు సంబంధిత పత్రాలు అందజేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ నవంబరు 13న సందర్శించి, అదే రోజు కుంట పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా మధ్యంతర స్టే జారీ అయింది. ఆ తర్వాత హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు భూ రికార్డులు పరిశీలించి కోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. సుధాకర్ రెడ్డికి సదరు భూమిపై ఎలాంటి హక్కులు లేవని, అది బతుకమ్మ కుంట స్థలమేనని తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై రంగనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున సంబంధిత పత్రాలు కోర్టుకు సమర్పించి విజయానికి సహకరించిన ఉద్యోగులకు హైడ్రా ప్రధాన కార్యాలయంలో సన్మానం చేశారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలి ఉన్న భూమి 5.15 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెరువు తవ్వకానికి ఆదేశాలు జారీ చేశారు. ఒకప్పటి ఎర్రకుంటే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని, దాన్ని పునరుద్ధరిస్తే చుట్టుపక్కల ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని రంగనాథ్ తెలిపారు. పర్యావరణం మెరుగుపడడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

జగన్ పాస్‌పోర్టుకు హైకోర్టు ఎన్‌వోసీ

- కుమార్తె స్నాతకోత్సవానికి యూకే వెళ్లేందుకు అనుమతి

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి హైకోర్టులో ఉపశమనం లభించింది. ఐదేళ్ల కాలపరిమితితో ఆయనకు పాస్‌పోర్టు ఇవ్వాలని కోర్టు పాస్‌పోర్టు అధికారులను ఆదేశించింది. ఆయన తాజాగా పాస్‌పోర్టు పొందేందుకు అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌వోసీ) జారీ చేసింది. యూకేలో ఈ నెల 16న జరగనున్న కుమార్తె స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది. పాస్‌పోర్టు జారీ విషయంలో స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని, తమ ముందు హాజరై రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాల్సిందేనంటూ.. ఎన్‌వోసీ కోసం జగన్ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ విజయవాడ ప్రత్యేక కోర్టు (ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే న్యాయస్థానం) ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం తీర్పు వెలువరించారు.

జెత్వానీ కేసులో..కాంతి రాణా, విశాల్ గున్నీకి ముందస్తు బెయిల్

అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ఐపీఎస్ అధికారులు కాంతి రాణా తాతా, విశాల్ గున్నీకి హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. అప్పటి విజయవాడ ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లుకు ఇదే ఊరట కల్పించింది. దర్యాప్తు అధికారి సంతృప్తి మేరకు పిటిషనర్లు ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రయాణ వివరాలను ముందుగా దర్యాప్తు అధికారికి తెలియజేయాలని, అవసరమైనప్పుడు దర్యాప్తుకు అందుబాటులో ఉండాలని.. దర్యాప్తునకు సహకరించాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మంగళవారం తీర్పు ఇచ్చారు.


శ్రీతేజను పరామర్శించడానికి కిమ్స్ ఆస్పత్రిలోకి వెళుతున్న అల్లు అర్జున్


అండగా ఉంటా!

(మొదటిపేజీ తరువాయి)

శ్రీతేజను ఆయన పరామర్శించారు. గతనెల 4న పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని హుటాహుటిన సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్నాడు. అయితే పరామర్శ కోసం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లేముందు తమకు సమాచారం ఇవ్వాలని రాంగోపాల్‌పేట్ పోలీసులు అల్లు అర్జున్‌కు గతంలోనే నోటీసులిచ్చారు. మంగళవారం ఉదయం అల్లుఅర్జున్ ఆస్పత్రికి వస్తున్నారని సమాచారం రావడంతో ఆస్పత్రి వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రి సిబ్బందిని కూడా ఆ పరిసరాల్లో లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అల్లు అర్జున్ ఆస్పత్రికి రాక మునుపే తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజ్ అక్కడికి చేరుకున్నారు. అల్లు అర్జున్ ఆస్పత్రికి వచ్చాక దిల్‌రాజ్‌తో కలిసి శ్రీతేజ వద్దకు వెళ్లారు. శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని కిమ్స్ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ సంబిత్ సాహూను అడిగి తెలుసుకున్నారు. బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న శ్రీతేజ తండ్రి బాస్కర్ వద్దకు వెళ్లి పరామర్శించారు. 'మీకు అండగా ఉంటాను. ఎలాంటి ఆందోళనా వద్దు. నేను అన్ని చూసుకుంటా' అని భరోసా ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు అల్లు అర్జున్ ఆస్పత్రిలోనే ఉన్నారు. కాగా శ్రీతేజ ఆరోగ్యం నిలకడగా ఉందని కిమ్స్ వైద్యులు వివరించారు. వెంటిలేటర్, ఆక్సిజన్ అవసరం లేకుండా శ్రీతేజకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఎలాంటి యాంటిబయాటిక్స్ అందించడం లేదని, బాలుడు క్రమంగా కోలుకుంటున్నాడని చెప్పారు. అప్పుడప్పుడు జ్వరం వచ్చి.. తగ్గుతోందని వెల్లడించారు. కొన్నిసార్లు కళ్లు తెరిచి చూస్తున్నాడని, అయితే ఎవరినీ గుర్తించడం లేదని, ఎవరైనా పిలిచినా పలకడం లేదన్నారు.

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు 7,668 కోట్లు

- కేంద్రానికి అలైన్‌మెంట్ నివేదికలో ప్రతిపాదన
- కారిడార్ నిర్మాణంతో తగ్గనున్న దూరం, సమయం
- మన్ననూర్ నుంచి పాతాళగంగ దాకా 55 కి.మీ మేర కారిడార్



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఏపీలోని శ్రీశైల క్షేత్రానికి వెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న ఇబ్బందులను తొలగిస్తూ రిజర్వ్‌ఫారెస్ట్ ప్రాంతంలో నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ కోసం అలైన్‌మెంట్ సిద్ధమైంది. దీన్ని తెలంగాణ విభాగానికి జాతీయ రహదారులు, రవాణా మంత్రిత్వ శాఖ అందించగా.. దీనిపై అన్ని అంశాలను పరిశీలించిన అధికారులు అలైన్‌మెంట్‌ను తాజాగా కేంద్రానికి నివేదించారు. మొత్తం 36 పేజీలతో కూడిన ఆ నివేదికలో రహదారి స్వరూపం, టోల్‌ప్లాజ్‌లు, బైపాస్‌లు, గ్రామాలు ఉన్న చోట నిర్మించతలపెట్టిన ర్యాంపులు, ఘాట్‌రోడ్డులో చేపట్టే రోడ్డు నిర్మాణాలతో కలిపి రూ.7,668 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌ను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో చేపడితే లాభదాయకంగా ఉంటుందని నివేదికలో పేర్కొన్నారు. కేంద్రం ఆమోదం తెలిపితే, డీపీఆర్‌ను ఖరారు చేసి.. వచ్చేఆర్థిక సంవత్సరం (2025-26)లో పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంది. ఈ రహదారి పూర్తయి, అందుబాటులోకొస్తే శ్రీశైల క్షేత్రానికి ప్రయాణదూరం, సమయం తగ్గుతాయి. కాగా తెలంగాణలోని పలు ప్రాంతాలతో పాటు, హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లాలంటే హైదరాబాద్-శ్రీశైలం-నంద్యాల 765 జాతీయ రహదారే ఆధారం. ప్రస్తుతం ఈ రోడ్డు హైదరాబాద్‌లోని తుక్కుగూడ జంక్షన్ నుంచి మనగల్లు, డిండి, మన్ననూర్ మీదుగా వెళ్తుంది. ఈ మార్గంలోనే పాతాళగంగ దగ్గర తెలంగాణ సరిహద్దు ముగుస్తుంది. అక్కడే శ్రీశైలం మల్లన్న క్షేత్రం ఉంది. మల్లన్న దర్శనానికి తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల ప్రజలు కూడా వెళ్తుంటారు. వారంతా ఇప్పుడున్న మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుత రోడ్డు రిజర్వ్ ఫారెస్ట్ నుంచి వెళ్తుండటంతో ఈ మార్గంలో మన్ననూర్ చెక్‌పోస్టు నుంచి రాత్రి 9- ఉదయం 6 మధ్య ప్రయాణాలకు అవకాశం ఇవ్వడం లేదు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కారిడార్ ఇలా..

ఎలివేటెడ్ కారిడార్.. మన్ననూర్ చెక్‌పోస్టుకు కొంచెముందు.. బ్రాహ్మణపల్లి నుంచి ప్రారంభమై.. ఈగలపెంట తర్వాత ముగుస్తుంది. ఈ మధ్యలో మన్ననూర్, వట్టర్‌పల్లి దగ్గర రెండు బైపాస్‌లను, ఆ తర్వాత దోమలపెంట, ఈగలపెంట గ్రామాలు ఉండటంతో అక్కడ కారిడార్ ఎక్కిదిగేందుకు వీలుగా రెండువైపులా ర్యాంపులను నిర్మిస్తారు. మధ్యలో ఒక చోట టోల్‌ప్లాజా, రెస్ట్ ఏరియాలను ఏర్పాటుచేయనున్నారు. మన్ననూర్ దాటాక వరుసగా వచ్చే 5-6 మలుపులను 3-4కు కుదించనున్నారు. ఘాట్ రోడ్డు దగ్గర ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టనుండగా.., ఏపీ సరిహద్దు వచ్చే దగ్గర కృష్ణానదికి కొంచెం పక్క నుంచి ఈ ఎలివేటెడ్ కారిడార్ వెళ్లనుంది. మొత్తంగా కారిడార్, ర్యాంపులు, బైపాస్‌లు కలిపి మొత్తం 55 కి.మీ మేర ఉంటుంది. ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 45.42 కి.మీ మేర ఉండగా.. మరో 9.49కి.మీ మేర రోడ్డు ప్రస్తుతం ఉన్న రహదారి మీదుగా ఉండనుంది. రెండు బైపాస్‌లు 6.05కి.మీ దూరంతో ఉంటాయి. ఈ రోడ్డు ఒక కి.మీ నిర్మాణానికి రూ.115కోట్లు వెచ్చించనున్నారు. ప్రాజెక్టు మొత్తానికి రూ.7,668 కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఇందులో ఎలివేటెడ్ కారిడార్, ఎక్కిదిగే ర్యాంపులు కలిపి 47.82 కి.మీ ఉండగా.. వీటికి రూ.5,500 కోట్లు అవసరపడతాయి. ఘాట్ రోడ్డులో నిర్మాణంతో పాటు, రహదారుల వెడల్పు 3.50కి.మీ ఉండగా.. దీనికి రూ.175కోట్లు, మరోచోట ఉన్న ఘాట్ రోడ్డు సెక్షన్ కోసం రూ.90కోట్లు, ప్రస్తుతం ఉన్న రహదారికి సమాంతరంగా నిర్మించే మరో రోడ్డుకు రూ.195 కోట్లు కావాల్సి ఉందని కేంద్రానికి ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు. రహదారి భద్రతకు రూ.15.1కోట్లు, నిర్వహణ ఖర్చులకు రూ.302.5కోట్లు, యుటిలిటీ చార్జీలు రూ.60 కోట్లు, భూ సేకరణ నేపథ్యంలో అటవీ చార్జీల కింద రూ.181.5కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. కాగా ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రస్తుతం ఉన్న రోడ్డు నుంచి 20-25 అడుగుల ఎత్తులో నిర్మించనున్నట్టు తెలిసింది. కారిడార్, మధ్యమధ్యలో నిర్మించే రోడ్లన్నింటికీ కలిపి మొత్తం 147.31 హెక్టార్ల భూమి కావాల్సి ఉంది. ఇందులో 128.62 హెక్టార్ల మేర అటవీ భూములుండగా, 18.68హెక్టార్ల మేర అటవీయేతర భూములున్నాయి. వీటిలో ఎలివేటెడ్ కారిడార్ కోసమే దాదాపు 91.179 హెక్టార్ల భూమి అవసరమవుతోంది. ఎక్కిదిగే ర్యాంపులకు 2.20 హెక్టార్లు, బైపాస్ రోడ్ల నిర్మాణాలకు 14.87 హెక్టార్లు, ప్రస్తుతమున్న రోడ్లపై నిర్మాణాలకు 11.77 హెక్టార్లు, సవరించిన అలైన్‌మెంట్ ప్రకారం ఘాట్ రోడ్డులో నిర్మాణానికి 9.810హెక్టార్లు, మరికొన్ని చోట్ల ఉన్న ఘాట్ రోడ్ల వెడల్పునకు 12.987హెక్టార్ల భూమి అవసరంపడుతుందని నివేదికలో పొందుపర్చారు.


శ్రీశైలం ప్రాజెక్టు దిగువన ఉన్న రోడ్డు వంతెన సైడ్‌వాల్‌కు వేసిన ముళ్లకంప

ఏపీ సరిహద్దులో శిథిలావస్థకు చేరిన శ్రీశైలం రోడ్డు వంతెన

- వాహనాల రాకపోకలతో వంతెనలో కదలికలు
- కూలిపోతున్న వంతెన సైడ్‌వాల్
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఏ అధికారులు

దోమలపెంట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో శ్రీశైలం ప్రాజెక్టు దిగువన ఉన్న శ్రీశైలం రోడ్డు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన నిర్మాణానికి అప్పటి దేశ ప్రధానమంత్రి నెహ్రూ 1963 జూలై 24న భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఉమ్మడి ఏపీలో అప్పటి సీఎం పీవీ నర్సింహారావు 1972 మే 1న వంతెనను ప్రారంభించారు. అదే సమయంలో శ్రీశైలం డ్యాం నిర్మాణం కోసం వాహనాల రాకపోకలకు ఎంతగానో ఉపయోగపడింది. శ్రీశైలం వంతెనపై 10 టన్నులకు మించి బరువు కలిగిన వాహనాలకు అనుమతి లేదని రవాణా శాఖ అధికారులు నిబంధనలు విధించినా వాహనదారులు లెక్క చేయకపోవడంతో వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నది. వందేళ్ల దాకా ఉపయోగించుకోవాలని నిర్మించిన వంతెన 50 ఏళ్లకే శిథిలావస్థకు చేరిందని దోమలపెంట, ఈగలపెంట, సుండిపెంట గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న సైడ్‌వాల్ పడిపోయింది. శిథిలావస్థకు చేరిన శ్రీశైలం వంతెనకు మరమ్మతులు చేయడంతో పాటు మరో నూతన వంతెన నిర్మించాలని స్థానికులతో పాటు శ్రీశైలం వచ్చే భక్తులు కోరుతున్నారు. జాతీయ రహదారి పరిధి ఎడమ పాతాలగంగ శ్రీశైలం వంతెనలో కొద్ది దూరం మాత్రమే ఉన్నందున వంతెన నిర్వాహణ ఆంధ్ర ప్రాంతం రహదారి అధికారులు చూసుకోవాలని ఎన్‌హెచ్‌ఏ కల్వకుర్తి డివిజన్ డీఈ రమేశ్ చెప్పారు.


చిత్రజ్యోతి
SINCE 1965

క్లైమాక్స్‌లో కన్నీళ్లొచ్చాయి
- రేణూ దేశాయ్



అరవింద్ కృష్ణ, బిగ్ బాస్ ఫేమ్ దివి, మేఘన శ్రీనివాస్, వినయ్ కీలక పాత్రల్లో నటించిన సినిమా '1000 వర్డ్స్'. రమణ విల్లర్ట్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. హైదరాబాద్‌లో ప్రదర్శించిన మూవీ స్పెషల్ షోకు రేణూ దేశాయ్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, మధుర శ్రీధర్, జ్యోతి పూర్వజ్, సుకు పూర్వజ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రేణూ దేశాయ్ మాట్లాడుతూ 'మూవీ అద్భుతంగా ఉంది. క్లైమాక్స్ చూశాక నాకు కన్నీళ్లొచ్చాయి. ఇంత మంచి సినిమాను తీసిన టీమ్‌కు ఆల్ ద బెస్ట్' అని అన్నారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రం అందరినీ కంటతడి పెట్టించింది. ప్రతి ఒక్కరి హృదయాలను కుదిపేస్తుంది. ఈ చిత్రానికి కచ్చితంగా అవార్డులు వస్తాయి' అని అన్నారు. 'ఈ మూవీ నాకెంతో ప్రత్యేకం. సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్' అని హీరో అరవింద్ కృష్ణ అన్నారు. చిత్ర దర్శకనిర్మాత రమణ విల్లర్ట్ మాట్లాడుతూ 'ఓ తల్లి బిడ్డను కనేటప్పుడు పడే బాధను చూపించాలనే తపనతో ఈ సినిమా తీశాము. అమ్మ పాత్రలో మేఘన అద్భుతంగా నటించారు' అని అన్నారు.

నాగబంధం ఆధారంగా...



విరాట్ కర్ణ, నభా నటేశ్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్‌ఇండియా చిత్రం 'నాగబంధం'. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ప్రీ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్ ఈ నెల 13న 'రుద్ర' లుక్‌ను పరిచయం చేయనున్నట్లు తెలిపారు. దేశంలోని పురాతన ఆలయాల్ని రక్షించే నాగబంధం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: సంతోశ్ కామిరెడ్డి, డీఓపీ: సౌందర్ రాజన్, సంగీతం: అభే.

ఇండస్ట్రీలో నాకో స్థానం కల్పించారు
- హీరో ధర్మ



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమల శెట్టి దర్శకత్వంలో బసవ రాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవ రాజు లహరీధర్ నిర్మించారు. ఇటీవలే రిలీజైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా హీరో ధర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాను ఆదరించడం ద్వారా చిత్ర పరిశ్రమలో యువ హీరోగా నాకో స్థానం కల్పించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. కొత్త వాళ్లకు ఇండస్ట్రీలో ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని మరోసారి రుజువైంది' అని అన్నారు.

ఆస్కార్ 2025 బరిలో భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక ఆస్కార్ 2025 బరిలో నిలిచే సినిమాల జాబితా వచ్చింది. 97వ అకాడమీ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్‌ను మంగళవారం ది అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్స్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసింది. ఉత్తమ చిత్రం విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 323 సినిమాలు పోటీ పడగా, 207 సినిమాలు నామినేట్ అయ్యాయి. భారతదేశం నుంచి ఆరు భారతీయ చిత్రాలు నామినేషన్స్ పొందాయి. తమిళ చిత్రం 'కంగువ', మలయాళ చిత్రం ఆడుజీవితం (ది గోట్ లైఫ్), 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' హిందీ చిత్రం 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్', 'గర్ల్స్ విల్ బీ గర్ల్స్', బెంగాలీ చిత్రం 'పుతుల్' నామినేట్ అయ్యాయి. భారతీయ నేపథ్యం ఉన్న 'సంతోష్' చిత్రం యూకే నుంచి ఉత్తమ అంతర్జాతీయ చిత్రం విభాగంలో నామినేషన్ దక్కించుకొంది. ఈ చిత్రాలకు ఈ నెల 8 నుంచి 12వరకూ ఓటింగ్ జరగనుంది. జనవరి 17న తుది జాబితాను అకాడమీ ప్రకటిస్తుంది. మార్చి 2న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది.

కంగువ : 'కంగువ' చిత్రం ఆస్కార్ బరిలో నిలవడం ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. పాన్ ఇండయా స్థాయిలో విడుదలైన ఈ చిత్రం ప్రతిచోటా ప్రేక్షకులను తిరస్కారాన్ని ఎదుర్కొంది. గతేడాది నిర్మాతలకు అత్యధిక నష్టాలను మిగిల్చిన చిత్రంగా నిలిచింది. వెయ్యేళ్ల క్రితం ఆదిమ తెగల మధ్య జరిగిన యుద్ధాల నేపథ్యంలో 'కంగువ' చిత్రం తెరకెక్కింది. శివ దర్శకత్వం వహించారు. దిశాపటానీ, బాబీడియోల్ కీలకపాత్రలు పోషించారు. 'కంగువ' ఆస్కార్ నామినేషన్ దక్కించుకోవడానికి కారణం కథాంశం, విజువల్స్, సినిమాటోగ్రఫీ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆడుజీవితం : పృథ్వీరాజ్ సుకుమారన్ కథానాయకుడిగా నటించిన సర్వైవల్ థ్రిల్లర్ 'ఆడుజీవితం'. పలు భారతీయ భాషల్లో విడుదలైన ఈ చిత్రం అన్ని చోట్లా చక్కటి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. నజీబ్ అహ్మద్ అనే మలయాళీ స్నేహితుడితో కలసి ఉపాధి కోసం సౌదీకి వెళ్తాడు. ఏజెంట్ చేసిన మోసం కారణంగా అక్కడ ఓ కర్కోటకుడైన గొర్రెల యజమాని చేతిలో బందీ అవుతాడు. ఎడారి మధ్యలో సరైన తిండీ, తిప్పలు లేక ఎన్నో అవస్థలు పడతాడు. దారి తెన్నూ తెలియని ఎడారి నుంచి బయట పడేందుకు అతను చేసిన ప్రయత్నాలతో సినిమా ఉత్కంఠ భరితంగా ఉంటుంది.

స్వాతంత్ర్య వీర్ సావర్కర్ : స్వతంత్ర సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్'. రణ్‌దీప్ హుడా దర్శకత్వం వహిస్తూ టైటిల్ రోల్ పోషించారు. బ్రిటిష్ వారిపై పోరాడేందుకు సావర్కర్ ఎంచుకున్న పంథా, అండమాన్ జైల్లో సుదీర్ఘ కారాగార వాసం చేస్తూ ఆయన అనుభవించిన బాధలు, జైలు నుంచి విడుదలయ్యాక 'హిందుత్వ' భావజాలాన్ని సృష్టించాల్సిన అవసరం ఎందుకొచ్చింది అనే అంశాల చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కించారు.

ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్ : పాయల్ కపాడియా రచించి దర్శకత్వం వహించిన చిత్రం 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్'. ఇద్దరు కేరళ అమ్మాయిలు ఉపాధి కోసం ముంబై నగరానికి వెళ్లి అక్కడ నర్సులుగా పనిచేస్తుంటారు. అక్కడి నగర జీవితంలోని ఇబ్బందులు, నీడ కోసం పేదవారు పడే పాట్లు, మనుషుల మధ్య అనుబంధాల నేపథ్యంలో కథ సాగుతుంది.

సంతోష్ : హిందీ చిత్రం 'సంతోష్'లో షహనా గోస్వామి ప్రధాన పాత్ర పోషించారు. ఈ రూరల్ క్రైమ్ డ్రామాకు సంధ్యా సూరి దర్శకత్వం వహించారు. భర్త మరణంతో అతని కానిస్టేబుల్ ఉద్యోగాన్ని పొందిన మహిళ పాత్రలో షహనా గోస్వామి నటించారు. ఓ బాలిక మర్డర్ కేసును ఛేదించే క్రమంలో గ్రామీణ నేపథ్యంలో ఉత్కంఠ భరితంగా తెరకెక్కింది. ఇప్పటికే ఈ చిత్రం కేన్స్ ఫెస్టివల్‌లో అవార్డు పొందింది.

తొలి ప్రయత్నంలోనే ఆస్కార్ బరిలో

ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్న తొలి బెంగాలీ చిత్రంగా 'పుతుల్' చరిత్రలో స్థానం దక్కించుకుంది. దర్శక నిర్మాతగా ఇందిరా ధర్‌కు ఇది తొలి చిత్రం కావడం విశేషం. అలీ ఫజల్, హీరోయిన్ రిచా చద్దా సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'గర్ల్స్ విల్ బీ గర్ల్స్'. మీరా అనే విద్యార్థిని జీవితంలో జరిగిన ఆసక్తికర సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కింది.



కుటుంబ ప్రేక్షకులు మెచ్చే చిత్రం

నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. ఈనెల 12న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఈనెల 9న అనంతపురంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ప్లాన్ చేశాం. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు బాగుంటాయి. ఈ చిత్రం బాలకృష్ణ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని అన్నారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ "డాకు మహారాజ్' చిత్రం రోబోయే చిత్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఇందులో ఐదు యాక్షన్ సీక్వెన్సులు ఉంటాయి. మంచి వినోదం, హత్తుకునే భావోద్వేగాలతో కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ 'జనవరి 12 నా పుట్టిన రోజు. ఈ చిత్ర విజయాన్ని నా జన్మదిన కానుకగా అందిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'నా సినీ ప్రయాణంలో ఈ చిత్రం ప్రత్యేకంగా నిలుస్తుంది' అని అన్నారు.

వేసవి బరిలో...



కోలీవుడ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్ ఈ పోస్టర్‌లో అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అదరగొట్టారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్ సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

అజిత్‌కు తప్పిన ప్రమాదం



అజిత్‌కుమార్‌కు పెను ప్రమాదం తప్పింది. రేసింగ్ అంటే అమితాసక్తి చూపే ఆయన.. దుబాయ్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న '24హెచ్' రేసింగ్ ఈవెంట్‌లో పాల్గొననున్నారు. ఇందుకోసం అజిత్ రేసింగ్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో ఆయన కారు అదుపు తప్పి పక్కనే ఉన్న ట్రాక్ గోడను ఢీకొంది. ఈ సంఘటన జరిగిన వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది ఆయనను వేరే కారులోకి తరలించారు. అజిత్ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. కాగా, అజిత్ నటించిన 'విడాముయర్చి' చిత్రం సంక్రాంతికి విడుదలకావాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదాపడింది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

అద్భుతమైన ప్రపంచంలోకి...



అడవి శేష్ కథానాయకుడిగా వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జీ 2'. 2018లో విడుదలై ఘనవిజయం సాధించిన స్పై థ్రిల్లర్ 'గూఢచారి' సినిమాకు ఇది కొనసాగింపు. టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా యూరప్ షూటింగ్ షెడ్యూల్‌లో కథానాయిక, 'బేబీ జాన్' ఫేమ్ వామికా గబ్బీ, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా వామికా మాట్లాడుతూ "ఈ అద్భుతమైన స్పై థ్రిల్లర్ ప్రపంచంలోకి అడుగుపెట్టినందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఎందరో ప్రతిభావంతులతో నిండిన ఈ టీమ్‌తో పనిచేయడం స్ఫూర్తినిస్తోంది" అని తెలిపారు. ఈ చిత్రంలో మురళీ శర్మ, సుప్రియ యార్లగడ్డ, మధు షాలినీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

బిజినెస్

వరంగల్ ● బుధవారం 8 జనవరి 2025

మార్కెట్లోకి వన్‌ప్లస్ 13, 13 ఆర్ స్మార్ట్‌ఫోన్లు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ దిగ్గజం వన్‌ప్లస్.. భారత మార్కెట్లోకి సరికొత్త స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. వన్‌ప్లస్ 13, వన్‌ప్లస్ 13ఆర్ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్లను తీసుకువచ్చింది. వీటితో పాటు వన్‌ప్లస్ బడ్స్ ప్రొ3 ఇయర్‌బడ్స్‌ను కూడా విడుదల చేసింది. వన్‌ప్లస్ 13 స్మార్ట్‌ఫోన్ మూడు వేరియంట్లలో 12+256 జీబీ, 16+512 జీబీ, 24+1 టెరాబైట్‌తో అందుబాటులో ఉండనుంది. వీటి ధరలు వరుసగా రూ.69,999, రూ.76,999, రూ.89,999గా ఉన్నాయి. ఈ నెల 10 నుంచి ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభం కానున్నాయి. అలాగే వన్‌ప్లస్ 13ఆర్ రెండు వేరియంట్లలో 12+256 జీబీ, 16+512 జీబీతో అందుబాటులో ఉంటుంది. ఈ ఫోన్ ధరలు వరుసగా రూ.42,999, రూ.49,999గా ఉన్నాయి. ఈ నెల 13 నుంచి ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయి. స్నాప్‌డ్రాగన్ 8 ఇలీట్ ప్రాసెసర్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, 120ఎఫ్‌పీఎస్ హెచ్‌డీఆర్ గేమింగ్, 120హెట్జ్ ప్రొఎక్స్‌డీఆర్ డిస్‌ప్లే, 50 ఎంపీ సోనీ ఎల్‌వైటీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ సామ్‌సంగ్ ఐసోసెల్ టెలిఫోటో కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా, ఆక్సిజన్ ఓఎస్ 15.. వన్‌ప్లస్ 13 స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకతలు. కాగా వన్‌ప్లస్ బడ్స్ ప్రొ ధర రూ.11,999గా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,710 ▲	72,150 ▲	1,00,000 ▲
విజయవాడ	79,500 ▼	75,500 ▲	93,000 ▲
విశాఖపట్నం	77,660 ▲	71,190 ▲	91,250 ▲
రాజమండ్రి	78,710 ▼	71,150 ▼	90,400 ▲
ప్రొద్దుటూరు	78,850 ▲	73,020 ▲	91,800 ▲
ముంబై	77,126 ▼	70,647 ▼	89,474 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

8వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	505
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	523	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	92
కర్నూలు	114	నెల్లూరు	97
విశాఖపట్నం	107	అనంతపురం	97
గోదావరి	116		

4 ఏళ్ల కనిష్ఠానికి వృద్ధి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 శాతానికి పరిమితం

కేంద్ర ప్రభుత్వ ముందస్తు అంచనాలు విడుదల



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) భారత జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి పరిమితం కావచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. మాన్యుఫాక్చరింగ్, సేవల రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణం కానుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) మంగళవారం విడుదల చేసిన ముందస్తు అంచనాల నివేదికలో పేర్కొంది. కొవిడ్ సంక్షోభం కారణంగా 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి మైనస్ 5.8 శాతానికి క్షీణించింది. ఆ తర్వాత ఇదే కనిష్ఠ వృద్ధి కానుంది. ఎందుకంటే, 2021-22లో 9.7 శాతం, 2022-23లో 7 శాతం, 2023-24లో 8.2 శాతం వృద్ధి నమోదైంది.

ఆర్‌బీఐ అంచనాల కంటే తక్కువ

ఈ ఆర్థిక సంవత్సరానికి ఎన్‌ఎస్‌ఓ వృద్ధి అంచనా.. గత నెలలో ఆర్‌బీఐ అంచనా వేసిన 6.6 శాతం కంటే తక్కువ. అంతేకాదు, కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసిన 6.5-7 శాతం వృద్ధి కంటే కూడా తక్కువే. ఎన్‌ఎస్‌ఓ ముందస్తు అంచనాలను ప్రభుత్వం బడ్జెట్ తయారీ కోసం ఉపయోగించుకోనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను వచ్చే నెల 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

2024-25లో రంగాలవారీగా స్థూల విలువ జోడింపు (%)

రంగం	2024-25 అంచనా	2023-24
వ్యవసాయం సంబంధిత రంగాలు	3.8	1.4
మైనింగ్ అండ్ క్వారీయింగ్	2.9	7.1
మాన్యుఫాక్చరింగ్	5.3	9.9
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవలు	6.8	7.5
నిర్మాణం	8.6	9.9
వాణిజ్యం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్	5.8	6.4
ఆర్థిక సేవలు, రియల్టీ, వృత్తి నైపుణ్య సేవలు	7.3	8.4
ప్రజా పాలన, రక్షణ, ఇతర సేవలు	9.1	7.8

నామినల్ జీడీపీ వృద్ధి 9.7%

ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధరల ఆధారిత నామినల్ జీడీపీ వృద్ధి రేటు మాత్రం 9.7 శాతానికి చేరుకోనుందని అంచనా. 2023-24లో నమోదైన 9.6 శాతం కంటే అధికమిది. ఎన్‌ఎస్‌ఓ గణాంకాల ప్రకారం.. 2023-24లో రూ.295.36 లక్షల కోట్లుగా ఉన్న నామినల్ జీడీపీ 2024-25లో రూ.324.11 లక్షల కోట్లకు చేరుకోనుంది. కాగా, 2024-25లో ప్రస్తుత ధరల ఆధారంగా జోడించిన స్థూల విలువ (జీవీఏ) రూ.292.64 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2023-24లో నమోదైన రూ.267.62 లక్షల కోట్ల జీవీఏతో పోలిస్తే 9.3 శాతం పెరగవచ్చని ఎన్‌ఎస్‌ఓ అంచనా వేసింది.

వచ్చే ఏడాది 6.5% వృద్ధి: ఇక్రా

ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధానికి ఎన్‌ఎస్‌ఓ వృద్ధి అంచనాలు సహేతుకంగా ఉన్నాయని, కొన్ని రంగాలు అంచనా కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మాత్రం అంతర్జాతీయ, దేశీయ అనిశ్చితులు వృద్ధిపై గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం మూలధన వ్యయాలను గణనీయంగా పెంచవచ్చని భావిస్తున్నామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.5 శాతానికి పెరగవచ్చని అంచనా వేశారు.

ఈసారి వృద్ధి 6.2 శాతమే: హెచ్‌ఎస్‌బీసీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు ఎన్‌ఎస్‌ఓ అంచనా కంటే దిగువ స్థాయి 6.2 శాతానికే పరిమితం కావచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం హెచ్‌ఎస్‌బీసీ అంటోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మాత్రం 6.5 శాతానికి చేరుకోవచ్చని అభిప్రాయపడింది.

3.8 లక్షల కోట్ల డాలర్లకు ఎకానమీ

ప్రస్తుత డాలర్-రూపాయి మారకం విలువ (రూ.85.7) ప్రకారంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థిక వ్యవస్థ పరిమాణము 3.8 ట్రిలియన్ (లక్షల కోట్ల) డాలర్లకు చేరుకోనుందని ఎన్‌ఎస్‌ఓ అంచనా వేసింది.

తలసరి ఆదాయం రూ.2 లక్షలు

ప్రస్తుత ధరల ప్రకారంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి తలసరి ఆదాయం వార్షిక ప్రాతిపదికన 8.7 శాతం వృద్ధితో రూ.2,00,162కు చేరుకోవచ్చని ఎన్‌ఎస్‌ఓ అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో తలసరి ఆదాయం రూ.1,84,205గా నమోదైంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గించింది. అదనపు నిధుల సమీకరణ ఖర్చుల ఆధారం (ఎంసీఎల్‌ఆర్)గా మంజూరు చేసే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటును 5 బేసిస్ పాయింట్లు (0.05 శాతం) తగ్గించింది. ఈ తగ్గింపు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు బ్యాంక్ తెలిపింది. అయితే ఈ తగ్గింపు ఎంపిక చేసిన కాలపరిమితి గల రుణాలకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొంది. ఈ తగ్గింపు తర్వాత ఎంసీఎల్‌ఆర్ ఆధారిత రుణాలపై కనీస వడ్డీ 9.15 శాతం నుంచి 9.45 శాతం మధ్య ఉంటుందని సమాచారం.

గేమర్స్ కోసం ఎన్‌విడియా కొత్త టెక్నాలజీ

లాస్‌వెగాస్: అమెరికన్ చిప్ టెక్నాలజీ దిగ్గజం ఎన్‌విడియా.. గేమర్స్, క్రియేటర్స్, డెవలపర్ల కోసం జీఈఫోర్స్ ఆర్‌టీఎక్స్ 50 సిరీస్ డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్ జీపీయూ (గ్రాఫిక్ ప్రాసెసర్ యూనిట్)లను అందుబాటులోకి తెచ్చింది. లాస్‌వెగాస్‌లో జరుగుతున్న సీఈఎస్-2025 సదస్సులో ఎన్‌విడియా వ్యవస్థాపకులు జెన్సన్ హువాంగ్ వీటిని ఆవిష్కరించారు.

రెండు రోజుల నష్టాలకు తెర

234 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ మార్కెట్ రెండు రోజుల నష్టాలకు తెర దించింది. మంగళవారం ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన పటిష్ఠ సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. ఆర్‌ఐఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ అండ్ టీ వంటి బ్లూ చిప్ షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌ను లాభాల బాటలో నిలిపినా మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలకు ముందు ఐటీ షేర్లలో ఏర్పడిన క్షీణత ర్యాలీకి బ్రేక్‌లు వేసింది. పరిమిత పరిధిలోనే కదలాడిన మార్కెట్లో సెన్సెక్స్ 234.12 పాయింట్లు లాభపడి 78,199.11 వద్ద క్లోజయింది. నిఫ్టీ 91.85 పాయింట్ల లాభంతో 23,707.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 1.74 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.77 శాతం లాభపడ్డాయి. ఐటీ, టెక్ సూచీలు మినహా రంగాల వారీ సూచీలన్నీ లాభపడ్డాయి.

స్టాక్ ఆధారిత వైఖరే మెరుగు: మరి కొద్దిరోజుల్లో మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడం, ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రతిపాదన వంటి పరిణామాల నేపథ్యంలో అటు బుల్లిష్, ఇటు బేరిష్ అవకాశాలు రెండూ ఉంటాయని, ఈ పరిస్థితిలో ఇన్వెస్టర్లు స్టాక్ ఆధారిత వైఖరి అనుసరించడమే ఉత్తమమని ఏంజెల్ వన్ టెక్నికల్ అనలిస్ట్ రాజేష్ భోస్లే అన్నారు. సమీప భవిష్యత్తులో మార్కెట్ అప్రమత్తంగానే ఉండవచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ప్రకారం విదేశీ సంస్థలు మంగళవారం రూ.1491.46 కోట్ల విలువ గల షేర్లు విక్రయించారు. ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంలో రూపాయి 6 పైసలు నష్టపోయి 85.74 వద్ద ముగిసింది.

గెట్టీ ఇమేజెస్‌లో షట్టర్‌స్టాక్ విలీనం

న్యూయార్క్: విజువల్ కంటెంట్ రంగంలో భారీ డీల్ కుదిరింది. షట్టర్‌స్టాక్‌ను గెట్టీ ఇమేజెస్ కొనుగోలు చేయనుంది. ఈ రెండింటి విలీనం ద్వారా 370 కోట్ల డాలర్ల విలువైన విజువల్ కంటెంట్ కంపెనీ ఏర్పడనుంది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత సృష్టిస్తున్న చిత్రాల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్న నేపథ్యంలోనే ఈ రెండు కంపెనీ ఒక్కటికాబోతున్నాయి. విలీనం తర్వాత ఏర్పడనున్న కంపెనీలో గెట్టీ ఇమేజెస్ షేర్‌హోల్డర్లు 54.7 శాతం, షట్టర్‌స్టాక్ షేర్‌హోల్డర్లు 45.3 శాతం వాటా కలిగి ఉండనున్నారు. విలీన తర్వాత ఏర్పడే కంపెనీ గెట్టీ ఇమేజెస్ పేరుతో కొనసాగనుంది. అలాగే, కంపెనీ షేరు న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో అదే పేరుతో ట్రేడవనుంది.

ఆటో ఎక్స్‌పోలో 40 కొత్త మోడళ్ల విడుదల

న్యూఢిల్లీ: ఈ నెల మూడో వారంలో న్యూఢిల్లీలో జరగనున్న ఆటో ఎక్స్‌పో 2025లో 40 కొత్త వాహనాలు విడుదలయ్యే ఆస్కారం ఉన్నట్టు అధికార వర్గాలు తెలుపుతున్నాయి. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 పేరిట ఈ ప్రదర్శన ఈ నెల 17 నుంచి 22 వరకు జరగనుంది. ఈ ఎక్స్‌పోలో విడుదల చేస్తారనుకుంటున్న వాహనాల్లో ద్విచక్ర వాహనాలు, ప్రయాణికుల వాహనాలు, బస్సులు ఉన్నట్టు వారు చెబుతున్నారు. వీసాల సమస్య కారణంగా ఈ ఏడాది ఎక్స్‌పోలో భారీ సంఖ్యలో చైనా కంపెనీలు పాల్గొనే ఆస్కారం ఉండకపోవచ్చని వాణిజ్య, పరిశ్రమల శాఖ జాయింట్ సెక్రటరీ విమల్ ఆనంద్ చెప్పారు. గత ఏడాది ఎక్స్‌పో మొత్తం భారత్ మండపంలోనే జరిగిందని, కాని ఈ ఏడాది యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్‌లలో కూడా నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఎక్స్‌పోకు అదనంగా బ్యాటరీ షో, టైర్ షో, ఎలక్ట్రానిక్స్ షో, కాంపోనెంట్స్ షో వంటివి కూడా జరుగుతాయని ఆయన చెప్పారు.

రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ రంగంలోకి టాటా డిజిటల్

న్యూఢిల్లీ: రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్ విభాగంలోకి అడుగు పెడుతున్నట్టు టాటా డిజిటల్ మంగళవారం ప్రకటించింది. టాటా న్యూ సూపర్ యాప్‌పై తొలిసారిగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) విడుదల చేసినట్టు తెలిపింది. వినియోగదారులు సేవింగ్స్ బ్యాంక్ ఖాతా అవసరం లేకుండానే ఈ మార్కెట్ ప్లేస్ ద్వారా ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేయవచ్చని, డిపాజిట్‌పై వడ్డీ రేటు 9.1 శాతం వరకు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. రూ.1,000 అతి చిన్న మొత్తం నుంచి ఇన్వెస్ట్ చేయవచ్చని తెలిపింది. డిపాజిట్లన్నింటికీ రూ.5 లక్షల వరకు డీఐసీజీసీ బీమా లభిస్తుందని, దీనివల్ల తమ సొమ్ము భద్రమే అన్న భరోసా వారికి లభిస్తుందని పేర్కొంది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల డిపాజిట్ల నుంచి తమకు ఆకర్షణీయంగా కనిపించిన దాన్ని కస్టమర్లు ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేయవచ్చని తెలిపింది.

స్పోర్ట్స్

టీఓఏ కార్యవర్గానికి గుర్తింపు లేనట్టేనా?

- జాతీయ క్రీడల రాష్ట్ర బృందానికి చెఫ్ డి మిషన్‌గా శాట్ ఎండీ
- ఐఓఏ నిర్ణయంతో జితేందర్ రెడ్డి, మహేష్ గౌడ్ పోటాపోటీగా భేటీలు

తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ)లో మళ్లీ వివాదం రాజుకుంది. కొత్తగా ఎన్నికైన జితేందర్ రెడ్డి నేతృత్వంలోని కార్యవర్గాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గుర్తించలేదా? అంటే.. తాజా పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు బాధ్యతలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)కు అప్పగించడమే ఇందుకు నిదర్శనం. వచ్చేనెల 14 నుంచి ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు చెఫ్ డి మిషన్‌గా శాట్ వైస్ చైర్మన్, ఎండీ సోనీబాల దేవిని నియమిస్తున్నట్టు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష.. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌కు సోమవారం లేఖ రాసింది. కార్యవర్గాన్ని తాము గుర్తించడం లేదని ఆ ఉత్తర్వుల్లో ఐఓఏ నేరుగా వెల్లడించకున్నా, టీఓఏను సంప్రదించకుండానే చెఫ్ డి మిషన్‌ను ప్రకటించడంలో మర్మమేంటన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఎన్నికలు పూర్తయి కొత్త కార్యవర్గం బాధ్యతలు తీసుకున్నా అధికారం లేకుండా పోవడంతో టీఓఏ భవితవ్యంపై సందేహాలు నెలకొన్నాయి.

'రెండు'గా చీలారు: వాస్తవానికి గత ఫిబ్రవరిలో టీఓఏ పాత కార్యవర్గం పదవీకాలం పూర్తయింది. అప్పటి నుంచి నిధుల దుర్వినియోగం, అడ్డగోలుగా కొన్ని క్రీడా సంఘాల గుర్తింపు రద్దు వంటి ఆరోపణలతో టీఓఏ రెండుగా చీలింది. ఇందులో రెండు వర్గాలకు కాంగ్రెస్ నేతలే నేతృత్వం వహిస్తుండడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుడు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిని పాత కార్యవర్గం, వీరిని వ్యతిరేకిస్తున్న వర్గం రాష్ట్ర స్క్వాష్ సంఘం ఉపాధ్యక్షుడు కూడా అయిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ను ముందు పెట్టి ఎన్నికల తతంగాన్ని నడిపించారు. నవంబరులో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. స్క్వాష్ సంఘానికి ఓటు హక్కు లేకపోవడంతో మహేష్ వర్గం.. జితేందర్‌కు పోటీగా మాజీ క్రికెటర్ చాముండేశ్వర్ నాథ్‌ను అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దింపింది. ఈ ఎన్నికల్లో జితేందర్ వర్గం గెలవడంతో కొత్త కార్యవర్గం డిసెంబరులో కొలువుదీరింది. అయితే, జాతీయ స్పోర్ట్స్ కోడ్ ప్రకారం 70 ఏళ్లు దాటిన వారు క్రీడా సంఘాల్లో పదవులు నిర్వహించడానికి వీల్లేదు. దీంతో 71 ఏళ్ల జితేందర్ టీఓఏ పదవికి అనర్హుడని, అతని ఎన్నిక చెల్లదని వ్యతిరేక వర్గం ఐఓఏ ముందు ఇటీవల తమ నిరసనను కూడా వ్యక్తం చేసింది. దీంతో టీఓఏ కొత్త కార్యవర్గాన్ని ఐఓఏ గుర్తించలేదని సమాచారం. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఇరువర్గాలు పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తూ భవిష్యత్ పరిణామాలపై చర్చిస్తున్నారు.

(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

ఆందోళనలో క్రీడాకారులు

జాతీయ క్రీడల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు వివరాలను మరో రెండ్రోజుల్లో నిర్వాహకులకు పంపించాల్సి ఉంది. ఆ క్రీడల్లో పోటీపడే క్రీడాకారులకు కిట్ల పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడల్లో తాము పాల్గొంటామా లేదా అన్న మీమాంసలో క్రీడాకారులు ఉన్నారు. టీఓఏలో తాజా పరిణామాల నేపథ్యంలో తమ భవితవ్యం ఏంటన్న దానిపై వాళ్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా మంత్రిత్వ శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్దనే ఉండడంతో రాష్ట్ర ఒలింపిక్ సంఘాన్ని గాడిన పెట్టి, క్రీడారంగ అభివృద్ధికి ఆయన చొరవ తీసుకోవాలని క్రీడాకారులు, వాళ్ల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గాయాలతో సహవాసం



'సిడ్నీ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌కు బుమ్రా దూరమయ్యాడని తెలిసి ఎంతగానో సంతోషించాం'.. 164 పరుగుల ఛేదనను విజయవంతంగా ముగించాక ఆసీస్ ఆటగాళ్లు ఖవాజా, హెడ్ చేసిన వ్యాఖ్యలివి. అప్పటికి రెండు రోజుల సమయం ఉండీ.. తక్కువ ఛేదనే అయినా బుమ్రా బుల్లెట్ బంతుల సంగతి తెలిసి వారు పడిన ఆందోళనకు తార్కాణమిది. కొన్నాళ్లుగా భారత క్రికెట్ అమ్ములపొదిలో పేసర్ బుమ్రానే ప్రధాన ఆయుధం. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అటు బ్యాటర్లు.. ఇటు ఇతర బౌలర్లు విఫలమైనా ఒక్కడై కంగారూల భరతం పట్టాడు. మిగతా భారత పేసర్లు 40 వికెట్లు తీస్తే.. తనొక్కడే 32 వికెట్లతో వహ్వా అనిపించాడు. మొత్తంగా సిరీస్‌లో 908 బంతులు వేశాడు. కానీ ఈ అధిక ఒత్తిడే మరోసారి బుమ్రాను గాయపడేలా చేసింది. ఆఖరి టెస్టు మధ్యలోనే వెన్నునొప్పి తిరగబెట్టడంతో బరిలోకి దిగలేకపోయాడు. ప్రస్తుతం అతడి గాయం పరిస్థితిపై బోర్డు నుంచి ఎలాంటి స్పష్టతా లేదు. కానీ రాబోయే ఇంగ్లండ్ సిరీస్‌లతో పాటు చాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండేది కూడా సందేహమేనని చెబుతున్నారు.

2018 నుంచే..

కెరీర్ ఆరంభం నుంచే గాయాలు నీడలా వెంటాడుతున్నా, పట్టుదలతో కోలుకుని జట్టులోకి రావడం బుమ్రాకు అలవాటుగా మారింది. 2018లో భారత జట్టు మూడు నెలలపాటు ఐర్లాండ్-ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది. కానీ తొలి టీ20లోనే బుమ్రా ఎడమ చేతి బొటనవేలికి ఫ్రాక్చర్ అయ్యింది. దీంతో మొదటిసారి అతడు గాయంతో మూడు వారాలపాటు జట్టుకు దూరమయ్యాడు. మరుసటి ఏడాది విండీస్ టూర్‌లో వెన్నునొప్పి బాధపెట్టడంతో ఈసారి మూడు నెలలు విశ్రాంతి తీసుకున్నాడు. దీంతో స్వదేశంలో సౌతాఫ్రికా, బంగ్లాదేశ్‌తో సిరీస్‌లకు దూరమయ్యాడు. ఇక 2021 జనవరి సిడ్నీ టెస్టులో ఉదర కండరాలు పట్టేయడంతో కోలుకునేందుకు నెలరోజులు పట్టింది. 2022 ఆగస్టులో బుమ్రా మరోసారి వెన్నునొప్పికి గురయ్యాడు. ఈసారి జట్టుకు గట్టి దెబ్బే పడిం ది. ఆసియాకప్‌తో పాటు ఆసీస్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌నకు సైతం అందుబాటులో లేకుండాపోయాడు. 2023, మార్చిలో బుమ్రా సర్జరీ చేయించుకోవడంతో ఆ ఏడాది ఐపీఎల్, వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌తో పాటు చాలా టోర్నీలను ఆడలేకపోయాడు. ఇలా కీలక టోర్నీల్లో తను లేకపోవడం జట్టు విజయావకాశాలపైనా ప్రభావం చూపింది. దాదాపు ఏడాది విరామం తర్వాత 2023 ఆగస్టులో ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా బరిలోకి దిగాడు. అలాగే ఆసియాకప్‌తో పాటు భారత్‌లో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లోనూ అదరగొట్టాడు. ఇక అప్పట్నుంచి బీసీసీఐ కూడా అతడిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ వచ్చింది. కానీ ఇటీవలి ఆసీస్ టూర్‌లో అందరూ భయపడినట్టుగానే బుమ్రాను మరోసారి గాయం పలుకరించింది. కీలక చాంపియన్స్ ట్రోఫీ ముంగిట జట్టుకిది గట్టి షాక్ అని అనుకోవచ్చు. అటు బుమ్రా కోలుకునేందుకు ఈసారి ఎన్ని రోజులు పడుతుందనేది జట్టుతో పాటు అభిమానులను కలవరపరుస్తోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)


అతడిపైనే భారమెందుకు?

బుమ్రాపై అధిక భారం పడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ కెప్టెన్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. దేశంలో వర్ధమాన బౌలర్లకు కొదవ లేదని, వారంతా జట్టులో చాన్స్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాడు. వారికి అవకాశాలు కల్పిస్తే బుమ్రాపై ఎక్కువ ఒత్తిడి పడకుండా ఉంటుందని సూచించాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడనిస్తేనే యువ బౌలర్ల ప్రతిభ తెలుస్తుందని తెలిపాడు.

ఐసీసీ అవార్డుకు బుమ్రా నామినేట్

బుమ్రా డిసెంబరుకు సంబంధించి 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్' పురస్కారానికి నామినేట్ అయ్యాడు. ఇటీవలి ఆసీస్ టూర్‌లో అతను విశేషంగా రాణించిన సంగతి తెలిసిందే. బుమ్రాతో పాటు ఆసీస్ కెప్టెన్ కమిన్స్, దక్షిణాఫ్రికా సీమర్ ప్యాటర్సన్ అవార్డు రేసులో ఉన్నారు.

ఇండియా ఓపెన్‌కు భారీ బృందంతో భారత్



న్యూఢిల్లీ: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టితోపాటు పీవీ సింధు, లక్ష్యసేన్ ఇండియా ఓపెన్‌లో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈ నెల 14 నుంచి జరగనున్న టోర్నీలో భారత్ 21 మంది సభ్యుల భారీ బృందంతో బరిలోకి దిగనుంది. పెళ్లి తర్వాత సింధు ఆడబోతున్న తొలి టోర్నీ ఇదే. ఒలింపిక్ చాంపియన్లు విక్టర్ అక్సెల్‌సెన్, అన్ సి యంగ్, వరల్డ్ నెం:1 షి యుకి కూడా బరిలో ఉండడంతో పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2023 ఫైనలిస్ట్ అయిన అక్సెల్‌సెన్ అనారోగ్యం కారణంగా గతేడాది బరిలోకి దిగలేక పోయాడు. మొత్తంగా భారత్ తరఫున పురుషుల సింగిల్స్‌లో ముగ్గురు, మహిళల సింగిల్స్‌లో నలుగురు, పురుషుల డబుల్స్‌లో రెండు జంటలు, మహిళల డబుల్స్‌లో ఎనిమిది జోడీలు, మిక్స్‌డ్‌లో నాలుగు జంటలు పోటీలో నిలవనున్నాయి. టైటిల్ విజేతలకు 11 వేల ర్యాంకింగ్ పాయింట్లు లభించనున్నాయి.


భారత బృందం ఇదే

పురుషుల సింగిల్స్: లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్; **మహిళల సింగిల్స్:** పీవీ సింధు, మాళవిక భన్సోడ్, అనుపమ ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్; **పురుషుల డబుల్స్:** సాత్విక్/చిరాగ్, సాయి ప్రతీక్/పృథ్వీ; **మహిళల డబుల్స్:** ట్రీసా జాలీ/గాయత్రీ గోపీచంద్, అశ్విని/తనీషా, రుతుపర్ణ/శ్వేతపర్ణ, మానస/గాయత్రి, అశ్విని/శిఖా గౌతమ్, సాక్షి/అపూర్వ, సానియా/రష్మీ, మృణ్మయి/ప్రేరణ; **మిక్స్‌డ్ డబుల్స్:** ధ్రువ్ కపిల/తనీషా, సతీష్/ఆద్య, రోహన్/రుత్విక, సూర్య/అమృత.

గాయత్రి జోడీ శుభారంభం

కౌలాలంపూర్: భారత స్టార్ జంట పుల్లెల గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ మలేసియా ఓపెన్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి మ్యాచ్‌లో ఆరో సీడ్ గాయత్రి/ట్రీసా ద్వయం 21-10, 21-10తో చైనీస్ తైపీ జంట ఓర్నిచ్చా/సుకితను ఓడించి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఇక, సింగిల్స్‌లో భారత స్టార్ లక్ష్యసేన్ 14-21, 7-21తో చి యు జెన్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు. కాగా, కెనడా షట్లర్ బ్రయాన్ యాంగ్‌తో తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రణయ్ 21-12, 6-3తో ఆధిక్యంలో ఉన్న దశలో గది పైకప్పు లీకై వర్షపు నీరు కారడంతో మ్యాచ్‌ని నిలిపేశారు. ఆ తర్వాత మ్యాచ్ మొదలైనా పైకప్పు సమస్య మళ్లీ మొదలవడంతో మ్యాచ్‌ను బుధవారం కొనసాగించాలని నిర్ణయించారు. మ్యాచ్ నిలిపివేసే సమయానికి ప్రణయ్ 21-12, 9-11తో ఉన్నాడు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో సాగర్‌కు స్వర్ణం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నోయిడాలో జరుగుతున్న జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో హైదరాబాద్ లిఫ్టర్ సాగర్ అమృత్ సింగ్ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. 60 శాతానికిపైగా వినికిడి సమస్య ఉన్న సాగర్ ఓపెన్ కేటగిరీలో బరిలోకి దిగి పతకం సాధించడం విశేషం. 75 కిలోల విభాగంలో పోటీ పడిన సాగర్ స్క్వాట్ 50 కి., బెంచ్ ప్రెస్ 65 కి., డెడ్ లిఫ్ట్ 130 కి., మొత్తంగా 245 కిలోల బరువెత్తి పసిడి పతకం కైవసం చేసుకున్నాడు.

21 నుంచి రాజీవ్ గాంధీ టీ20 లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆలిండియా రాజీవ్ గాంధీ టీ20 లీగ్‌ను ఈనెల 21 నుంచి నిర్వహిస్తున్నట్టు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) చైర్మన్ వి.హనుమంతరావు వెల్లడించారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరగనున్న ఈ అండర్-19 టీ20 లీగ్‌లో శ్రీలంక, దుబాయ్, మలేసియా జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ మూడు దేశాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 14 జట్లు లీగ్‌లో తలపడనున్నాయి.

ప్రియుడితో ఒసాక కటీఫ్



టోక్యో: జపాన్ టెన్నిస్ స్టార్, మాజీ ప్రపంచ నెంబర్‌వన్ నవోమీ ఒసాక తన ప్రియుడు కోర్డేతో బంధాన్ని తెంచుకుంది. సంగీతకారుడైన కోర్డేతో ఆరేళ్లుగా సహజీవనం చేస్తున్న 27 ఏళ్ల ఒసాక.. అతనితో విడిపోయినట్టు తన సోషల్ మీడియాలో ప్రకటించింది. వీరిద్దరికి షాయ్ అనే ఏడాదిన్నర వయసున్న పాప ఉంది. ఆమధ్య కొంతకాలం ఆటకు దూరంగా ఉన్న ఒసాక.. నాలుగురోజుల్లో మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తలపడుతోంది.

షమి పరిస్థితేంటి? ప్రశ్నించిన శాస్త్రి



సిడ్నీ: వెటరన్ పేసర్ మహ్మద్ షమి గాయాల నియంత్రణతోపాటు అతడి పునరాగమనం గురించి దిగ్గజాలు రవిశాస్త్రి, రికీ పాంటింగ్ ప్రశ్నలు లేవనెత్తారు. ఒకవేళ షమి జట్టులో ఉండి ఉంటే.. బోర్డర్-గవాస్కర్ సిరీస్ ఫలితం భారత్‌వైపు మొగ్గి ఉండేదని అభిప్రాయపడ్డారు. తానైతే షమిని ఆసీస్‌కు తీసుకువచ్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచేవాడినని శాస్త్రి అన్నాడు. బుమ్రాకు మిగతా పేసర్ల సహకారం అవసరం అని చెప్పాడు. శాస్త్రి అభిప్రాయంతో పాంటింగ్ కూడా ఏకీభవించాడు. షమి లేకపోతే సిరీస్‌లో భారత్ 1-3తో ఓడిపోతుందని తాను ముందుగానే చెప్పినట్టు గుర్తు చేశాడు.



అల్వాల్‌లో టిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

అల్వాల్ టిమ్స్ నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం

» ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు

హైదరాబాద్ సిటీ/తిరుమలగిరి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అల్వాల్‌లో టిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు ఆలస్యం జరుగుతోందని అధికారులపై మండిపడ్డారు. ఈ పనులను మంత్రి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11.53 లక్షల చదరపు అడుగుల్లో రూ.879 కోట్ల అంచనాతో చేపట్టిన అల్వాల్ టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం 90 శాతం పూర్తయిందన్నారు. సనత్‌నగర్, ఎల్బీనగర్ టిమ్స్ నిర్మాణాల్లో ధర్మశాల ఉన్నప్పుడు ఇక్కడ ఎందుకు నిర్మించడం లేదని అధికారులను నిలదీశారు. ఆగస్టు 31 నాటికి అల్వాల్ టిమ్స్ పనులు పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీని ప్రారంభోత్సవం చేయిస్తామని పేర్కొన్నారు. వాస్తు పేరిట గత ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేయడం వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందని నిర్మాణ సంస్థ నిర్వాహకులు మంత్రికి వివరించారు. 2025 డిసెంబరు నాటికి ఎట్టిపరిస్థితుల్లో సనత్ నగర్, ఎల్.బీ.నగర్, అల్వాల్ టిమ్స్ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ఇక కేటీఆర్ విచారణపై విలేకరులు అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందిస్తూ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. తాము ప్రజల కోసం పని చేస్తుంటే వాళ్లు రాజకీయాలు చేస్తున్నారన్నారు.

సాగు భూమి అవునా, కాదా నిక్కచ్చిగా తేల్చండి

» అధికారులకు నవీన్ మిట్టల్ సూచన

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సాగు భూములను గుర్తించేందుకు రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని, సాగులో ఉన్న భూమి అయితేనే రైతు భరోసా జాబితాలో పెట్టాలని రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. సాగుకు అనుకూలమైన భూమి అయినా ఇతర కారణాలతో తిరస్కరించవద్దన్నారు. రైతు భరోసా అందించేందుకు వ్యవసాయ యోగ్యమైన భూముల గుర్తింపునకు, భూ భారతి చట్టాన్ని అమలు చేయడానికి విధివిధానాల రూపకల్పనకు సంబంధించి రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో నవీన్ మిట్టల్ మంగళవారం సమావేశమయ్యారు. అధికారుల నుంచి పలు సూచనలు, సలహాలు సేకరించడంతోపాటు, సాగు భూముల సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. త్వరలో అమల్లోకి రానున్న భూ భారతి చట్టం-2024 పై రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తామని నవీన్ మిట్టల్ తెలిపారు. గతంలో ధరణి పోర్టల్ విషయంలో శిక్షణ లేక కొంత గందరగోళం నెలకొందని, ఆ పరిస్థితి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

రూ. 3000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.3000 కోట్ల అప్పు తీసుకుంది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సమర్పించిన చివరి త్రైమాసికపు ఇండెంట్లలో భాగంగా ఈ రుణాన్ని తీసుకుంది. 7.13 శాతం వార్షిక వడ్డీ 24 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 7.12 శాతం వార్షిక వడ్డీ 29 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 7.11 శాతం వార్షిక వడ్డీ 30 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్ల చొప్పున ఈ అప్పును సేకరించింది.

సిటీ పోలీస్ శాఖలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ (ఎస్‌పీవో) ఉద్యోగాలకు సిటీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 191 పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు జరపనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు మాజీ సైనికులు, మాజీ పారా మిలటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారికే ప్రాధాన్యమిస్తామని అధికారులు వెల్లడించారు. జనవరి 1 2025 నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న మాజీ పారా మిలటరీ, రిటైర్డ్ పోలీసు అధికారులు.. రెండేళ్లలోపు పదవి విరమణ చేసి ఉన్నవారు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. గరిష్ఠ వయో పరిమితి 61 ఏళ్లని చెప్పారు. నియామకం అయిన ఎస్‌పీవోలకు నెలకు రూ. 26వేలు గౌరవ వేతనం అందజేస్తామని, సెలవులకు అర్హత ఉండదని, సెలవు దినాలకు జీతం చెల్లించరని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఎక్స్ సర్వీస్ మెన్ డిశ్చార్జి బుక్/సీఏపీఎఫ్ డిశ్చార్జి సర్టిఫికెట్, ఆర్‌పీపీ రిటైర్మెంట్ ఆర్డర్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, టెక్నికల్ ట్రేడ్ ప్రొఫీషియన్సీ సర్టిఫికెట్. డ్రైవర్ అభ్యర్థులు చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఎల్ఎంవీ/హెచ్ఎంవీ, 3 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో ఎస్‌పీవో ఆఫీస్, సిటీ పోలీస్ కార్ హెడ్ క్వార్టర్స్ పేట్ల బురుజు కార్యాలయంలో జనవరి 25 సాయంత్రం 5 గంటలలోపు నేరుగా సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని అధికారులు తెలిపారు.

రైతుభరోసా అమలు చేయడం లేదంటూ పోస్టర్లు

» ఏఐసీసీ కార్యాలయం ముందు వెలసిన వైనం

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాపై తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద పోస్టర్లు వెలిశాయి. ఏఐసీసీ ఆఫీసు ప్రహరీ వద్ద గల రిసెప్షన్, మెయిన్ గేట్ ముందు ఉన్న బ్యారికేడ్లపై కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ముద్రించిన పోస్టర్లు సోమవారం అర్ధరాత్రి దాటాక దర్శనమిచ్చాయి. రైతుభరోసాపై కాంగ్రెస్ యూటర్న్ తీసుకుందని, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అధికారంలోకి వచ్చాక ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించారని ఆ పోస్టర్లలో ముద్రించారు. 2024లో రైతులకు రైతుభరోసా సున్నా అని, రూ.12 వేలు ప్రకటించి రైతుభరోసాపై సీఎం రేవంత్ యూటర్న్ తీసుకున్నారని ముద్రించారు. పోస్టర్లను అంటించిన కొద్దిసేపట్లోనే గమనించిన పార్టీ కార్యాలయ సిబ్బంది తొలగించారు.

టీజీసెట్- 2025ను వెంటనే నిర్వహించండి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ ఆఖర్లో టీజీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్ల పరీక్షలకు కొత్తగా పీజీ పూర్తిచేసుకున్న నిరుద్యోగులకు కూడా అవకాశం ఉండేలా టీజీ సెట్- 2025 పరీక్షను వెంటనే నిర్వహించాలని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. దాంట్లో భాగంగా ఈ ఏడాది జూన్ ఆఖర్లో టీజీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్లతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉద్యోగాలు భర్తీ చేయనుంది. ఈ పరీక్షలకు దరఖాస్తు చేయాలంటే పీజీ పూర్తిచేసిన వారు టీజీ సెట్ పరీక్ష అర్హత సాధించాల్సి ఉంది. రాష్ట్రంలోని అనేక వర్సిటీల్లో గత ఏడాది ఆఖర్లో పీజీ పూర్తిచేసుకున్న వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అభ్యర్థులు పేర్కొంటున్నారు. కొత్తవారు కూడా పోటీ పరీక్షలకు హాజరయ్యేలా టీజీ సెట్ పరీక్ష వెంటనే నిర్వహించాలని అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలన తీరుపై సమీక్షించేందుకు బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీ కానుంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, కమిటీ సభ్యులు పాల్గొననున్నారు. ఏడాది పాలనతో పాటుగా కులగణన, స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు.



నాంపల్లి బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

దాడి.. ప్రతిదాడి!

(మొదటిపేజీ తరువాయి)

గాంధీభవన్ వరకు వెళ్లడంతో రెండుచోట్లా కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం పన్నెండు నుంచి పన్నెండున్నర గంటల సమయంలో సుమారు 40 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మరో నాలుగు వాహనాలపై మరి కొంతమంది నాయకులు బీజేపీ ఆఫీసు వద్దకు వచ్చారు. లోపలికి దూసుకుపోవడానికి ప్రయత్నించారు. పోలీసుల సమక్షంలోనే బారికేడ్లను తొలగించి కొందరు అవతలివైపు దూకారు. కార్యాలయంపై రాళ్లు, కోడిగుడ్లు విసిరారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల నేతలు ఆగ్రహంతో ఊగిపోతూ పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. ఫ్లెక్సీలు చింపేశారు. తోపులాటలు, దూషణలతో అక్కడ పరిస్థితి రణరంగంగా మారింది. నిరసనకారులు ప్రధాని నరేంద్రమోదీకి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యాలయం లోపల ఉన్న బీజేపీ నాయకులకు గాయాలయ్యాయి. ముగ్గురు సెక్యూరిటీ గార్డులు, పలువురు బీజేపీ నేతలతోపాటు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయి.

కాంగ్రెస్ కార్యాలయంపైకి..

తమ పార్టీ ఆఫీసుపై కాంగ్రెస్ నేతల దాడిని నిరసిస్తూ.. 30-40 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొందరు గాంధీభవన్ ముట్టడికి బయల్దేరారు. అడ్డుకున్న పోలీసులను తోసేసి అక్కడికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. దీంతో భద్రతా బలగాలు నాలుగువైపులా వారిని చుట్టుముట్టి బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లోకి ఎక్కించారు. బైక్‌లపై గాంధీభవన్ వైపు వెళ్లేందుకు యత్నించిన పలువురు కార్యకర్తలను కూడా పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. కాగా.. కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లును నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్.. ఆయన తలకు బలమైన గాయం అయిందని తెలిపారు. కాగా.. బీజేపీ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు మంగళవారం రాత్రి 8 గంటల సమయానికి ఎనిమిది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో 40 నుంచి 60 మంది వరకు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, మరింత మందిని అదుపులోకి తీసుకుంటామని అబిడ్స్ పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు.. గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించిన బీజేపీ నేతలపై బేగంబజార్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇరుపార్టీల పరస్పర దాడుల నేపథ్యంలో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కాగా.. ఈ దాడులను అంచనా వేయడంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



బీజేపీ నాయుకుడు రమేశ్ ఆధురి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పిరికిపందల చర్య

బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

» మావాళ్లు తల్చుకుంటే గాంధీ భవన్ పునాదులు కూడా మిగలవ్: బండి

» ఎవరు ఎవరిపై దాడిచేసినా ఊరుకోం: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

» దాడికి పాల్పడ్డవారిపై టీపీసీసీ ఆగ్రహం

హైదరాబాద్, న్యూఢిల్లీ, మహబూబ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, గుండాలు, రౌడీల్లాగా వ్యవహరిస్తూ దాడికి దిగడం పిరికిపందల చర్య అని కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ఖబడ్దార్, సహనం కోల్పోయి మీరు చేస్తున్న చర్యలకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు తిరగబడితే.. దేశంలో కాంగ్రెస్‌కు ఉన్న కొద్దిపాటి నాయకులు రోడ్లపై తిరగలేని పరిస్థితులు ఏర్పడతాయి. ఈ రకమైన దాడులతో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంద"ని అందులో హెచ్చరించారు. కాంగ్రెస్ నేతల దాడిపై సీఎం రేవంత్‌రెడ్డి సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాడులను ఆపకపోతే.. ఆ తర్వాత తలెత్తే పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. ఇక.. బీజేపీ ఆఫీసుపై దాడికి సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌దే బాధ్యత అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలకు, భౌతిక దాడులకు పాల్పడటం ప్రమాదకరమన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ పునాదులు కూడా మిగలవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. అధికార పార్టీ కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రాళ్లదాడి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ గూండా రాజకీయాలు సాగబోవని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. ఈ దాడి వెనుక సీఎం రేవంత్ కుట్ర ఉందని ఆమె ఆరోపించారు. దీనికి బాధ్యులైన ఎవ్వరినీ వదలబోమని.. చిల్లర రాజకీయాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని ఆమె హెచ్చరించారు. ఇక.. పార్టీ కార్యాలయాలపై దాడి చేసే సంస్కృతి సిగ్గుచేటు అని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేసీఆర్ ఓడిపోయాక రాష్ట్రంలో దాడుల సంస్కృతి పోయిందనుకున్నానని.. కాంగ్రెస్ హయాంలోనూ అదే సంస్కృతి కనపడుతోందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల ముసుగులో గూండాలు, రౌడీషీటర్లు బీజేపీ కార్యాలయంపై దాడి చేశారని ఎంపీ రఘునందన్ ఆరోపించారు. తాము తలుచుకుంటే కాంగ్రెస్ ఆఫీసుపై బుల్డోజర్‌ను ఎక్కించగలమని, తగలబెట్టగలమని, ధ్వంసం చేయగలమని ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. దాడులతో హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీయాలని సీఎం భావిస్తున్నారా? అని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. కాగా.. బీజేపీ కార్యాలయంపై దాడిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖండించారు. ఏ పార్టీ కార్యకర్తలు ఎవరిపై దాడి చేసినా ఊరుకోబోమని.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడిని సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఖండించారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ యువజన కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ఇక.. బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడిని టీపీసీసీ సీరియస్‌గా పరిగణించింది. నిరసనలు ప్రజాస్వామ్య విధానంలో ఉండాలి తప్ప ఇలా దాడికి వెళ్లడం సరికాదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను మందలించారు.



గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ ఫ్లెక్సీలను చింపేస్తున్న బీజేపీ కార్యకర్త

భారత్ మాతాకీ జై అంటూ.. భరతమాత బిడ్డ ప్రియాంకను అవమానిస్తారా?

ఆమెపైన మీ నేత వ్యాఖ్యలు చేయడం వల్లే యూత్ కాంగ్రెస్ నేతలు దాడికి దిగారు

» మీ ఇంట్లో అమ్మని, అక్కని అంటే మీరు ఊర్కుంటరా?

» ఐనా కాంగ్రెస్ గాంధీ మార్గంలో నడుస్తది

» మీ కార్యాలయం వద్ద మా వాళ్ల నిరసనను టీపీసీసీ చీఫ్ ఖండించారు

» కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాత్రం.. బీజేపీ కార్యకర్తలను రెచ్చగొట్టారు

» బీజేపీ ఆఫీస్‌లో రాజాసింగ్‌కు ఎంట్రీ లేదు

» ఆయన గాంధీభవన్‌పై మాట్లాడడమా?

» దాడులను మేం ప్రోత్సహించం.. మీరూ ప్రోత్సహించకండి

» మేము భయపడుతున్నామని అనుకోవద్దు

» బీజేపీ జాతీయ నాయకత్వం ప్రియాంకకు క్షమాపణలు చెప్పాలి: తూర్పు జగ్గారెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): "భారత్ మాతాకీ జై అంటూనే.. భరతమాత పుత్రిక ప్రియాంక గాంధీని అవమానిస్తారా? ఆమెపై మీ పార్టీ నేత రమేష్ బిధురి వ్యాఖ్యలను తప్పు పట్టాల్సింది పోయి సమర్థించుకుంటారా? విలువలతో కూడిన మీ రాజకీయం ఇదేనా?" అంటూ బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి నిలదీశారు. గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంక పై బిధురి అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్లనే యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ దాడి చేశారన్నారు. "మీ ఇంట్లోని అమ్మ, అక్కలను ఏమైనా అంటే మీరు ఊరుకుంటరా? ఇంట్లో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుండెలు మండవా?" అని నిలదీశారు. అయినా గాంధీ చూపిన అహింసా మార్గంలో నడిచే కాంగ్రెస్.. ఆ దాడిని సమర్థించట్లేదన్నారు. బీజేపీ కార్యాలయంవద్ద యూత్ కాంగ్రెస్ నేతల నిరసన.. దాడిని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఖండించారని, దాడి చేసిన నాయకులను మందలించారనీ వెల్లడించారు. కానీ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేయించారని ఆరోపించారు. "మీరు అంత పెద్ద తోపలా? మీరు రెచ్చగొడితే మా వాళ్లూ రెచ్చి పోలేరా? మా బలం ముందు మీ బలం సరిపోతుందా? అయినా.. అసలు తప్పు ఎవరిది? ప్రియాంక గాంధీపైన మీ పార్టీ నేత బిధురీ.. అనుచిత వ్యాఖ్యలు చేయకుంటే.. మీ పార్టీ కార్యాలయంపైకి మా వాళ్లు వచ్చుండేవాళ్లు కాదు కదా? భారత్ మాతాకీ జై అనే మీరు.. భరతమాత బిడ్డ ప్రియాంక గాంధీపైన మీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను ఎలా సమర్థించుకుంటున్నారు?" అంటూ కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను నిలదీశారు. గాంధీభవన్‌ను పేల్చేస్తానంటున్న రాజాసింగ్‌కు.. అసలు బీజేపీ కార్యాలయంలోకే ఎంట్రీ లేదన్నారు. ప్రియాంక గాంధీపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన బిధురీని డీకే అరుణ సమర్థించడం సరికాదన్నారు. పార్టీ కార్యాలయాలపైన దాడులను తాము ప్రోత్సహించమని, అలాగే బీజేపీ నాయకులూ ప్రోత్సహించవద్దన్నారు. అట్లాగని తాము భయపడుతున్నామని అనుకోవద్దని పేర్కొన్నారు. ప్రియాంకపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన బిధురీని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ప్రియాంకకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ నాయకత్వాన్ని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.

కావాలంటే మీరు పెట్టుకోండి!

ఉక్కు ఫ్యాక్టరీపై రాష్ట్రానికి కేంద్రం సలహా

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం నెలకొల్పడం సాధ్యం కాదన్న కేంద్ర ప్రభుత్వం.. దానిపై తాజాగా ఒక సలహాను మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందని సమాచారం. బయ్యారంలో కానీ లేకుంటే మహబూబ్‌నగర్ జిల్లాలో కానీ రాష్ట్ర ప్రభుత్వమే ప్రైవేటు రంగంతో కలిసి ఉక్కు కర్మాగారం పెట్టుకోవచ్చని సూచించిందని తెలిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కర్ణాటకకు సరిహద్దుగా ఉన్నందున ఆ రాష్ట్రం నుంచి ముడి ఇనుమును తెచ్చుకోవడానికి వీలుంటుందని తెలిపింది. దీనికి అవసరమైతే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)తో సాధ్యాసాధ్యాల పరిశీలన చేయిస్తామని, కేంద్రం ప్రోత్సాహక పాత్ర నిర్వర్తిస్తుందని తెలిపింది. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం బయ్యారంలో ఉక్కు కర్మాగారం పెట్టాలని తెలంగాణ తొలి నుంచి అడుగుతోంది. అయితే అక్కడ లభించే ముడిఇనుము నాణ్యత చాలా తక్కువ అని, అందుకే అక్కడ ఉక్కు కర్మాగారం పెట్టడం సాధ్యం కాదని కేంద్రం గతంలోనే తేల్చేసింది. అయితే బయ్యారంలోనే నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే రాసిన లేఖకు తాజాగా కేంద్ర ఉక్కు శాఖ అధికారులు స్పందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రైవేటు రంగంలో ఉక్కు కర్మాగారంలో నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపిస్తే సాధ్యాసాధ్యాల నివేదికను సెయిల్‌తో చేయిస్తామని ప్రతిపాదించినట్టు తెలిసింది.

రాజ్యాంగంపై బీజేపీ కుట్రలను తిప్పికొడదాం

» 26న పెద్దఎత్తున సంవిధాన్ బచావో ర్యాలీలు

» అదే స్ఫూర్తితో ఏడాది పాటు పాదయాత్రలు

» పార్టీ శ్రేణులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేఖ



హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ కుట్రలకు వ్యతిరేకంగా సీడబ్ల్యూసీ పిలుపు మేరకు ఏడాది పాటు నిర్వహించే 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్రలను విజయవంతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్' పేరిట కార్యక్రమాలు చేపట్టాలని సీడబ్ల్యూసీ తీర్మానాల వివరాలతో డీసీసీల అధ్యక్షులు, పార్టీ నాయకులకు ఆయన మంగళవారం లేఖలు రాశారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యే జనవరి 26న పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు. అదే స్ఫూర్తితో వచ్చే ఏడాది జనవరి 26 వరకు ఏడాది పాటు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో 'సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్రలు' నిర్వహించి.. ప్రజా వ్యతిరేక బీజేపీ మెడలు వంచాలని కోరారు. దేశంకోసం బలిదానాలు చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసం, దేశంలో లౌకికవాదం, ఐక్యత కోసం పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తిగల న్యాయ వ్యవస్థ, ఎన్నికల కమిషన్‌తో పాటు మీడియా వంటి రంగాలపై బీజేపీ ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఏకపక్షంగా 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టడం బీజేపీ నియంతృత్వ పోకడలకు నిదర్శనమన్నారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మన రాజ్యాంగంపై, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజకీయ కుట్రలకు తెరలేపి బడుగు బలహీన, మైనారిటీ వర్గాల్లో బీజేపీ తీవ్ర భయాందోళనలు సృష్టిస్తోందన్నారు. బీజేపీ పాలనలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థతో దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల నడ్డి విరుగుతోందన్నారు. నియంతృత్వ పోకడలతో ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్న మోదీ పాలనకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ స్ఫూర్తి, సిద్ధాంతాల మార్గదర్శకంలో ఉద్యమించేలా ప్రజలను కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం చేయాలని కోరారు.



చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ రమలను సన్మానిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నేతలు

బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చంద్రశేఖర్‌గౌడ్, డాక్టర్ రమ ఎన్నిక

కవాడిగూడ, జనవరి7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముకురాల చంద్రశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ దేశబోయిన రమ ఎన్నికయ్యారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. వారిని ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం హైదరాబాద్ దోమలగూడలోని బీసీ భవన్‌లో బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వంతో పోరాడతానని, ఈడబ్ల్యూఎస్ రద్దు, సీపీఎస్ రద్దు కోసం తనవంతు పోరాటం చేస్తానని అన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగ సంఘాన్ని బలోపేతం చేసి బీసీ ఉద్యోగులకు ఎదురైన సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు.

తప్పు చేయనప్పుడు కోర్టుకెందుకెళ్లారు?: జూపల్లి

కేటీఆర్.. ఇప్పటికైనా చట్టాలను గౌరవించాలి: ఎంపీ చామల

బాన్సువాడ/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసుకు సంబంధించి కేటీఆర్ తప్పు చేయనప్పుడు కోర్టుకెందు కెళ్లారని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిందని, ఏసీబీ విచారణకు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. తప్పు చేయనప్పుడు ఏసీబీ విచారణకు హాజరై సహకరించాలని ఆయన సూచించారు. కేటీఆర్ ఇప్పటికైనా కోర్టులు, చట్టాలను గౌరవించాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హితవు పలికారు. ప్రతీ విషయాన్ని రాజకీయం చేస్తూ నాటకాలు ఆడొద్దన్నారు. హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన తర్వాత చట్టం తన పని తాను చేసుకుంటూపోతుందని ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని ఒక ప్రకటనలో ఆయన సూచించారు.

గురుకుల విద్యాసంస్థల్లో ఐటీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్న గురుకుల విద్యాలయాల్లో 65 ఐటీ ఇన్‌స్ట్రక్టర్, రెండు పీఆర్‌వో పోస్టులను భర్తీ చేయడానికి ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని గురుకుల విద్యాలయాల సంస్థ ప్రకటించింది. ఐటీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసేవారు ఎంటెక్, బీటెక్ లేదా ఎంసీఏలో కంప్యూటర్ కోర్సు పూర్తిచేసి ఉండాలని, పీఆర్‌వో పోస్టుకు దరఖాస్తు చేసేవారు జర్నలిజంలో డిగ్రీ చేసి, కనీసం పదేళ్ల అనుభవం ఉండాలని తెలిపింది. దరఖాస్తులను 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు మసాబ్ ట్యాంక్ దేశోద్ధారక భవన్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రధాన కార్యాలయంలో అందజేయాలి.

ఇంటర్ విద్యార్థులకు 11 నుంచి సెలవులు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజుల పాటు సెలవులను ప్రకటిస్తూ మంగళవారం ఉత్తరులు జారీ చేసింది. ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చింది.


అసంక్రమిత వ్యాధులపై నేడు, రేపు జాతీయ స్థాయి సమావేశం

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ)పై బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశం జరగనుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసింది. శామీర్‌పేట్‌లోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎమ్)లో భాగంగా ప్రతీ రెండేళ్లకోసారి దేశ రాజధాని ఢిల్లీలో అసంక్రమిత వ్యాధులపై సమావేశాలు జరుగుతుంటాయి. కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వశాఖ ఇంతవరకు ఇటువంటి జాతీయ స్థాయి సమావేశాన్ని ఢిల్లీలో తప్ప ఇతర రాష్ట్రాల్లో ఒక్కసారి కూడా నిర్వహించలేదు. ఒక రాష్ట్రంలో ఇటువంటి జాతీయ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. ఈ సమావేశానికి కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సౌరబ్ జైన్(ఎన్‌సీడీ), జాతీయ ఆరోగ్య మిషన్ ఎండీ ఆరాధన పట్నాయక్‌తో పాటు అదనపు డైరెక్టర్ డాక్టర్ ఎల్. స్వస్తిక్ చరణ్, అన్ని రాష్ట్రాలకు చెందిన ఎన్‌హెచ్ఎమ్ ఎండీలు, ఎన్‌సీడీ కార్యక్రమ అధికారులు హాజరవుతున్నారు. తొలిరోజు ప్రముఖ వైద్యుల ప్రసంగాలుంటే, రెండోరోజు నాలుగైదు జిల్లాల్లో కేంద్ర బృందంతో పాటు ఆయా రాష్ట్రాల ఎన్‌హెచ్ఎమ్ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయనున్నారు. మేడ్చల్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్ జిల్లాల్లో నిర్వహిస్తోన్న ఎన్‌సీడీ పరీక్షలను స్వయంగా పరిశీలించనున్నారు.

కేటీఆర్‌పై ప్రాథమిక కేసు ఉంది!

ఈ దశలో దర్యాప్తును అడ్డుకోవడం సరికాదు

- మంత్రిమండలి ఆమోదం, ఆర్థికశాఖ అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులు వాడారు
- ఆరోపణలన్నీ కలిపి చూస్తే నిధుల దుర్వినియోగం కనిపిస్తోంది
- దర్యాప్తు కొనసాగనివ్వడానికి ఈ ఆధారాలు చాలు: హైకోర్టు



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ రేసు కేసులో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం కొట్టేసింది. ఈ తీర్పుతో కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదన్న మధ్యంతర ఉత్తర్వులు తొలగిపోయాయి. అప్పీలుకు వెళ్లేందుకు వీలుగా పది రోజులపాటు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కేటీఆర్ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని సైతం హైకోర్టు తోసిపుచ్చింది. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో కేటీఆర్‌పై ఉన్న అభియోగాలను పరిశీలిస్తే ప్రాథమికంగా కేసు ఉందని జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం లేకుండా, ఆర్థిక శాఖ అనుమతి పొందకుండా హెచ్ఎండీఏ నిధులను భారీ మొత్తంలో విదేశీ కంపెనీకి చెల్లించాలని పిటిషనర్ ఆదేశించారని గుర్తుచేసింది. "ఈ చెల్లింపులను పిటిషనర్ దురుద్దేశంతో చేయమని ఆదేశించారా? తన లబ్ధి కోసం చెల్లించమన్నారా? థర్డ్ పార్టీకి లబ్ధి కలిగించేందుకు చెల్లించాలని ఆదేశించారా? అన్న విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఆరోపణలన్నీ కలిపి పరిశీలిస్తే తప్పు జరిగినట్లు, హెచ్ఎండీఏ నిధులు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా కేసు కనిపిస్తోంది. దర్యాప్తు కొనసాగించడానికి ఈ అంశాలన్నీ సరిపోతాయి. అలాగే ఈ ఆరోపణలన్నింటిపై దర్యాప్తుకు, ఆధారాలు సేకరించడానికి తగిన అవకాశం, సమయం విచారణ సంస్థకు ఇవ్వాలి. 'స్టేట్ వర్సెస్ ఎం.మరిదాస్' కేసులో ఎఫ్ఐఆర్ నమోదైన మరుసటి రోజే మద్రాస్ హైకోర్టు దాన్ని కొట్టేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. దర్యాప్తు సంస్థకు తగిన అవకాశం ఇవ్వకుండానే ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడం సరికాదని పేర్కొంది. ప్రస్తుత కేసులోనూ డిసెంబరు 18న ప్రభుత్వం ఏసీబీకి ఫిర్యాదు చేసింది. 19న ఎఫ్ఐఆర్ నమోదైంది. 20న కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలు సేకరించడానికి దర్యాప్తు సంస్థకు తగిన అవకాశం, సమయం ఉండాలి. దర్యాప్తుకు భంగం కలిగించడం తొందరపాటు చర్యే అవుతుంది. ఒకసారి ప్రాథమిక కేసు ఉందనే నిర్ధారణకు వచ్చిన తర్వాత.. దురుద్దేశం, నిజాయతీ లేకపోవడం, నిధుల దుర్వినియోగం, మూడో పార్టీకి లబ్ధి కలిగించడం వంటివన్నీ దర్యాప్తులో తేలాల్సిన అంశాలు. ఈ తీర్పులో చేసిన వ్యాఖ్యలన్నీ ప్రస్తుత పిటిషన్‌ను పరిష్కరించడానికి చేసినవి మాత్రమే" అని ధర్మాసనం పేర్కొంది. క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు, అరెస్ట్ చేయరాదన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది.

నేరం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో ఉండక్కర్లేదు..

ప్రత్యేకంగా ఒక నేరం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో వెల్లడించాల్సిన లేదా నిరూపించాల్సిన అవసరం లేదని హైకోర్టు పేర్కొంది. ఎఫ్ఐఆర్ ఎన్‌సైక్లోపీడియా కాదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావించింది. "పిటిషనర్ పేర్కొంటున్నట్లు ఐపీసీ 409, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(1)(ఏ)లకు కావాల్సిన ముడిసరుకు ఎఫ్ఐఆర్‌లో లేదని అనుకున్నా దాన్ని కొట్టేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే నేరం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో వెల్లడించాల్సిన అవసరం లేదు. జరిగిన నేరానికి సంబంధించిన ప్రాథమిక ఆరోపణ ఉంటే చాలు. సదరు ఆరోపణలపై దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. నమ్మడానికి వీలైన ఆరోపణలకు సంబంధించిన ప్రాథమిక కేసు ఉంటే దర్యాప్తు చేయొచ్చు. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయని అనేక అంశాలు సైతం బయటకు రావచ్చు. ఎఫ్ఐఆర్‌లో పెట్టిన సెక్షన్లకు తగిన ముడిసరుకు లేకపోయినా.. ఇతర నేరాలకు దారితీసే అవకాశం ఉన్న పక్షంలో అలాంటి ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి వీలుండదు. ఉదాహరణకు ప్రస్తుత కేసులో పెట్టిన సెక్షన్లకు సంతృప్తికరంగా ఆధారాలు ఉండకపోవచ్చు. కానీ, ఐపీసీ సెక్షన్ 420 లేదా ఇతర నేరాలకు సంబంధించిన ప్రాథమిక కేసు అయితే స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సందర్భంలో పూర్తిగా ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడం సరి కాదు. బీఎన్ఎస్ఎస్ 528 (క్వాష్ పిటిషన్)లో చూడాల్సినది.. ఒక నేరం జరిగిందా, లేదా? అని కాదు. నేరం జరిగిందని నిరూపించే తీవ్రస్థాయి ఆరోపణలు ఉన్నాయా? లేవా? అన్నదే హైకోర్టు చూడాలి" అని పేర్కొంది.

క్వాష్ పిటిషన్‌లో మినీ ట్రయల్ చేయకూడదు

ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి బీఎన్ఎస్ఎస్ 528 కింద కోర్టుకు ఉన్న అధికారాన్ని న్యాయానికి విఘాతం కలిగినప్పుడు, ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్న సందర్భంలో అత్యంత అరుదుగా వినియోగించాలని హైకోర్టు పేర్కొంది. "ప్రభుత్వ విభాగాలకు ఉన్న దర్యాప్తు అధికారాన్ని అడ్డుకోవడానికి సైతం పరిమిత అవకాశాలు ఉంటాయి. ఆరోపణలు సరైనవా? కావా? అనే అంశంలోకి వెళ్లి మినీ ట్రయల్ నిర్వహించడం కూడా సరికాదు. 'భజన్‌లాల్' కేసు నుంచి 'నిహారిక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' కేసు వరకు సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. నేరపూరిత విశ్వాస ఘాతుకం అనే ఆరోపణకు ముడిసరుకు లేదని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే పేర్కొంటున్నారు. ఇందుకు ఉదాహరణగా 'కామన్ కాజ్' తీర్పును ఉదహరిస్తున్నారు. దవే వాదనతో మేం ఏకీభవించడం లేదు. 'కామన్ కాజ్' తీర్పులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుకు సంబంధం లేదు. ప్రస్తుత కేసులో పిటిషనర్ కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేశారనేది ఆరోపణ. హెచ్ఎండీఏ అనేది ప్రత్యేక సంస్థ. ఆస్తులు కలిగి ఉండడానికి, ఒప్పందాలు చేసుకోవడానికి, దావాలు వేయడానికి, ఎదుర్కోవడానికి అధికారం ఉన్న సంస్థ. హెచ్ఎండీఏ ఎంఏయూడీ అధీనంలో పనిచేస్తుంది. పిటిషనర్ పురపాలక శాఖ మంత్రిగా హెచ్ఎండీఏను నియంత్రిస్తారనడంలో సందేహం లేదు. ఫార్ములా-ఈ రేస్ ఒప్పందంలోకి హెచ్ఎండీఏ ప్రవేశించడానికి సంబంధించిన నోట్‌ఫైల్‌ను పిటిషనర్ ఆమోదించారు. ప్రాథమికంగా పరిశీలిస్తే హెచ్ఎండీఏ నిధులు పిటిషనర్ అధీనంలో ఉన్నట్లే. పిటిషనర్ విశ్వాస ఘాతుకానికి పాల్పడినట్లు ఎవరో సాధారణ వ్యక్తులు ఆరోపించడం లేదు. పిటిషనర్ ఇతరులతో కలిసి కుట్రపూరితంగా హెచ్ఎండీఏ నిధులు దుర్వినియోగం చేశారని బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి (మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి) ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ ప్రభుత్వ ఆస్తి తన అధీనంలో లేదని, ఎలాంటి 'ఎంట్రస్ట్‌మెంట్' లేదనే పిటిషనర్ వాదనతో ఏకీభవించలేం. అలాగే దురుద్దేశం, దుర్వినియోగం ఆరోపణలు దర్యాప్తులో మాత్రమే తేలుతాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పురపాలక శాఖ మంత్రిగా హెచ్ఎండీఏ నిధులు కేటీఆర్ అధీనంలోనే ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని హైకోర్టు పేర్కొంది. 'అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13ను పరిశీలిస్తే పబ్లిక్ సర్వెంట్ నేరపూరిత దుష్ప్రవర్తనను సూచిస్తోంది. విస్తృతంగా చర్చించిన వాస్తవాల ప్రకారం హెచ్ఎండీఏ మునిసిపల్‌శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తోంది. అయితే పిటిషనర్ నిధుల్ని దుర్వినియోగం చేశారా? లేదా? అనేది దర్యాప్తులో తేలాలి. దీనిప్రకారం ప్రాథమికంగా కేసు ఉన్నట్లే" అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

సుప్రీంను ఆశ్రయించిన కేటీఆర్

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు కేసులో క్వాష్ పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వారంలోనే పిటిషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయని కేటీఆర్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు చెప్పారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. కేటీఆర్ పిటిషన్‌లో తమ వాదనలను కూడా వినాలని కోరింది.

పాస్‌పోర్టు సీజ్ చేయాలి: బల్మూరి

కేటీఆర్ ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఆయన పాస్ పోర్టును ఏసీబీ సీజ్ చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కోరారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ తప్పేమీ చేయకుంటే ఆయనకు లీగల్ టీమ్ ఎందుకని ప్రశ్నించారు. దొంగలకు అండగా ఉంటారో.. లేక ప్రజలకు అండగా ఉంటారో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆలోచించుకోవాలని కోరారు.

కోర్టు తీర్పు చెంపపెట్టు: ఆది

ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పు.. కేటీఆర్‌కు చెంపపెట్టు అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. "రాజకీయ కక్ష సాధింపు చర్యలంటూ హరీశ్ రావు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డిపైన వారు పెట్టిన కేసులన్నీ కక్షసాధింపులో భాగమేనా?" అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

అవినీతి చేస్తే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందా?: వేముల వీరేశం

ఫార్ములా ఈ రేసు విషయంలో నియమనిబంధనలు తుంగలోకి తొక్కి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసం చేసినట్లు కేటీఆర్ బుకాయిస్తున్నారని, అవినీతికి పాల్పడితే బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుందా? అని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రశ్నించారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆయన మాట్లాడుతూ.. ఏ తప్పూ చేయనట్లయితే దర్యాప్తు సంస్థల దగ్గరకు వెళ్లి కేటీఆర్ తన వాదనను వినిపించాలన్నారు.

జైలుకెళ్లడం ఖాయం: రామ్మోహన్‌రెడ్డి

హైకోర్టు తీర్పుతో కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమైందని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ కేసును తుపేల్.. లొట్టపీసు కేసని మాట్లాడిన కేటీఆర్.. సుప్రీం కోర్టుకు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించారు. కేటీఆర్ ఎన్ని వేషాలు వేసినా ఊచలు లెక్కపెట్టడం ఖాయమని ఆయన అన్నారు.

లొట్టపీసు కేసు అయితే భయమెందుకు?: రఘునందన్

నర్సాపూర్/మనోహరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసు లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానించిన కేటీఆర్ విచారణకు ఎందుకు భయపడుతున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. తప్పు చేయకుంటే విచారణ తర్వాత కడిగిన ముత్యంలా బయటికి రావాలన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర పోలీసులు మంచివాళ్లు, గొప్పవాళ్లు, నిజాయితీపరులు అని మాట్లాడిన కేటీఆర్.. ఇప్పుడు పోలీసులు మంచివాళ్లు కాదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

లొట్టపీసు కేసు పెట్టి శునకానందం!

హైకోర్టు క్వాష్ పిటిషన్ మాత్రమే కొట్టేసింది.. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాం.. అక్కడ న్యాయపోరాటం చేస్తా

- రేవంత్.. నువ్వు మొగోనివైతే ఫార్ములా-ఈపై చర్చకు రా!
- ముఖ్యమంత్రి ఒక బ్రోకర్.. ఒక మంత్రి కాంట్రాక్టర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఫార్ములా-ఈ రేస్ కేసుపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ
- రేవంత్‌కే శిక్షపడుతుంది: జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి



కేసీఆర్ ఇంటి వద్దకు భారీగా చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఎలాంటి అవినీతి జరగకపోయినా లొట్టపీసు కేసు పెట్టి కాంగ్రెస్ నేతలు శునకానందం పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పచ్చకామెర్ల వాళ్లకు లోకమంతా పచ్చగానే కనిపిస్తుందని.. రూ.50 లక్షలతో పట్టుబడిన వ్యక్తి అందరినీ దొంగల్లాగానే చూస్తారని ఎద్దేవా చేశారు. మూర్ఖపు ఆలోచనతోనే తనను ఈ కేసులో ఇరికించారని కేటీఆర్ అన్నారు. మంగళవారం నందినగర్‌లోని తన ఇంట్లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'లొట్టపీసు కేసుపెట్టి, కథలల్లి, శునకానందం పొందుతున్న చిట్టి నాయుడికి చెబుతున్నా. న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులపై నాకు నమ్మకం ఉంది. నువ్వు పెట్టిన అక్రమ కేసు నుంచి బయటపడతా' అని చెప్పారు. హైకోర్టులో కేవలం క్వాష్ పిటిషన్ మాత్రమే కొట్టేశారని, దీనిపై తాము సుప్రీంకోర్టుకు వెళ్లామని తెలిపారు. అక్కడ న్యాయపోరాటం చేస్తామన్నారు. 'నేను నేరం చేశానని హైకోర్టు చెప్పలేదు. కానీ, నాకు శిక్ష పడుతుందని, ఏదేదో జరిగిపోతుందని చాలా లీకులు ఇస్తున్నారు. సీఎం చెప్పేవి సూక్తులు కావని అందరూ గుర్తించాలి. నిన్న నా హక్కులకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించారు. ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన నన్ను విచారణ జరిపితే ఏమవుతుందోనని రేవంత్‌రెడ్డి భయపడ్డారు. అందుకే నన్ను లాయర్లతో రావొద్దన్నారు. పట్నం నరేందర్‌రెడ్డి చెప్పని మాటలను ఎఫ్ఐఆర్‌లో రాశారు. అలా తప్పుడు రాతలు రాస్తారనే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలన్నా. అందుకే 9న న్యాయవాది సమక్షంలో ఏసీబీ విచారణ జరిపేలా అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నా. ఏసీబీతోపాటు ఈడీ విచారణకు కూడా హాజరవుతా' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేసింగ్ వ్యవహారంలో అరపైసా అవినీతి కూడా జరగలేదన్నారు.

రేవంత్.. నువ్వు మొగోనివైతే..!

తాను ఏ తప్పూ చేయలేదు కాబట్టే ధైర్యంగా విచారణకు హాజరవుతున్నానని కేటీఆర్ చెప్పారు. 'ఏదో జరిగిపోయిందని శునకానందం పొందడం కాదు. రేవంత్.. నువ్వు మొగోనివైతే జూబ్లీహిల్స్‌లో మీ ఇంటిదగ్గర ఉన్న చౌరస్తా వద్ద చర్చకు రా. టీవీలకు లైవ్‌లు పెట్టించు. నీకు అన్నీ వివరిస్తా' అని సవాల్ విసిరారు. 'మా ఇంట్రెస్ట్ ఫార్మర్. సీఎం ఇంట్రెస్ట్ ఫార్ములా' అని ఎద్దేవా చేశారు. చిట్టినాయుడు లీకులకు బీఆర్ఎస్ శ్రేణులు ఆకర్షితులు కావొద్దని, ఆయనేమీ చేయలేరని చెప్పారు. 'మీరు నా గురించి కాకుండా రైతులు, తెలంగాణ ప్రజల సమస్యలపై మాట్లాడండి. ప్రభుత్వాన్ని నిలదీయండి' అని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ వేరు కాదని, ఇక్కడ ప్రభుత్వానికి రక్షణ కవచంలాగా బీజేపీ పనిచేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, జన్వాడ ఫాంహౌస్, ఇప్పుడు ఫార్ములా-ఈ.. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఏడాదిగా ఇలా ఏదో ఒక అంశాన్ని తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఒక బ్రోకర్ అయితే.. మంత్రి పొంగులేటి ఒక కాంట్రాక్టర్ అని వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల విషయంలో బాంబులేంటని, ఆ మంత్రి మాటలు విచిత్రంగా ఉన్నాయని చెప్పారు. గతంలో ఆయన బీఆర్ఎస్‌లోనే ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. కొడంగల్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.4,600 కోట్లు ఒక సంస్థతో కలిసి పొంగులేటి పంచుకున్నారని, దాన్నే క్విడ్ ప్రో కో అంటారని తెలిపారు. అన్ని పార్టీలకు ఇచ్చినట్టే గ్రీన్ కో వాళ్లు బీఆర్ఎస్‌కూ ఎన్నికల బాండ్లు ఇచ్చారని, వారికి తామేమీ తిరిగి ఇవ్వలేదు కాబట్టి అది క్విడ్ ప్రో కో కాదని చెప్పారు. కొత్తగా మంత్రి పదవి వచ్చిందని.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు గుంజుకుంటున్నారని, ఇంకా ఏవేవో చేస్తున్నారని, అవన్నీ ఎప్పుడో ఒకసారి బయటపడతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

కేటీఆర్ ఇంటి వద్దకు నేతలు

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఉన్న ఆయన నివాసానికి బీఆర్ఎస్ ముఖ్యులు తరలివచ్చారు. పార్టీ శ్రేణులు కూడా అధిక సంఖ్యలో వచ్చారు. తీర్పు సమయంలోనే అక్కడికి చేరుకున్న ఆయన సోదరి ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు మాజీమంత్రులు, పలువురు కీలక నేతలు తదుపరి ఏం చేయాలన్నదానిపై చర్చలు జరిపారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తారనే చర్చ జోరుగా సాగుతుండటంతో ఆయన నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఉదయం నుంచి నందినగర్‌లోని నివాసంలోనే ఉన్నారు. రాత్రికి కూడా తన విల్లాకు వెళ్లలేదు. ఆయనతోపాటు తల్లి శోభ, కేటీఆర్ సతీమణి శైలిమ కూడా నందినగర్‌లోనే ఉన్నారు.

రేవంత్‌రెడ్డికే శిక్షపడుతుంది

ఫార్ములా-ఈ కారు రేసు ఒప్పందాన్ని రద్దు చేసి.. ప్రభుత్వానికి నష్టం కలిగించినందుకు ఈ కేసులో రేవంత్‌రెడ్డికే శిక్ష పడుతుందని మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. చట్టాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తూ, ఒకరిద్దరు తాబేదారులైన అధికారుల సాయంతో సీఎం చేస్తున్న కుట్రలు, కుయుక్తులను ఛేదించి కడిగిన ముత్యంలా కేటీఆర్ బయటకు వస్తారని జోస్యం చెప్పారు. రేవంత్ సర్కారు బనాయించిన అక్రమ కేసులో ఏమీ లేదని, అంతా లొట్టపీసేనని ఎద్దేవా చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో రాహుల్ గాంధీ కూడా లాయర్‌తోనే విచారణకు హాజరయ్యారని, అలాంటప్పుడు కేటీఆర్‌కు ఎందుకు అనుమతి ఇవ్వరని ప్రశ్నించారు. రేసు జరగడానికి ఏడాది ముందే గ్రీన్ కో కంపెనీ బాండ్లు కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకూ ఆ కంపెనీ విరాళాలు ఇచ్చిందని చెప్పారు. ఆ తర్వాత బీఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి రాథోడ్, గొంగిడి సునీత, మాలోత్ కవిత, సునీతా లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జైలుకి వెళ్లి వచ్చిన రేవంత్ అందర్నీ జైలుకు పంపించాలని చూస్తున్నారని.. అందుకే కేటీఆర్‌పై అక్రమకేసు బనాయించి.. ఆయన్ను బద్నామ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు.

అరెస్టుకు వేళాయెనా..?

(మొదటిపేజీ తరువాయి)

సైతం సమాచారం ఇవ్వకుండా తెలంగాణ ఏసీబీ అధికారులు ఈ కార్యాలయంలోకి వెళ్లారు. అక్కడ పనిచేసే సిబ్బందిని మినహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. కార్యాలయంలోని కీలక రికార్డులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఫార్ములా-ఈ కారు రేసు కేసులో భాగంగానే గ్రీన్‌కో కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నట్లు అధికారులు మచిలీపట్నంలో చెప్పారు. ప్రతి అంశాన్ని పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలిపారు.



మచిలీపట్నంలోని గ్రీన్‌కో కార్యాలయంలో తెలంగాణ ఏసీబీ అధికారులు

నేడు ఏసీబీ ముందుకు అర్విందకుమార్..

ఫార్ములా-ఈ కారు రేసు కేసుకు సంబంధించి కీలక వ్యవహారాలు చక్కదిద్దిన నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్విందకుమార్‌ను బుధవారం ఏసీబీ అధికారులు విచారించనున్నారు. కేటీఆర్‌ను విచారించడానికి ముందే అర్విందకుమార్‌ను ప్రశ్నించడం వల్ల కేసు దర్యాప్తుకు సంబంధించిన కీలక అంశాలు బయటపడతాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఎఫ్ఈవో, ఏస్ నెక్స్‌జెన్, పురపాలక శాఖకు మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం అమల్లో ఉండగా.. రెండోసారి స్పాన్సరర్‌ను తప్పించి పురపాలక శాఖ, ఎఫ్ఈవో ఎందుకు ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది? తొలి ఒప్పందంలో భాగంగా రెండో సెషన్‌కు స్పాన్సరర్ కంపెనీ ఫీజు చెల్లించాల్సి ఉండగా ఎవరి ఆదేశాలతో హెచ్ఎండీఏ నుంచి రూ.46 కోట్లు విదేశీ కరెన్సీలో చెల్లించారు? అనే విషయాలపై అర్విందకుమార్ నుంచి వివరాలు సేకరించనున్నారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారతానంటూ ఇప్పటికే ఆయన ప్రభుత్వానికి సమాచారం ఇచ్చిన క్రమంలో విచారణ తర్వాత అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పట్లో తెర ముందు, వెనక జరిగిన విషయాలు బయటపెడితే మాత్రం కేటీఆర్ అరెస్టు మరింత సులభం అవుతుంది. అర్విందకుమార్ అప్రూవర్‌గా మారితే ఆయన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవచ్చు.

16న విచారణకు రండి: ఈడీ

ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి ఫెమా నిబంధనల ఉల్లంఘన ప్రకారం దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు కేటీఆర్‌ను ఈ నెల 16న విచారణకు రావాలని తాజాగా సమన్లు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని బుధవారం ఈడీ అధికారులు విచారించనున్నారు. ఇప్పటికే ఒకసారి ఈడీ నుంచి సమయం కోరిన బీఎల్ఎన్ రెడ్డి, నేటి విచారణకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని, ఆయన మరోసారి సమయం కోరితే మాత్రం తదుపరి చట్టపరమైన చర్యలకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.

న్యాయవాదిని అనుమతించకపోవడంపై హైకోర్టుకు..

న్యాయవాదితో కలిసి ఏసీబీ విచారణకు అనుమతించకపోవడంపై బుధవారం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. తన విచారణ న్యాయవాదుల సమక్షంలో జరిగేలా చూడాలని కోరతానన్నారు.

ఏసీబీ కార్యాలయానికి బంజారాహిల్స్ పోలీసులు..

ఫార్ములా-ఈ కారు రేసు దర్యాప్తులో విచారణలు, అరెస్టులు ప్రారంభం కానున్న క్రమంలో బంజారాహిల్స్ సబ్ డివిజన్ పోలీసు అధికారులు మంగళవారం ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఏసీబీ ఉన్నతాధికారుల నుంచి వారికి కొన్ని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. కేటీఆర్ తదితరుల విచారణ సమయంలో బందోబస్తుపై, ఒకవేళ అరెస్టులు జరిగితే అవసరమైన ఎస్కార్టు గురించి ఏసీబీ నుంచి పోలీసులకు సూచనలు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కమిషనర్‌తో కూడా ఏసీబీ ఉన్నతాధికారులు మాట్లాడినట్లు సమాచారం.

'ఫార్ములా-ఈ'లో కేటీఆర్ తప్పేలేదు

కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడతారు: హరీశ్‌రావు



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): "ఫార్ములా ఈ రేస్ వల్ల తెలంగాణకు మంచే జరిగింది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కోసం కేటీఆర్ కష్టపడ్డారు. ఈ వ్యవహారంలో అవినీతికి ఆస్కారమే లేదు. ఆయన ఏ తప్పూ చేయలేదు" అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నందినగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండోసారి ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహణ కోసం అడ్వాన్సు చెల్లించారని.. అందులో కేటీఆర్‌కు చేకూరిన లబ్ధి ఏమీ లేదన్నారు. ఆయనవైపు తప్పులేదు కాబట్టే విచారణకు సహకరిస్తున్నారని, తమకు న్యాయస్థానాలు, చట్టంపై గౌరవం ఉందని చెప్పారు. ఏసీబీ విచారణకు వెళితే ఆయన్ను 40 నిమిషాలు బయట నిల్చోబెట్టారని.. అయినా కేటీఆర్ ఓపికగా వ్యవహరించారన్నారు. ఇది కుట్రపూరితమైన కేసు అని, దీని నుంచి కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని సంపూర్ణ విశ్వాసంతో ఉన్నామని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి ఈ తరహా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వేధింపులు, కక్షసాధింపు చర్యలు ఎంతో కాలం సాగవన్నారు. బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులు పెట్టినా.. భయపడేదిలేదని, సీఎం రేవంత్ అక్రమాలను ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకుంటే మంచిదని హరీశ్ రావు సూచించారు.


సమీక్షలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి; చిత్రంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తదితరులు

తెలంగాణకు నాగార్జునసాగర్ జీవనాడి

- డ్యామ్ స్పిల్‌వేపై ఐఐటీ రూర్కీతో అధ్యయనం
- నివేదిక ఆధారంగా గుంతల పూడ్చివేత: ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని, ఆ ప్రాజెక్టును కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జలసౌధలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై మాజీ మంత్రి కె.జానారెడ్డి, నల్లగొండ ఎంపీ కె.రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ స్పిల్‌వే ఓగీపై ఏటా వరదల సమయంలో గుంతలు పడుతున్నాయని అధికారులు గుర్తు చేయగా.. మంత్రి స్పందించారు. స్పిల్‌వే గుంతలపై రూర్కీ ఐఐటీతో అధ్యయనం చేయించాలని, ఆ తర్వాత సిఫారసుల ఆధారంగా గుంతలు పూడ్చటానికి చర్యలు తీసుకోవాలని, కట్టను కాపాడుకోవడానికి వీలుగా చర్యలకు ఉపక్రమించాలన్నారు. సాగర్ డ్యామ్‌తో పాటు కాలువల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఐడీసీ) లిఫ్టుల కింద 4,69,138 ఎకరాల ఆయకట్టు ఉందని, ఆ లిఫ్టులన్నింటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, పూర్తి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. రూ.664 కోట్ల వ్యయంతో సాగర్ జలాశయం నుంచి నీటిని తరలించడానికి ఉద్దేశించిన నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులను చేపట్టాలని, రానున్న ఖరీఫ్ నాటికి 7600 ఎకరాలను ఫేజ్-1 కింద అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ ప్రాజెక్టులోని లో లెవల్ కెనాల్ లైనింగ్ చేపట్టాలని, 90.43 కిలోమీటర్లు ఉన్న కెనాల్‌కు 60 మిల్లీమీటర్ల మందంతో సీసీ లైనింగ్ పనులు చేపట్టాలని, డిస్ట్రిబ్యూటరీలకు కూడా మరమ్మతులు చేయాలని సూచించారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల్లో 30 వేల ఎకరాలను స్థిరీకరించడానికి వీలుగా 19 చిన్న లిఫ్టుల పనులు జరుగుతున్నాయని ఆయన వివరించారు.

హైడ్రాకు పోలీసు స్టేషన్

- స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఏసీపీ.. హోం శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి7(ఆంధ్రజ్యోతి) హైడ్రాను మరింత బలోపేతం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో భాగంగా హైడ్రాకు పోలీసు స్టేషన్ మంజూరు చేసింది. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు (ఏసీపీ) స్థాయి అధికారిని హైడ్రా పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమిస్తున్నట్లు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా పరిధి మూడు కమిషనరేట్లను దాటి ఓఆర్‌ఆర్ వరకు ఉండటంతో కేసుల నమోదు విషయంలో మూడు కమిషనరేట్లతో సమన్వయం చేసుకోవడం ఇబ్బందిగా ఉందని, తమకో ప్రత్యేక పోలీసు స్టేషన్ కేటాయిస్తే నేరుగా కేసుల నమోదు చేయడంతో పాటు దర్యాప్తు కొనసాగించి ఆక్రమణదారులకు శిక్షలు వేయించవచ్చునని హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వానికి లేఖ రాశారు. హైడ్రాకు చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండటంతో సీఎం దృష్టికి రంగనాథ్ రాసిన లేఖను హోంశాఖ అధికారులు తీసుకుని వెళ్లారు. ఆపై సీఎం ఆదేశాల మేరకు హైడ్రాకు పోలీసు స్టేషన్ కేటాయించారు. తెలంగాణ పోలీసుశాఖ నుంచి తగిన సిబ్బందిని డిప్యూటేషన్‌పై హైడ్రాకు పంపించాలని డీజీపీ జితేందర్‌కు హోంశాఖ సూచించింది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, లేఅవుట్లలో అక్రమాలు, చెరువుల్లో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఇకపై హైడ్రా నేరుగా కేసు నమోదు చేసే అవకాశం దొరకడంతో అక్రమ నిర్మాణాలకు ఊతం ఇచ్చిన అధికారులు గుండెల్లో వణుకు మొదలైంది.

వచ్చే కేబినెట్ భేటీలో 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఆమోదం: పొంగులేటి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే కేబినెట్ సమావేశంలో 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఆమోదం వస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం నూతన సంవత్సర డైరీని, ట్రెసా డైరీని మంత్రి ఆవిష్కరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని మంత్రి ఉద్యోగ సంఘాలకు సూచించారు. ఉద్యోగుల సమస్యలను ఒకొక్కటి పరిష్కరిస్తూ వస్తున్నామని, సంక్రాంతిలోపే ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వపు స్థానాలకు బదిలీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కె. చంద్రమోహన్, ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు వంగా రవీందర్ రెడ్డి, గౌతమ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

82 వేల టన్నుల సోయాబీన్ కొనుగోళ్లు

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సోయాబీన్ కొనుగోళ్లు పూర్తయ్యాయి. మొత్తం 82వేల మెట్రిక్ టన్నుల సోయాబీన్ కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొక్యూర్మెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించి 84 వేల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లకు అనుమతి ఇవ్వగా.. 82 వేల టన్నులు సేకరించినట్లు తెలిపారు. మార్కెట్ ధర క్వింటాలుకు రూ. 4,200 నుంచి రూ. 4,500 ఉంటే... రైతులు నష్టపోకుండా ఉండేందుకు క్వింటాలుకు రూ. 4,892 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించి సేకరించినట్లు తెలిపారు. ఆదిలాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో... 42 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 47,124 మంది రైతుల నుంచి... రూ. 398 కోట్ల విలువైన సోయాబీన్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సోయాబీన్ కొనుగోళ్లు పూర్తయ్యాయని, కేంద్రాలు మూసివేసినట్లు తెలిపారు.

ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి ప్రశాంత్ కిశోర్

బీపీఎస్సీ పరీక్షను రద్దు చేయాలంటూ 4 రోజులుగా నిరాహార దీక్ష

దాంతో డీహైడ్రేషన్, ఇన్ఫెక్షన్, నిస్సత్తువ.. డాక్టర్ సలహాతో ఆస్పత్రికి

పట్నా, జనవరి 7: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ స్థాపకుడు ప్రశాంత్ కిశోర్ మంగళవారం ఆసుపత్రిలో చేరారు. నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేస్తుండడంతో ఆయన ఆరోగ్యం క్షీణించిందని, వైద్యుల సలహా మేరకు ఆయనను ఆసుపత్రికి తరలించామని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రశాంత్ కిశోర్ డీహైడ్రేషన్‌కు గురయ్యారని, ఇన్ఫెక్షన్‌తో పాటు నిస్సత్తువతో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. బిహార్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (బీపీఎస్సీ) ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయని.. పరీక్షను రద్దు చేయాలని పేర్కొంటూ జనవరి 2న ప్రశాంత్ కిశోర్ పట్నాలోని గాంధీ మైదాన్‌లో ఆమరణ నిరాహార దీక్షకు దిగగా సోమవారం పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మళ్లీ ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ కోర్టు ఆయనకు షరతులు లేని బెయిలును మంజూరు చేసింది. ఆసుపత్రికి వెళ్లే ముందు ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ, తన డిమాండ్ నెరవేరే వరకు ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

మార్చి నెలాఖరుకు

మెట్రో డీపీఆర్‌లు సిద్ధం


క్రిమినల్ చట్టాలపై హ్యాండ్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రావాల్సిన అవసరం లేకుండా అన్నీ అక్కడే అందుబాటులో దొరికేలా కూడలిని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మూడు మెట్రోల డీపీఆర్‌లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొంది ఏప్రిల్ నెలాఖరుకు టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్ల నిర్మాణాలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాలపై సీఎం మంగళవారం తన నివాసంలో పురపాలక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం- ఫ్యూచర్ సిటీ మెట్రో (40 కి.మీ), జేబీఎస్-శామీర్ పేట మెట్రో (22కి.మీ), ప్యారడైజ్ -మేడ్చల్ మెట్రో (23కి.మీ) మార్గాలకు సంబంధించిన భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. కాగా ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాలని అధికారులకు సీఎం సూచించారు. అలైన్‌మెంట్ రూపొందించే సమయంలో క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలని, మేడ్చల్ మార్గంలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్‌లను పరిగణనలో ఉంచుకుని మెట్రో లైన్ తీసుకెళ్లాలని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీఎం చెప్పారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పురపాలక శాఖ అధికారులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై హ్యాండ్ బుక్ ఆవిష్కరణ

తెలంగాణ జైళ్ల శాఖ రూపొందించిన కొత్త క్రిమినల్ చట్టాలపై హ్యాండ్ బుక్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా సహకారంతో జైళ్ల శాఖ రూపొందించిన హ్యాండ్ బుక్‌ను సీఎం ఆవిష్కరించారు. జైళ్ల శాఖ రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని సీఎం ఆవిష్కరించారు. ఐజీలు రాజేశ్, మురళీ బాబు, డీఐజీలు డి. శ్రీనివాస్, సంపత్ ఇతర అధికారులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు

రవాణా శాఖ మంత్రుల భేటీలో మంత్రి పొన్నం

న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మే మొదటి వారంలో తెలంగాణలో వాహన్ సారథిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అధ్యక్షతన 42వ రవాణా అభివృద్ధి మండలి సమావేశం జరిగింది. దీంట్లో అన్ని రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు పాల్గొన్నారు. ఇందులో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రవాణా శాఖ అమలు చేస్తున్న విధానాలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వం గడువు తీరిన వాహనాలను తుక్కుగా మార్చే పాలసీ, విద్యుత్ వాహనాల పాలసీ తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించేందుకు 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి 'వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్' అమలుచేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ ప్రాంతంలో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని రవాణా శాఖ సేకరించిందని, అందులో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు.


రవాణా శాఖ మంత్రుల సమావేశంలో మంత్రి పొన్నం

గోదావరి-బనకచర్ల అనుసంధానంపై

వివరాలు ఇవ్వండి

- గోదావరి, కృష్ణా బోర్డులకు కేంద్ర జల వనరుల సంఘం లేఖ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం చేపట్టదలిచిన గోదావరి-బనకచర్ల అనుసంధాన(లింక్) ప్రాజెక్టుపై వివరాలు ఇవ్వాలని గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులను కేంద్ర జలశక్తి శాఖ కోరింది. ఈమేరకు మంగళవారం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) లేఖ రాసింది. గోదావరిలో వరద జలాల ఆధారంగా కోస్తాంధ్ర, రాయలసీమలో 80 లక్షల మందికి తాగునీటితో పాటు 7.41 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడం, 22.58 లక్షల ఎకరాల స్థిరీకరణ లక్ష్యంతో రూ.80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించింది. అంతేకాకుండా నాగార్జున సాగర్ నుంచి కూడా బొల్లాపల్లి అనుసంధానం చేపట్టి, సాగర్ కుడి కాలువను విస్తరించి, వరద జలాలను తరలించాలని ఏపీ యోచిస్తోంది. దీనికి ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(ఏబీపీ) కింద సహాయం అందించాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కాగా కేంద్ర జల వనరుల సంఘం తెలంగాణకు దీనిపై లేఖ రాసి... అభిప్రాయం తీసుకున్న తర్వాత దాన్ని జోడించి కేంద్రానికి పంపించే అవకాశాలున్నాయి. అయితే ఈ ప్రాజెక్టును తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. గోదావరి-బనకచర్ల అనుసంధానంతో పాటు పోలవరం ముంపుపై ఏపీకి సమగ్రంగా లేఖ రాయాలని, ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించాలని సీఎం ఆదేశించారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంలో సాగర్‌ను వినియోగించడాన్ని ప్రధానంగా తెలంగాణ తప్పు పడుతోంది. తెలంగాణలో గోదావరిపై కడుతున్న ప్రాజెక్టులతో పోలవరం ప్రాజెక్టుపై ప్రభావం పడుతుందని ఏపీ పలుమార్లు లేఖలు రాయడాన్ని కూడా తెలంగాణ తప్పు పడుతోంది. దాంతో గోదావరి, కృష్ణా బోర్డులతో పాటు కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి లేఖలు రాయాలని తెలంగాణ నిర్ణయించింది.

13 నుంచి కైట్ ఫెస్టివల్

సంక్రాంతి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని జనవరి 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు పరేడ్ మైదానంలో అంతర్జాతీయ కైట్‌ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు పర్యాటక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా తదితర దేశాల నుంచి ఫ్లైయర్‌లు తరలి వచ్చి గాలిపటాలను ఎగురవేయనున్నారు.


వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతుల వద్దకు వ్యాపారులు వెళ్లికొనేలా 3 ఆధునిక మార్కెట్లు!


- మరో వెయ్యి రైతు వేదికల్లో వీసీ యూనిట్లు
- వ్యవసాయ విశ్వవిద్యాలయంలో భవన నిర్మాణాలకు కొత్త ప్రతిపాదనలు
- బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు రైతుల వద్దకు వెళ్లి పంటల ఉత్పత్తులు కొనుగోలుచేసేలా రాష్ట్రంలో మూడు ఆధునిక మార్కెట్లను అధునాతన హంగులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వ్యవసాయ యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పన, కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారుచేయాలని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ రంగాల బడ్జెట్ ప్రతిపాదనలు, పథకాల పురోగతిపై అధికారులతో సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో వెయ్యి రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ఏర్పాటుకు, రైతు వేదికల నిర్వహణకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. పొలాల వద్దకే వెళ్లి భూసార పరీక్షలు చేయాలని సూచించారు. అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యాలను గుర్తెరిగి పనిచేయాలని సూచించారు. మార్కెట్ కమిటీల పునర్విభజనకు వస్తున్న ప్రతిపాదనలను దీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడంపై ఆ శాఖ ఉన్నతోద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడు రోజుల్లో అన్ని విజ్ఞప్తులు పరిశీలించిన నివేదిక పంపించాలని డైరెక్టర్ ఉదయ్ కుమార్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై స్పందించని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్న, సన్నకారు రైతులు మేలుకలిగేలా వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మసేద్యం పరికరాల పంపిణీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలని తుమ్మల సూచించారు. బడ్జెట్ ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఆదేశాలు జారీచేశారు. మూడు నెలల ప్రణాళికతోపాటు 2025-26 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. కాగా రైతుభరోసా అమలు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. రాష్ట్ర స్థాయి అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించిన విధంగా ఈ యాసంగి నుంచి వ్యవసాయానికి అనువైన భూములన్నంటికి రైతుభరోసా వర్తింపచేసి, వ్యవసాయయోగ్యం కాని భూములను గుర్తించేందుకు సాంకేతికతను వాడుకోవాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై త్వరలో 2 రోజుల స్పెషల్ డ్రైవ్

రాష్ట్రంలో త్వరలో రియల్ ఎస్టేట్ పుంజుకుంటుంది.. రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా పెరుగుతుంది

- బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు అడ్డగోలుగా అన్యాక్రాంతం
- దీనిపై సీసీఎల్ఏ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొన్ని కారణాల వల్ల ఎల్‌ఆర్‌ఎస్ అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందు కోసం త్వరలో రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ పెడతామని తెలిపారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో లేదని, అయితే, రాబోయే 3 నెలల్లో ఈ పరిస్థితి మారే అవకాశం ఉంటుందని మంత్రి అన్నారు. గతేడాదితో పోల్చితే 2శాతం అదనపు ఆదాయం రావచ్చన్నారు. త్వరలోనే రియల్ ఎస్టేట్ కూడా పుంజుకుంటుందని చెప్పారు. సచివాలయంలో మీడియా చిట్‌చాట్‌లో పొంగులేటి పలు అంశాలపై ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం అడ్డగోలుగా సాగిందని, ఆ భూముల స్వాధీనంతో పాటు బాధ్యులకు శిక్షల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై సీసీఎల్ఏ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సిద్దిపేటలో 484 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని చెప్పారు. సిరిసిల్లలో సుమారు 2వేల ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల గుప్పిట్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వం ఆధీనంలోకి తెస్తామన్నారు. భూములు ప్రైవేటుపరం కావడానికి బాధ్యులైన అధికారులపైనా చర్యలు ఉంటాయన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల వ్యవహారాల్లో ఇప్పటికే ఓ అధికారి పదవీ విరమణ చేయగా, ఇద్దరు అధికారులు సర్వీసులో ఉన్నారన్నారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకోబోతున్నామని స్పష్టం చేశారు.

సంక్రాంతి తర్వాత రెవెన్యూ ఫోరెన్సిక్ ఆడిట్

భూభారతి చట్టం అందుబాటులోకి రావడానికి ఇంకా 45 రోజుల సమయం పట్టొచ్చని పొంగులేటి అన్నారు. తహసీల్దార్లకు ఇచ్చిన మ్యుటేషన్ అధికారాలు దుర్వినియోగం కాకుండా ఈ కొత్త చట్టంలో నిర్దీత వ్యవధిలోగా మ్యుటేషన్ చేయాలంటూ కాలపరిమితి నిబంధన పెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ధరణి పోర్టల్‌లో సాంకేతిక మార్పులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టేందుకు మూడు సంస్థలను పరిశీలిస్తున్నామని పొంగులేటి చెప్పారు. ఈ కంపెనీల అనుభవాన్ని పరిగణలోకి తీసుకుని ఒక సంస్థకు ఫోరెన్సిక్ ఆడిట్ బాధ్యతలను అప్పగిస్తామన్నారు. సంక్రాంతి తరువాత రెవెన్యూ రికార్డులను ఫోరెన్సిక్ ఆడిట్‌కు అప్పగించబోతున్నామన్నారు.

వీఆర్‌వోలకు సంక్రాంతి లోపే రాత పరీక్ష!

గతంలో వీఆర్వోలుగా పనిచేసి మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థలో పని చేయడానికి సిద్ధంగా ఉన్న వారికి సంక్రాంతిలోపే పరీక్ష పెట్టాలని యోచిస్తున్నట్లు పొంగులేటి చెప్పారు. గ్రామ స్థాయిలో పని చేసే సిబ్బంది అక్కడి పరిస్థితులపై కనీసం తెలుగులో అయినా నివేదిక పంపేలా ఉండాలని, అలాంటి వారికే అవకాశం ఇస్తామని అన్నారు. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన 1,365 మందిని మాత్రం ఎలాంటి పరీక్ష లేకుండా నేరుగా రెవెన్యూలోకి తీసుకుంటామన్నారు.

పుంజుకున్న హైదరాబాద్ రియల్టీ

- 2024లో రికార్డు స్థాయిలో అమ్మకాలు
- కార్యాలయ, నివాస గృహాలకు డిమాండ్
- గృహ విక్రయాల్లో 12 శాతం వృద్ధి
- రూ.కోటి-రూ.2 కోట్ల ఇళ్ల వాటానే 45%
- హాట్ కేకుల్లా ప్రీమియం గృహాలు
- 8% పెరిగిన ఇళ్ల ధర

నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ స్థిరాస్తి (రియల్టీ) రంగంలో జోరు కొనసాగుతోంది. గత ఏడాది కూడా నగరం, దాని చుట్టుపక్కల రికార్డు స్థాయిలో కార్యాలయ (ఆఫీస్ స్పేస్) భవనాలు, నివాస గృహాలు అమ్ముడయ్యాయి. ఈ కాలంలో హైదరాబాద్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా 1.03 కోట్ల చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) విస్తీర్ణం గల ఆఫీస్ స్పేస్ అమ్మకం లేదా లీజు లావాదేవీలు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువ. 2020 తర్వాత నగరంలో కార్యాలయ స్థలాలకు ఇంత భారీగా డిమాండ్ ఏర్పడటం ఇదే మొదటిసారి. గత ఏడాది నమోదైన లీజుల్లో 77 శాతం హైటెక్ సిటీ ప్రాంతంలోనే నమోదవడం విశేషం. దీనికి తోడు గత ఏడాది కొత్తగా 1.56 కోట్ల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ నిర్మాణం పూర్తయింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 139 శాతం ఎక్కువ. రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా సంస్థ విడుదల చేసిన 'ఇండియా రియల్ ఎస్టేట్: రెసిడెన్షియల్ అండ్ ఆఫీస్' (2024జూలై-డిసెంబరు) నివేదిక ఈ విషయాలు తెలిపింది. నివాస గృహాల మార్కెట్లోనూ అప్‌ట్రెండ్ కొనసాగింది. గత ఏడాది జీహెచ్ఎంసీ పరిధిలో 36,974 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. 2023తో పోలిస్తే ఇది 12 శాతం ఎక్కువని ఆ నివేదిక తెలిపింది. ధరలపరంగా చూసినా 2023తో పోలిస్తే నివాస గృహాల ధర సగటున 8 శాతం పెరిగింది. అయితే కొత్త నివాస గృహ ప్రాజెక్టుల ప్రారంభం మాత్రం కొద్దిగా నీరసించింది. గత ఏడాది మొత్తానికి నగరం, దాని చుట్టుపక్కల 44,013 నివాస గృహాలకు సంబంధించిన ప్రాజెక్టులు మాత్రమే ప్రారంభమయ్యాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 6 శాతం తక్కువ. ప్రస్తుతం హైదరాబాద్‌లో రూ.కోటి నుంచి రూ.2 కోట్ల మధ్య ధర ఉన్న ఇళ్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. గత ఏడాది అమ్ముడైన ఇళ్లలో వీటి వాటా 45 శాతం వరకు ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. 2023తో పోలిస్తే ఇది 8 శాతం ఎక్కువ. బెంగళూరు తర్వాత దేశంలో హైదరాబాద్‌లోనే పలు అంతర్జాతీయ సంస్థలు తమ గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాల (జీసీసీ)ను ఏర్పాటు చేస్తున్నాయి. గత ఏడాది హైదరాబాద్, దాని చుట్టుపక్కల నమోదైన 103 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ అమ్మకం, లీజు లావాదేవీల్లో 49 శాతం (51 లక్షల ఎస్ఎఫ్‌టీ) ఈ కంపెనీలే తీసుకున్నట్టు నైట్ ఫ్రాంక్ తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.